సంపుటి:3
సంచిక :7
పుటలు :52
రు. 20/–లు
తెనాలి

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2017




ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



సెప్టెంబరు 9 : కాళోజి జయంతి
తెలుగు మాండలిక భాషాదినోత్సవం / తెలంగాణ భాషాదినోత్సవం

"వాడుక బాస అంటే
రాయ వచ్చినోడు రాసే
దస్తూరి వలె కాదా?
దస్తూరిలో లిపి వలెనే
మాటల్లో యాస కాదా
దస్తూరీలో అక్షరాల
రూపువలెనే
మాటలు ఉచ్చారణ అవును కదా?"

"ఆంధ్రప్రదేశ్ పరిపాలనాభాషగా తెలుగును చెయ్యండి.
తెలుగు .. తెలుగే ... తెలుగే ....
నామీద, ప్రజలమీద గౌరవంతో ఈ నిబంధన పెట్టండి.
అమ్మను, అమ్మభాషను, మాతృదేశాన్ని మరువవద్దు.
తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పనిచెయ్యండి."

భాషోద్యమ కథానికలు :

- మాతృభాష...జిందాబాద్ - యర్రంశెట్టి శాయి
- బతుకుబడి -కరణం కళ్యాణ్‌కృష్ణకుమార్

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషావిధానాన్ని ప్రకటించాలి

# ఆగస్టు 29 : తెలుగు భాషాదినోత్సవం




## ఏడు అకాడెమీలకై జి.ఒ.లు, ప్రాధికార సంస్థకై త్వరలోనే చట్టం.

## ..... ఇప్పటికి ఇంతే.

### ఉనికికోసం తెలుగు; బ్రతుకుకోసం ఇంగ్లీషు –ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి సందేశం!

గిడుగు రామమూర్తి గారి జయంతి సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికోసం పునరంకితమవుదామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు ఇచ్చారు. 'ఎక్కడికి పోయినా మన ఉనికిని గుర్తుపట్టేది భాషవలననే. భాషతోనే ఎదుటివారిని గుర్తిస్తాం...సిలికాన్ వ్యాలీలో ఉన్న భారతీయుల్లో కూడా మొదటి స్థానంలో తెలుగువారే ఉన్నారు' అని ఆయన అన్నారు.

'మా పార్టీ పేరులోనే తెలుగు ఉంది. అది ఎన్టీ రామారావుగారి సంకల్పం. 'మా తెలుగు తల్లికీ మల్లెపూదండ' గీతాన్ని రాష్ట్రగీతం చేసిన ఘనత, తెలుగువారి ఆత్మాభిమానానికి గుర్తుగా 'చేయెత్తి జై కొట్టు' పాటను ప్రచారం చేసిన ఘనత కూడా తెలుగు దేశం పార్టీదే" అన్నారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు. "తెలుగు భాషా సంస్కృతులను కాపాడుకోవడం, భావి తరాలకు అందించడం మన బాధ్యత. ఇంగ్లీషు రాకపోయినా ఎలిమెంటరీ విద్యను తెలుగులో చదువుకొన్నవారు కూడా ప్రపంచంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొంటున్నారు..భాషను మరిచిపోతే తల్లిని మరిచిపోయినట్లే.."

"తెలుగుకోసం గట్టిగా కృషిచేస్తున్నాం. కమిటీ వేశాం. భాష, సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, వారసత్వ సంపద కోసమే ఇదంతా..ఇందుకోసం కమిటీ చెప్పినట్లు ఏడు అకాడమీలను ప్రారంభిస్తున్నాం. (ఇందుకు సంబంధించిన జి.ఒ.లను ఆయన ఈ సందర్భంగా భాషాసాంస్కృతిక శాఖ మంత్రి శ్రీమతి భూమా అఖిలప్రియతో కలిసి విడుదలచేశారు.)

ఇంతకు ముందున్న అధికారభాషాసంఘం స్థానంలో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్థాపించడం కోసం రేపోమాపో అసెంబ్లీలో బిల్లుపెట్టి చట్టాన్ని తెస్తాం. భాషను ప్రమోట్ చెయ్యడానికి కట్టుబడి ఉన్నాం. సంస్కృతిని కాపాడుకొంటే భాష ఉంటుంది. తెలుగు ప్రాచీన కేంద్రాన్ని త్వరలో అమరావతికి తెస్తాం.

కొత్త కార్యక్రమాన్ని ముందుకు తెచ్చాం, భాష, సంస్కృతి రంగంలో కుటుంబవ్యవస్థ ప్రత్యేకం. అభివృద్ధితోపాటు ఆనందం కూడా ఉండాలి. అందుకోసం నేనొక 'విజన్' ఇచ్చాను. 2022కల్లా దేశంలో మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా, 29కల్లా మొదటి స్థానంలోకి మనం రావాలి. కేవలం డబ్బే రక్షించదు అనేందుకు 'డేరాబాబా' ఉదంతాన్ని చూశాం. అందుకే 'ఆనందలహరి' అనే ఒక విస్తృత వేదికను పెట్టాం. ప్రతి శనివారం జిల్లాకేంద్రాల్లో, మండల కేంద్రాల్లో...ఈ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. కూచిపూడి నృత్యం, తెలుగు పద్య పఠనం, కళలు వంటివి ఉంటాయి. కళాకారుల్ని గౌరవించుకోవాలి. సంస్కృతిని కాపాడుకోవాలి. విద్య మొదలుకొని అన్ని విషయాల్లో ముందుంటాం. మూడేళ్ళుగా నిలదొక్కుకున్నాం. భాషను కాపాడుకోవటానికి ముందుంటాం. దీనికి అందరి సహకారం కావాలి."

తొలుత తను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే "పిల్లలను బాగా చదివించండి. అప్పుడు మీరు సంపాదించేదానికంటే అనేకరెట్లు వారు సంపాదించి మీకు అండ అవుతారని" నేనే తల్లిదండ్రులకు చెప్పాను. అ తర్వాత వారు పల్లెల్ని వదిలి పిల్లల చదువులకోసం పట్టణాలకు తరలడం ఎక్కువైందని, అందువల్ల మంచి ఫలితాలను ఇప్పుడు మనం చూస్తున్నామని ఆయన అన్నారు. ఆస్తులమ్మి ఇంగ్లీషు మీడియంకు వెళ్ళిపోతున్నారు అని ఆయన అన్నారు. "ప్రపంచంలోనే ఇంగ్లీషును ఎక్కువగా మాట్లాడేది భారత్‌లోనే. అమెరికాలో కాదు. చైనాలోకూడా కాదు. అయినా తెలుగు నేర్చుకోవాలి. జీవనంకోసం ఇంగ్లీషు నేర్చుకున్నా తెలుగును మన ఉనికి కోసం నేర్చుకోవాలి. ఇంగ్లీషును, తెలుగును కూడా కంప్యూటర్లలో అభివృద్ధిచేస్తాం..అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రసంగం ముగింపులో కూడా మళ్ళీ 'మేం కమిటీ వేశాం. వాళ్ళు రిపోర్టును సమర్పించారు. మీ అందరి సహకారంతో ముందుకు వెళ్తాం' అన్నారు. అమెరికాలో కూడా మనవాళ్ళు భాషాసంస్కృతులపై మక్కువ చూపుతున్నారని, ఇక్కడ మాత్రం మనవాళ్ళు పట్టుదల చూపడంలేదు అని ముఖ్యమంత్రి అన్నారు. గిడుగు రామమూర్తిగారి భాషాసేవ గురించి, ప్రాచీన ఆధునిక తెలుగు కవుల గురించీ ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు.

ఇదీ ముఖ్యమంత్రి ప్రసంగ సారాంశం. ఆయన రెండేళ్ళుగా చేసిన వాగ్దానాల గురించి ప్రస్తావించలేదు. బహుశా అన్నిటినీ ప్రాధికారసంస్థే చూసుకుంటుందనే భరోసాతో ఉన్నారేమో!

ఇంతకూ 2017 ఫిబ్రవరి నెలలో జారీచేసిన జి.ఒ.నెం.14ని రద్దుచేస్తామనిగాని, ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమం ఉంటుందనిగాని –ఆ ప్రసక్తే తేలేదు.

పరిపాలనను ప్రజలభాషలో చేస్తారో లేదో చెప్పనేలేదు.

అన్నిటికీ ఏకైక సమాధానం బహుశా.. ప్రాధికార సంస్థేనేమో?!

–అమ్మనుడి ప్రతినిధి.

సంపాదక హృదయం : ...7,8 పుటలు చదవండి.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...

◆ తెలుగుభాషోద్యమ నిర్మాణంకోసం...

◆ ఆంధ్ర,తెలంగాణల్లో, ఇతరరాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




సెప్టెంబరు 2017

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్ధిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచన లను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషావిధానాన్ని ప్రకటించాలి | | **7** |
| **ప్రాధికార సంస్థ :** | నివేదిక విశేషాలు | | **9** |
| **భాషోద్యమం :** | ప్రజలభాషలో పరిపాలిస్తేనే.... | **సామల రమేష్‌బాబు** | **15** |
| **భాషోద్యమం :** | భాషావిధానంపై బాధ్యతారాహిత్యం | **పులికొండ సుబ్బాచారి** | **17** |
| **పాఠశాల విద్య :** | అన్ని మునిసిపల్ పాఠశాలల్లో.... | | **19** |
| **అధికార భాష :** | తెలుగు అధికారభాష అనడం అబద్ధం | **మాడభూషి శ్రీధర్** | **20** |
| **పాఠశాల విద్య:** | సెల్ఫ్‌ఫైనాన్స్‌డ్ పాఠశాలల చట్టం... | **రమేష్ పట్నాయక్** | **23** |
| **పాఠశాల విద్య:** | నా గోడు వినిపించుకోరూ... | **ఎస్.ఆర్.పరిమి** | **25** |
| **పొరుగు తెలుగు :** | జగదల్‌పూరులో తెలుగువారు | **స.వెం.రమేశ్** | **31** |
| **సాహిత్యరంగం:** | వాడుకభాషలో వింతపోకళ్ళు | **మధురాంతకం నరేంద్ర** | **32** |
| **తెలంగాణ తెలుగుకోసం :** | భాషాసాహిత్యాల యుద్ధకవచం | **జయధీర్ తిరుమలరావు** | **34** |
| **పిట్టచూపు :** | బాబాల ముసుగులో..... | **చలసాని నరేంద్ర** | **34** |
| **బౌద్ధం-వైజ్ఞానిక మార్గం-5** | ..... | **బొర్రా గోవర్ధన్** | **42** |
| **జనవాణి :** | ..... | | **45** |
| **పెద్దోరి తీపి గురుతులు:** | విశ్వదాభిరామ కవి.... | **సన్నిధానం నరసింహశర్మ** | **48** |
| **గ్రంథాలయం :** | | | **50** |
| **భాషోద్యమ కథానికలు :** | మాతృభాష ..... జిందాబాద్ | **యర్రంశెట్టి శాయి** | **21** |
| | బతుకుబడి | **కరణం కళ్యాణ్‌కృష్ణ కుమార్** | **26** |
| **కవితలు :** | శాశ్వతం | **గుర్రాల రమణయ్య** | **14** |
| | భాషను బతికించుకోవద్దా | **గంటేడ గౌరునాయుడు** | **22** |
| | అన్నీ ఆయుధాలే | **కె.జి.వేణు** | **24** |
| | సాఫల్యం | **బి.వి.శివప్రసాద్** | **30** |
| | సజీవ స్వరాల యాస | **సడ్లపల్లె చిదంబరరెడ్డి** | **38** |
| | నేలను ఏలపాటలు... | **కత్తి పద్మారావు** | **46** |



రేఖా చిత్రాలు : **చిదంబరం** కార్టూన్లు : **సరసి, శేఖర్**

ముఖచిత్రం : **తమ్మా శ్రీనివాసరెడ్డి** కంప్యూటరీకరణ : **సోమయాజులు**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది**

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.



# నేటి తేట తెలుగు

**తేట** తెలుగు భాష అన్ని విధములా యోగ్యమైనది. అందరికీ సాధ్యమైనది. మాదిగ వెంకడు మొదలుకొని వెంకటావధానుల వరకున్ను వెయ్యింటికి 75గురు మాత్రమే ఓనమాలు వచ్చిన వారున్నప్పుడు గ్రాంథిక భాష వచ్చిన వారు 5 గురైనా ఉందురో, ఉండరో! అయితే నాగరికుల తెలుగు, తేట తెలుగు లోక వ్యవహారములలో ఇప్పుడు వాడుతూ వున్నవారే వెయ్యింటికి అధమపక్షము నూరుగురైనా ఉంటారు.

క్రమక్రమంగా వాడుక ఎక్కువయి అంతకంతకు దిగువ జాతులకు అది వ్యాపిస్తుంది. ఈ తేట తెలుగులో తెలివి కలిగించే విద్య అందరికీ సర్వసాధారణముగా చెప్పితే సరస్వతి తెలుగు దేశములో తాండవమాడదా? కొద్ది కాలములోనే తక్కిన దేశములతో పాటు మన తెలుగుదేశము కూడా నాగరికము కాదా?

ఎవరికీ సాధ్యము కాని, పసలేని పాత తెలుగులోనే అభిప్రాయాలు వ్యక్తపరచవలనన్న పిచ్చి ప్రయత్నాలు చేస్తూ ఉండబట్టి భాషకు ఏవిధమైన అభివృద్ధి లేకుండా ఉన్నది; గాని మనకు సులువుగా బోధపడుతూవున్న మన తెలుగునే ఆదరించిన ఎడల ఎంత ఉపచరి స్తుందో చూడండి.

ఇండస్ట్రియల్ రిఫార్మర్లు, పొలిటికల్ రిఫార్మర్లు, సానిటరీ రిఫార్మర్లు, అగ్రికల్చరల్ రిఫార్మర్లు, ఎడ్యుకేషనల్ రిఫార్మర్లు, లిటరరీ రిఫార్మర్లు ఈ తేటతెలుగున లెక్చర్లు నోటను ఫెళ్లుమని ఉరిమించవచ్చును గదా.

పాంపట్లు, పుస్తకాలు కురిపించవచ్చు గదా. విద్యలు పారించవచ్చుగదా. తెలుగువారి బుద్ధి సారవంతమై ఎట్టి పంట పండునో ఎవరు చెప్పగలరు? పండితులారా! మీ దురభిమానము విడిచి పెట్టండి. దేశమంతా విద్య కావలెనని మొరపెట్టుకుంటూ ఉన్నది.

సులభముగా వచ్చే తేటతెలుగులోనే విద్యనేర్పడము సులభమైనప్పుడు పాతభాష నేర్చుకొంటేనే గానీ విద్య సంపాదించడానికి వల్లకాదు అని మీరెందుకు అడ్డుపెట్టుతారు? మీరు గ్రామ్యులు కారుకదా? మీ నోటను వచ్చే మాట అశ్లీలము కాదు గదా? మీరు నిత్యమూ వాడుకొనే భాష శంఖములో పోసిన తీర్థము వంటిది, అదే అందరికీ ఇచ్చి ఉద్ధరించరాదా?

**-రావుసాహెబ్ గిడుగు రామమూర్తి పంతులు**
బి.ఏ.ఎల్.ఎల్.బి.

ఆంధ్రపత్రిక 1913 ప్రమాదీచ సంవవత్సరాది సంచికనందు ప్రచురింపబడినది.

# అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు.

**ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500 రూ. ఇవ్వబడుతుంది.**

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ఈ సంచికలో డా॥ వేదగిరి రాంబాబు కథానికతో ఈ అమ్మనుడి కథానికల పరంపర మొదలవుతున్నది.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004. కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136
e-mail : editorammanudi@gmail.com

**గమనిక :** కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. ఫైల్సులో *editorammanudi@gmail.com* కు పంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసినదానిని స్కాన్ చేయించి పంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులోగాని, కొరియర్‌లో గాని పంపించాలి.

# తెలుగు భాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య 1288/2003)

## అత్యవసర పరిశీలనకై

తేదీ:26.08.2017

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి
నమస్కారాలు

**విషయం : 29 ఆగష్టు 2017 తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా విన్నపం**

ఈ నెల 29న మళ్లీ తెలుగు భాషాదినోత్సవాన్ని మనం జరుపుకోబోతున్నాం. ఆ రోజున ప్రభుత్వం అధికారికసభలో తమ ప్రసంగం కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నాం. ఈ సందర్భంగా అత్యవసరమైన అంశాలను తమ దృష్టికి తేదలచుకొని ఇప్పుడు విన్నవిస్తున్నాం.

1. తెలుగురాష్ట్రంలో తెలుగుకు సాధికారత ఉండాలి. తెలుగుకు సాధికారత (Empowerment) లేనప్పుడు ఇది తెలుగురాష్ట్రం ఎలా అవుతుంది?! కాని, దురదృష్టవశాత్తు ఇప్పుడు మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. ఇంగ్లీషే దాదాపు పూర్తిగా అధికారభాషగా చెలామణి అవుతున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే తెలుగుకు ఆచరణ మొదలుకావాలి. ఇందుకు తమరు ఒక రాజకీయ సంకల్పం చెయ్యాలి. తమరు ఈ విషయమై పట్టుదల చూపకపోవడం వల్లనే అధికారులందరూ పైనుంచి కిందిస్థాయిదాకా దీన్నొక ఇంగ్లీష్ సామ్రాజ్యం చేస్తున్నారు. పరిపాలనలో అన్నిస్థాయిల్లో తెలుగే రాజ్యమేలాలి. దాని తర్వాతే – అవసరం ఉన్నంతవరకే ఇంగ్లీషుకు స్థానం ఉండాలి. ఈ తెలుగు భాషాదినోత్సవం నాడు తాము ఈ సంకల్ప ప్రకటనను వేదిక మీద నుంచి ప్రకటించాలని మేము కోరుతున్నాము. అందుకనుగుణంగా స్పష్టమైన ఆదేశాలను జారీచెయ్యాలని వేడుతున్నాం. కీ.శే. ఎన్.టి.రామారావుగారు తొలి ప్రభుత్వంలో దీన్ని సాధించారు. ఆయన తర్వాతి హయాం నుంచీ ముఖ్యమంత్రులు పట్టుదల వహించకపోవడంవల్లే తెలుగునేల మీద ప్రజల భాషకు సాధికారత లేకుండాపోయింది. తమరు ఈ విషయంపై పట్టుదల వహిస్తే మొత్తం పరిస్థితి మారిపోతుంది. ఈ రోజున తాము ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యానాయుడి గారికి అందించిన ఘనమైన పౌరసన్మాన సందర్భంలో వారు తమ ప్రసంగంలో అభిలషించింది ఇదే. తెలంగాణ పౌరసత్కారసభలోనూ ఆయన ఇదే చెప్పారు. దయచేసి, తమరు ఈ విషయంలో చొరవ తీసుకొని ఈ ప్రకటన చెయ్యాలని కోరుతున్నాము.

2. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చెయ్యాలన్న తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరికను మన్నించి, తాము 2016లో ఇదే రోజున ఒక కమిటీని ప్రకటించారు. అప్పుడు తాము చెప్పిన విధంగా వారిచ్చిన రిపోర్టును పూర్తిగా ఆమోదించి, చట్టపూర్వకంగా దానిని స్థాపిస్తారని మేమంతా ఆశిస్తున్నాము. ఈ సందర్భంగా – విద్యారంగానికి సంబంధించి కూడ తమ భాషావిధానంపై స్పష్టత నివ్వాలని కోరుతున్నాము.

3. ఫిబ్రవరి 2017లో మునిసిపల్ శాఖ జారీచేసిన జి.ఒ.నెం.14 వల్ల ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించారు. రెండు మాధ్యమాలూ ఉంటాయని ఒక ప్రక్కన చెబుతూనే, తెలుగుమాధ్యమంలో ఏమీ ప్రవేశాలు లేకుండా చేస్తున్నారు. తెలుగులో చదివితే భవిష్యత్తు ఏమీ ఉండదని సాక్షాత్తూ మునిసిపల్ మంత్రి శ్రీ నారాయణగారు ప్రచారం చేస్తున్నారు. అధికారులపై వత్తిడి తెస్తున్నారు, ఈ పరిస్థితిపై కూడా తాము విస్పష్టమైన ప్రకటన చెయ్యాలని కోరుతున్నాం. ప్రాథమికవిద్య మాతృభాషలోనే ఉండి తీరాలని, ఆ దశలో ఇంగ్లీషుగాని, మరి ఏ ఇతర భాష గాని ఒక సబ్జెక్టుగా తప్ప బోధనా మాధ్యమంగా పనికిరాదని విద్యావేత్తలు, జాతీయ, అంతర్జాతీయవేదిక (యునెస్కో) లు మొత్తుకొంటున్నా – ఈ శాస్త్రీయ పద్ధతిని త్రోసిరాజని, బడిలో అడుగుపెట్టిన దగ్గరనుంచీ పరభాషలో చదువుచెప్తామనే అరాచకపద్ధతిని అవలంబించడం జాతికి శ్రేయస్కరం కాదు. తాము ఈ విషయంలో సరైన చర్య చేపట్టాలని, ఈ అంశంపై ప్రకటన చెయ్యాలని కోరుతున్నాం.

ధన్యవాదాలతో

తెలుగు భాషోద్యమ సమాఖ్య తరఫున

సామల రమేష్‌బాబు

సామల రమేష్‌బాబు, అధ్యక్షుడు.
ఫోన్: 9848016136

సంపుటి : 3 సంచిక : 7
అమ్మనుడి
సెప్టెంబరు 2017

సంపాదకీయం

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషావిధానాన్ని ప్రకటించాలి

**ఆ**గస్టు 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన తెలుగు భాషాదినోత్సవం- గిడుగు జయంతి సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికరంగా ప్రసంగించారు. సరిగ్గా ఏడాది క్రింద అదే వేదికపై తాము ప్రకటించిన 'తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి అధ్యయన కమిటీ' నివేదికను ఇచ్చిందని, దాని కనుగుణంగా చర్యలు గైకొంటున్నామని ఆయన తెలియజేశారు. ఆ కమిటీ సూచించిన విధంగా ఏడు అకాడమీలను స్థాపించడానికి జి.ఒ.లను కూడా ఈ సభలో ముఖ్యమంత్రి విడుదల చేశారు. కమిటీ సూచించిన సాహిత్య అకాడమీ, సంగీత నృత్య అకాడమీ, నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, చరిత్ర అకాడమీ, గ్రామీణ సాంకేతిక మరియు జానపదకళల అకాడమీలకు అదనంగా శాస్త్ర సాంకేతిక అకాడమీని కూడా స్థాపించడానికి ఉత్తర్వులిచ్చారు. భాషోద్యమ సమాఖ్య, సాహిత్య, సాంస్కృతిక సంఘాలు ఎంతోకాలంగా కోరుతున్న అకాడమీల పునరుద్ధరణకై పని మొదలైంది. ఇందుకు వారికి మప్పిదాలు తెలుపుదాం.

2012 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంనాడు తెలుగు భాషోద్యమ సమాఖ్య హైదరాబాదులో నిర్వహించిన నిరసన సభలో నాటి ప్రతిపక్షనేతగా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమాఖ్య అప్పటికే 9 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టి వాటి సాధనకై ఉద్యమబాట పట్టింది. ఆ నిరసన సభలో సుమారు అరగంటసేపు మాట్లాడిన చంద్రబాబునాయుడు ఆ డిమాండ్లను పూర్తిగా బలపరచారు. వాటిలో తొలి అంశం- తెలుగుభాషకు ప్రత్యేక మంత్రిత్వశాఖను, దానితోపాటు ఒక ప్రాధికార సంఘాన్ని ఏర్పరచాలనేది. తర్వాత, డిసెంబరు 27-29 తేదీలలో తిరుపతిలో ప్రపంచ తెలుగు సభల్ని నిరసిస్తూ సమాఖ్య ప్రదర్శనలు, దీక్షలు, చేసింది. ఫలితంగా ఆ సభల తొలిరోజునే ముఖ్యమంత్రి అందులోకొన్ని డిమాండ్లను ఆమోదించినట్లు ప్రకటించారు. తర్వాత సరిగ్గా ఏడాదికి 31-12-2013న తెలుగుకు మంత్రిత్వశాఖ నేర్పరుస్తూ జి.ఒ. నెం.909 వచ్చింది. దాని ప్రకారం అప్పటిదాకా ఉన్న సాంస్కృతిక మంత్రిత్వ శాఖ- భాషా సాంస్కృతిక మంత్రిత్వశాఖగా పేరు మార్చుకొంది. 2014లో రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత కూడా రెండు రాష్ట్రాల్లో ఇదే పేరుతో మంత్రిత్వశాఖలు ఏర్పడ్డాయి - ప్రాధికార సంస్థ లేకుండానే!

ప్రాధికార సంస్థ లేకుండా మంత్రిత్వశాఖ చెయ్యగల పని ఏమీ ఉండదు. కానీ, తెలివితక్కువ రాజకీయాలవల్ల అప్పుడు తప్పు జరిగింది. ఆ తప్పును సరిదిద్దడానికి మళ్లీ తె.భా.సమాఖ్య ప్రభుత్వం వెంటపడింది. సమాఖ్య బహిరంగలేఖకు, విన్నపాలకు స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది ఆగస్టు 29న ప్రాధికార సంస్థ ఏర్పాటుకై కమిటీని వేశారు. ఆ కమిటీ నివేదిక ప్రకారం రేపో మాపో శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టి త్వరలో చట్టం తెస్తామని ముఖ్యమంత్రి నిన్నటి సభలో ప్రకటించారు. (ఆ నివేదిక సిఫారసులను ఈ సంచికలో 9-14 పుటల్లో చూడవచ్చు).

ఇంతకూ నివేదికలో ఏఏ అంశాలను ముఖ్యమంత్రి ఆమోదించారో వేటిని తిరస్కరించారో తెలియదు. ఆ వివరం చెప్పలేదు గనుక- నివేదిక మొత్తాన్నీ ఆమోదించారనే అనుకోవలసి వస్తున్నది. మరి, ప్రాథమిక విద్యను ప్రభుత్వ, ప్రయివేటు బడులన్నిటిలో రాష్ట్రమంతటా- మాతృభాషలోనే ఉండాలని కమిటీ సూచించింది. ఇప్పుడు ప్రభుత్వం ఆ సూచనను ఆమోదిస్తుందా? తిరస్కరిస్తుందా? అసలు- ఒక మాధ్యమంగా తెలుగును ఎంతవరకు ఆమోదించనున్నారు? అసలు ఏ దశలోనైనా తెలుగు మాధ్యమం ఉంటుందా ఆంధ్రప్రదేశ్‌లో? ఇలాంటి విధానపరమైన అంశాల్లో కమిటీ చెప్పిన వాటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలిగదా? ముఖ్యమంత్రిగారు ఇవేమీ ప్రస్తావించకుండానే ప్రాధికార సంస్థ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించేశారు. సంతోషం. ఆ సంస్థ నిర్మాణం, దాన్ని పనిలోకి దించడం ఇక త్వరగా జరగాలని ఆశిద్దాం.

మరొక ముఖ్యమైన అంశం- పరిపాలనను పూర్తిగా తెలుగులోకి తేవడం సంగతి. పరిపాలన అంతా ఇప్పుడు ఇంగ్లీషులోనే జరుగుతున్నది. 2014 లో ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటినుండి ఇంతవరకు ఎక్కడా ముఖ్యమంత్రి ఈ విషయంలో ఏమీ పలుకలేదు, ఎవరి విజ్ఞప్తులకూ స్పందించనూ లేదు. అందువల్లే ప్రజల భాషలో పరిపాలించాలనే

ప్రాథమిక సూత్రాన్ని అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. మంత్రులూ అంతే.

మునిసిపల్ మంత్రిగారయితే తెలుగును ఒక పనికిమాలిన భాషగా, భవిష్యత్తుకోసం ఇంగ్లీషేదిక్కు అన్నట్లుగా తెగబడి ప్రచారం చేస్తున్నారు. తెలుగును అధికారభాషగా అమలు చేయడానికి ఎన్నో జి.ఒ.లున్నాయి. చట్టాలున్నాయి. కానీ, పాలకులు వాటిని పట్టించుకోవడం లేదు. అయితే, రాజకీయ సంకల్పం అంటూ పాలకులకు ఉంటే ఎన్ని లోపాలనైనా అధిగమించి అన్ని అవసరాలను తీర్చగల సత్తా తెలుగు భాషకు ఉంది. ఆధునిక సాంకేతికతో అది మరింత శక్తిని పుంజుకొని ఉంది. ముఖ్యమంత్రిగారికి ఇదంతా తెలుసు. కాని, ఆయన పట్టించుకోరు. ఎందుకని?

29న ముఖ్యమంత్రిగారి ప్రసంగ అంశాలను ఇదే సంచికలో ఇచ్చాము. చదవండి– ఆయన మనోఫలకంపై ఆలోచనలు ఏ తీరున ఉన్నాయో మనకు అవగతమవుతుంది!

తెలుగు వారిగా ప్రత్యేక గుర్తింపుకోసం 'తెలుగు' కావాలి. అందుకే ఉనికికోసం 'తెలుగు' అని ఆయన అంటున్నారు. అందుకే అంతా తెలుగును – ఒక భాషగా నేర్చుకోవాలి – అంతే. ఒక బోధనా మాధ్యమంగా దానికి చాలా పరిమితులున్నాయని, అందువల్ల ఉన్నతవిద్య, పరిశోధన వగైరా అంతా ఇంగ్లీష్‌లో జరిగి పోవాలని, ఇంగ్లీషు చదువులతోనే అభివృద్ధి అనేదే ఆయన అవగాహన. మంత్రి నారాయణగారు బయటపడి తెలుగు పనికిరాదని చెప్తూంటే ముఖ్యమంత్రిగారు మౌనం వహించడానికి అర్థం అదే. అందుకే నిన్నటి ప్రసంగంలో తొలుత తన హయాంలోనే, తన ప్రోత్సాహంతోనే గ్రామాల నుండి పట్టణాలకు పిల్లల చదువులకోసం కదలిరావడం మొదలైందని, అది ఆర్థికంగా పెనుమార్పు తెచ్చిందనీ అన్నారు.

అన్నివిధాలా ఉపయోగించే కొద్దీ భాష వికసిస్తుంది. అన్ని ప్రయోజనాలనూ తీర్చుతుంది. తెలుగుకు అంత శక్తి ఉంది. దాన్ని మనం వినియోగించడం లేదు. పరిపాలనలో పైనుంచి అట్టడుగు స్థాయిదాకా తెలుగే రాజ్యమేలాలి. అప్పుడే అది ప్రజాస్వామ్య పాలన అవుతుంది. అప్పుడే మనది తెలుగురాష్ట్రం అవుతుంది. అప్పుడే అంత్యోదయకు రాజబాట ఏర్పడుతుంది. అందుకోసమే తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను పటిష్టంగా నెలకొల్పాలి. కాని, ప్రభుత్వానికి లక్ష్యం పట్ల సంకల్పం గాని, ఆచరణ పట్ల చిత్తశుద్ధిగాని లేనపుడు ఆ సంస్థ ఏం చేయగలుగుతుంది?

అందుకే– ఇప్పుడు ప్రభుత్వం తన భాషా విధానమేమిటో తేల్చి చెప్పాలి. పరిపాలనలో, న్యాయస్థానాల్లో, ప్రాథమికవిద్య మొదలుకొని ఉన్నత, అత్యున్నత విద్య తదితర రంగాలలో తన భాషా విధానమేమిటో స్పష్టంగా చెప్పాలి. ఈ అంశంపై ఇప్పటికే విశ్వవిద్యాలయస్థాయిలో పరిశోధన చేసి తేల్చి చెప్పినవారున్నారు, ప్రకటింపబడిన పత్రాలున్నాయి.

ముఖ్యమంత్రి ఈ అంశాలపై మనసుపెట్టి ఆలోచించాలి. నిపుణుల సలహాలు తీసుకోవాలి. ఒక రాజకీయ సంకల్పం చేయాలి. నిన్నగాకమొన్న మన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుగారు అమరావతిలో చెప్పినదేమిటో విన్నారుకదా! తెలుగులోనే పూర్తిగా పరిపాలించాలి...తెలుగే...తెలుగే...తెలుగే...అని ఆయన స్పష్టంగా చెప్పారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకీ చెప్పారు. తనమీద గౌరవంతో, ప్రజలమీద గౌరవంతో ఈ నిబంధనను మీరు అమలుచేయాలి అని చెప్పారు. దీనికి స్పందనగా "తెలుగులోకి పరిపాలనంతా తెస్తాను, అందుకోసం ఈ రోజునే ప్రతిన పూనుతున్నాను" అని ఓ సంకల్ప ప్రకటనను ఆగస్టు 29 సభలో ప్రకటించగల ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎందుకు లేకపోయింది?! 'తన కార్యాలయం నుంచే తెలుగులో పాలనను మొదలుపెడుతున్నానని' ఆయన ఎందుకు చెప్పలేకపోయారు? ఆయన అందుకు వ్యతిరేకమా, లేక అందుకు తగిన సామర్థ్యం లేకనా?

జి.ఒ.14/ ఫిబ్రవరి 2017 గురించి ఎంతో గందరగోళం నెలకొన్నదని, ఆ విషయంలో మునిసిపల్ మంత్రి చర్యలకు, ముఖ్యమంత్రి చెప్పేదానికీ, పొంతన లేకుండా పోయిందని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చినా, ఆయన మిన్నకుండడంకూడా అనుమానాలకు దారి తీస్తున్నది.

ఇప్పుడు ముఖ్యమంత్రిగారి చిత్తశుద్ధిని నమ్మాలంటే ఆయన మూడు తక్షణ చర్యలు తీసుకోవాలి. 1. వెంటనే ఒక తేదీని నిర్ణయించి, ఆరోజు నుంచీ రాష్ట్ర పరిపాలనను అంతా తెలుగులోకి తేవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. 2. విద్య తదితర అన్ని రంగాలలో తమ భాషా విధానం ఏమిటో స్పష్టం చెయ్యాలి. 3. ప్రాధికార సంఘాన్ని ఆశ్రితులైన రాజకీయ జీవులతో గాక, నిపుణులైన వారితో నెలకొల్పాలి. ఇది వీలైనంత త్వరగా జరగాలి.

ప్రాధికార సంస్థను నెలకొల్పుతున్నారు; తెలుగు మంత్రిత్వశాఖకు అధికార్లూ మంత్రీ ఉన్నారు. మరి, ప్రభుత్వ భాషా విధానం ఏమిటో స్పష్టత లేకుండా ప్రాధికార సంస్థకాని, మంత్రిత్వశాఖకాని ఎలా పనిచేస్తాయి? వెంటనే ఈ విషయంపై చూపుసారించాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాము.

తేదీ: 1-08-2017

సామల రమేష్‌బాబు

# తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి అధ్యయన కమిటీ

## ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక విశేషాలు

**2016 ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవ సభలో ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడు చేసిన వాగ్దాన ప్రకటనను అనుసరించి –**

నూతనంగా ఏర్పడనున్న వివిధ సంస్థల స్వరూప స్వభావాలను, వాటి విధి విధానాలను రూపొందించటం కోసం సాంస్కృతిక శాఖామాత్యులు గౌ॥డా॥ పల్లె రఘునాథరెడ్డి గారి అధ్యక్షతన తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి అధ్యయన కమిటీని ప్రభుత్వం జి.ఒ.ఎం.ఎస్.నెం. 10, తేది 14.09.2016న నియమించింది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) గౌ॥డా॥ పరకాల ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి గౌ॥డా॥ శ్రీ మండలి బుద్ధప్రసాద్, పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి డా॥ నాగులపల్లి శ్రీకాంత్, ఐ.ఏ.ఎస్., సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్, పురావస్తుశాఖ సంచాలకులు డా॥ రామకృష్ణ గార్లను సభ్యులుగా నియమించారు.

**కమిటీ పరిశీలనాంశాలు**

1. ప్రస్తుతం ఉన్న అధికార భాషా చట్టం స్థానంలో తెలుగు భాష అభివృద్ధి, అధికార భాష అమలుకు తెలుగు భాష ప్రాధికార సంస్థ చట్టం.
2. పురావస్తు శాఖ మరియు ప్రాచీన భాండాగారానికి సంబంధించిన సంస్థాగత ఏర్పాటు.
3. సాంస్కృతికశాఖకు సంబంధించిన సంస్థాగత నిర్మాణం, ప్రస్తుతం ఉన్న సంస్థల పునర్వ్యవస్థీకరణ.
4. విభజన చట్టానికి సంబంధించిన తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ సంస్థల విభజన.
5. విద్యారంగంలో తెలుగు బోధించటానికి కార్యాచరణ ప్రణాళిక.
6. పాలనా రంగంలో పూర్తి స్థాయిలో తెలుగు వాడకాన్ని అమలు చేయటానికి కార్యాచరణ ప్రణాళిక.
7. సమాచార సాంకేతిక రంగంలో తెలుగు వినియోగంలో సిఫారసులు.
8. ప్రాచీన భాషా కేంద్రం ఏర్పాటుపై సిఫారసులు.
9. ఇతర రాష్ట్రాలు, దేశాలలో తెలుగు వారి భాషా సంస్కృతి పరమైన సమస్యలపై సూచనలు.
10. తెలుగు సంస్కృతిని అభివృద్ధి చెయ్యడానికి చేపట్టవలసిన కార్యక్రమాలు మరి ఉపయుక్త కార్యాచరణ ప్రణాళిక.

తెలుగు భాషాభివృద్ధి కమిటీ తమిళనాడు, కర్ణాటక ఒరిస్సా మరియు ఢిల్లీ రాష్ట్రాలలో పర్యటించి ఆయా ప్రాంతాలలో అధికార భాష అమలు, భాషా సాంస్కృతిక రంగాల అభివృద్ధికి చేపడుతున్న చర్యల గురించి నిశితంగా పరిశీలించింది. రాష్ట్రంలోను, ఇతర రాష్ట్రాలలోనూ అనేకమంది తెలుగు ప్రముఖులతోనూ, సాహితీ వేత్తలతోనూ, వివిధ కళారంగాల ప్రముఖులతోనూ సమావేశాలు నిర్వహించారు.

**అనంతరం ఆ కమిటీ తన నివేదికను 2017 మే నెలలో ముఖ్యమంత్రి గారికి సమర్పించింది. మాకు అందినంతవరకు అందులోని ముఖ్యాంశాలను ఈ దిగువన ఇస్తున్నాం.**

### 7 విభాగాలతో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు

1.అధికార భాష అమలు విభాగం, 2.భాషాభివృద్ధి విభాగం, 3.ఇ–తెలుగు విభాగం, 4.అనువాద విభాగం
5.ప్రచురణల విభాగం, 6.అంతర్జాతీయ తెలుగు భాషాభివృద్ధి విభాగం 7.గ్రంథాలయాల విభాగం

**పాలనలో తెలుగు :**

- **అధికారభాష అమలు విభాగం:** సచివాలయ స్థాయి నుండి గ్రామస్థాయి వరకూ అన్ని ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు అన్నీ తెలుగులోనే ఉండాలి.
- తెలుగు అమలును నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్య తీసుకునే అధికారం ప్రాధికారసంస్థకు ఉండాలి.
- ప్రభుత్వ సమీక్షా సమావేశాల్లో తెలుగు అమలు జరుగుతున్న తీరు ఒక చర్చనీయాంశంగా ఉండాలి.
- ప్రతిజిల్లాలోనూ ఒక అధికారికి అధికార భాషా అమలు పర్యవేక్షకుడి బాధ్యతను అప్పగించాలి.
- తెలుగు అమలుకు అవసరమైన సాంకేతిక శిక్షణ ప్రభుత్వోద్యోగులకు ఎప్పటికప్పుడు అందించాలి.
- పరిపాలనలో తెలుగు భాష అమలుకు తగినంత సిబ్బందిని నియమించాలి.
- తెలుగులో ప్రముఖంగా కనిపించేలా నామఫలకాలు, శిలాఫలకాలు ఉండాలి.
- ఉన్నత స్థాయిలో జరిగే ప్రభుత్వ సమావేశాలు కూడా తెలుగులోనే నిర్వహించాలి.

**బోధనలో తెలుగు :**

- అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో ప్రాథమిక విద్య తెలుగులోనే బోధించాలి.
- ప్రభుత్వ ఆదరణ కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న

ఓరియంటల్ పాఠశాలలు మరియు కళాశాలలను అభివృద్ధి పరచటం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి అవి తోడ్పడేందుకు అవకాశం కల్పించాలి.

- హైస్కూలు నుండి ఇంటర్‌మీడియట్ వరకు రెండు మాధ్యమాలూ సమాంతరంగా ఉండి, మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశం విద్యార్థికి ఉండాలి.
- ఇంగ్లీషు మాధ్యమంలో తెలుగును, తెలుగు మాధ్యమంలో ఇంగ్లీషునూ ఒక బోధనాంశంగా ఉంచాలి.
- డిగ్రీ స్థాయిలో అన్ని సెమిష్టర్లలో తెలుగును తప్పని సరిగా బోధించాలి.
- ఇంజనీరింగ్, మెడిసిన్, న్యాయశాస్త్రం ఇతర సాంకేతిక వృత్తివిద్యా కోర్సుల్లో మొదటి రెండు సంవత్సరాలూ తెలుగును బోధించాలి.
- ప్రస్తుతం ఉన్న విధానంలో సంస్కృతం ఒక బోధనాంశంగా ఉంచి, విద్యార్థులు ఏ భాషలో నైనా సంస్కృత పరీక్షను వ్రాసే విధంగా ఉంచటం వలన, ఆ భాష చదవటం, వ్రాయటం, మాట్లాడటం మూడు ప్రయోజనాలూ నెరవేరని పరిస్థితి ఏర్పడింది. కాబట్టి, ఇంటర్మీడియట్ డిగ్రీల స్థాయిల్లో పదవ తరగతి వరకూ అమలులో ఉన్న పద్ధతిలో తెలుగు సంస్కృతం మిశ్రమ బోధనా విధానాన్ని పాటించాలి.
- తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రతి కేటగిరీలోనూ 10% శాతం రిజర్వేషను కల్పించాలి.

**ఇ–తెలుగు:**

- ఆన్‌లైన్లో ఇ–తెలుగు పద్ధతిలో తెలుగు బోధన, అంతర్జాలంలో తెలుగు సాహిత్యం, శాస్త్ర సాంకేతిక గ్రంథాల వ్యాప్తి, శాసనాల డిజిటలైజేషన్, తెలుగులో వెబ్ సైట్ల నిర్వహణ, కంప్యూటర్లో తెలుగు ఉపకరణాల అభివృద్ధి లాంటి చర్యలు వేగవంతం కావాలి.
- ప్రభుత్వ వ్యవహారాలలో యూనీకోడు వాడకాన్ని ప్రవేశ పెట్టాలి.
- రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ, విదేశాల్లోనూ ఉన్న తెలుగు వారికి, తెలుగు నేర్చుకోవాలనుకునే ఇతరులకు ఆన్‌లైన్లో సర్టిఫికేట్ కోర్సుల నిర్వహణ.

**అంతర్జాతీయంగా తెలుగు :**

- సరిహద్దు రాష్ట్రాలలో తెలుగును రెండవ అధికార భాషగా గుర్తించేలా తమిళ, కన్నడ, ఒడిసా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలి.
- త్రిభాషా సూత్రం ప్రకారం హిందీ రాష్ట్రాలలో మూడవ భాషగా తెలుగు నేర్పే విధంగా కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి.
- కేంద్ర అధికార భాషా సంఘం కేవలం హిందీకి పరిమితం కాకుండా అన్ని రాష్ట్రాల అధికార భాషలనూ అభివృద్ధి చేయటానికి కృషి చేసేవిధంగా కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి.
- రాష్ట్రేతరాంధ్రులు, విదేశీ ఆంధ్రుల భాషా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి.
- తమిళనాడు, పశ్చిమబెంగాల్ మొదలైన రాష్ట్రాల్లో తెలుగు బోధనను రద్దు చేసిన కారణంగా తెలుగు వారిలో తలెత్తిన ఆందోళన, అభద్రతాభావం తొలగించే విధంగా, అక్కడ తెలుగు బోధన పునరుద్ధరణకు కృషి చేయాలి.

**అకాడమీల ఏర్పాటు :**

- తెలుగు సాహిత్యం, సాంస్కృతికత, గ్రామీణ సాంకేతికత, జానపదం మరియు చరిత్రలకు సంబంధించి 6 అకాడమీలను ఏర్పాటు చేయవలసిందిగా సూచిస్తున్నాం.

1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
2. ఆంధ్రప్రదేశ్ సంగీత నృత్య అకాడమి
3. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి
4. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి
5. ఆంధ్రప్రదేశ్ చరిత్ర అకాడమి
6. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సాంకేతిక మరియు జానపద కళల అకాడమి.

**ప్రాచీన భాషాకేంద్రం :**

- రాష్ట్రముఖ్యమంత్రిగారు ప్రాచీన భాషా కేంద్రం తరలి రావటానికి అవసరమైన వనరులు సమకూర్చటానికి సంసిద్ధతను వ్యక్తపరచిన నేపథ్యంలో ఈ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటుకు కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించాలి.

**న్యాయపాలనలో తెలుగు :**

- హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పరచి, న్యాయపాలనలో తెలుగు అమలు కోసం సత్వర చర్యలు తీసుకోవాలి.
- తెలుగులో తీర్పులు వెలువరించేలా న్యాయమూర్తులను ప్రోత్సహించాలి.

**తెలుగులో సాంకేతిక విజ్ఞానం :**

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగులో పని చేయించే విధంగా ఉపకరణాలు, తెలుగు యూనికోడ్ ఫాంట్లను ఇంగ్లీషుతో సమానంగా ఉపయోగించే ఉపకరణాలను రూపొందించే పరిశోధనలు జరగాలి. వైజ్ఞానిక గ్రంథాలను తెలుగులో ప్రామాణికంగా అనువదింప చేయించి ప్రచురించాలి.

**గ్రంథాలయ సంస్థ :**

- రాష్ట్రంలో గ్రంథాలయాల ప్రస్తుత స్థితిని దృష్టిలో పెట్టుకుని, వాటి నిర్వహణను తెలుగు ప్రాధికార సంస్థకు అప్పగించాలి.
- గ్రంథాలయ జిల్లాకార్యదర్శికి జిల్లా కలెక్టరు గారి ఆధ్వర్యంలో తెలుగు అధికార భాష అమలు పర్యవేక్షకునిగా అదనపు బాధ్యతలను అప్పగించాలి.
- గ్రంథాలయాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరియు ఇతర సమాచార కేంద్రాలుగా రూపొందించాలి.
- గత మూడు నాలుగేళ్ళుగా నిలిచిపోయిన పుస్తకాల కొనుగోళ్ళను వెంటనే చేపట్టాలి.

**ఇతర సూచనలు :**

- ప్రతి రెండు సంవత్సరాలకొకసారి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి, గ్రామ మండల, జిల్లా స్థాయిల్లో

భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలుగు ప్రజల్లో భావసమైక్యతకు భాషా సాంస్కృతిక పరిరక్షణకు నడుంకట్టేందుకు చైతన్య పరచాలి.

- దేశ విదేశ పర్యాటకులను, పరిశోధకులను ఆకర్షించే విధంగా అమరావతిలో ఒక సమగ్ర భాషా సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.
- మ్యూజియంలో సంస్కృతికి సంబంధించిన ఇతర భవన నిర్మాణాలు తెలుగు శిల్పకళ, సంస్కృతులు ప్రతిబింబించే విధంగా ఉండాలి. తెలుగువారి సాంప్రదాయ పండుగలైన వినాయక చవితిని పర్యావరణ చైతన్యోత్సవంగానూ, శ్రీరామ నవమిని కుటుంబోత్సవంగానూ, దీపావళి పండుగను మహిళా సాధికార దినోత్సవంగానూ, ఉగాది పండుగను తెలుగు సాంస్కృతిక మహోత్సవంగానూ, క్రిస్మస్ పండుగను కారుణ్య మహోత్సవంగానూ,రంజాను పండుగను సౌహార్ద్ర మహోత్సవంగానూ జరపాలని సూచిస్తున్నాము.

**కమిటీ పరిశీలనాంశాలలో 5వ పరిశీలనాంశం : విద్యారంగంలో తెలుగు బోధించడానికి కార్యాచరణ ప్రణాళిక**

ఒక భాషాజాతిని నాగరికమైన సంస్కారవంతమైన జాతిగా అభివృద్ధి చేయటంలో విద్య ప్రముఖ పాత్ర వహిస్తుంది. విద్యార్థులకు చారిత్రక మూలాలతోపాటు నవీన శాస్త్ర పరిజ్ఞానం కూడా అందిస్తూ జీవన యోగ్యమైన విద్యలో ప్రావీణ్యత కోసం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి కేంద్ర రాష్ట్ర స్థాయిలో అనేకమైన చట్టాలను రూపొందించుకున్నాం. ఆంధ్రప్రదేశ్ విద్యాహక్కు చట్టం 2011 ప్రకారం 14వ యేడు వచ్చే వరకూ ఉచిత నిర్బంధ విద్యను ఒక హక్కుగా విద్యార్థులకు అందిస్తున్నాం.

ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య నందించే మాధ్యమంపై జరిగిన పరిశోధనలు, అంతర్జాతీయ సంస్థలైన యునెస్కో వంటి సంస్థలు అందించిన పరిశోధనా ఫలితాలను అభిప్రాయాలను గమనించవలసిన అవసరం ఉంది. యునెస్కో తన నివేదికలో 2008 నందు ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించింది. ప్రాథమిక విద్య స్థాయిలో మాతృభాషలో చదవని విద్యార్థుల్లోనే బడి మానేస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. యునెస్కో ఇందుకు చేసిన ముఖ్య సూచనలు ఈ క్రింద పొందు పరుస్తున్నాము.

1. ప్రపంచ వ్యాప్తంగా 40% మందికి వారి మాతృభాషలో గాని, లేదా వారికి తెలిసిన భాషలో గానీ విద్య అందడం లేదు. కాబట్టి, పిల్లలకు తప్పనిసరిగా వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందించాలి.
2. మాతృభాషలో బోధించని కారణంగా, ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుల్లో వెనకబడిపోయే ప్రమాదం ఉంది.
3. అందువలన కనీసం 6 సంవత్సరాలు మాతృభాషలో చదువుకోవటం వలన అన్నివర్గాల విద్యార్థులు సమాన స్థాయిలో రాణించే అవకాశం ఉంది.
4. బహుభాషా సమాజాలలో ఏదేనీ ఒక విదేశీ భాష ద్వారా విద్యను అందించటం వలన సామాజిక సాంస్కృతిక పరమైన అనేక అసమానతలకు దారితీసే ప్రమాదం ఉంది.
5. ప్రభుత్వ విద్యావిధానం మాతృభాషలో విద్యయొక్క ప్రాధాన్యతను గుర్తించాలి.

పైన పేర్కొన్న అంశాలు బహు భాషలున్న ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ దేశాలలో ఎక్కువగా ఉన్నట్టు UNDP 2004 నివేదిక నందు పొందుపరచటం జరిగింది.

యునెస్కో డైరెక్టర్ జెనరల్ ఇరీనా బొకోవా 15వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం2015లో ఇచ్చిన సందేశంలో మిలీనియం అభివృద్ధి లక్ష్యాలు (మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్) సాధనకు మాతృభాషలో విద్యాబోధన అత్యంత అవసరం అనీ, ఈ దిశగా బోధన, శిక్షణ, విద్యాప్రణాళికల సవరణల ద్వారా విద్యను నేర్చుకోవటానికి అనుకూలమైన విద్యావాతావరణాన్ని కల్పించాలని గట్టిగా కోరారు.

“అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మాతృభాషా ఆవశ్య కతా కేతనాన్ని ఎగురవేసే ఒక మహత్తర సన్నివేశంగా గుర్తించి, విద్యకు సంబంధించిన అన్ని ప్రణాళికల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించి విద్యా వెలుగులు ప్రసరించని వారికి అవి చేరే విధంగా చూడాలి. ప్రతి బాలుడూ, బాలికా, ప్రతి స్త్రీ, పురుషుడు వారి సామాజిక జీవన విధానంలో మమేకమయ్యేందుకు అవసరమైన సాధన సంపత్తులన్నీ సమకూర్చుకోవాలి-ఇది ప్రతీ మానవుడికి మౌలికమైన మానవీయ హక్కే కాకుండా శాశ్వత సామాజిక అభివృద్ధికి ఒక చోదక శక్తిగా నిలుస్తుంది” అని యునెస్కో డైరెక్టర్ జనరల్ తన సందేశంలో పేర్కొన్నారు.

యునెస్కో 1953వ సంవత్సరం నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించినప్పటికీ 1953 నుండే మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధన ప్రాముఖ్యతను గుర్తించి ఆ మేరకు ప్రచారాన్ని సూచనలనూ చేస్తూనే ఉంది.

ఈ నేపథ్యంలో తెలుగును బోధనాభాషగా అమలు చేయటంలో రెండు ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయి.

అ) ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలోనే విధిగా జరపటం. మాధ్యమిక మరియు ఉన్నత స్థాయి చదువుల్లో తెలుగు ఒక బోధనాంశంగా చేర్చటం.

ఆ) ఉన్నత స్థాయి విద్య వరకూ కూడా అన్ని పాఠ్యాంశాలను తెలుగులోనే బోధిస్తూ ఇంగ్లీషుని ఒక పాఠ్యాంశంగా ఉంచటం.

పై రెండు అంశాలూ కీలకమైనవే. విద్యావేత్తలు, సామాజిక వేత్తలూ ఈ రెండింటి గురించి గత అనేక ఏళ్ళగా విస్తృతంగా చర్చలు జరుపుతూనే ఉన్నారు.

ఈ కమిటీ నిర్వహించిన ప్రజా సదస్సులలో పై రెండు విషయాలూ ప్రస్తావనకు వచ్చాయి. అయితే వివిధ శాస్త్ర సాంకేతిక వైద్యవిద్యలకు సంబంధించిన గ్రంథాలు తెలుగులో ప్రామాణికంగా అందుబాటులో లేవు. ఇటీవల వచ్చిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వలన దేశాలమధ్య భాషాపరమైన అంతరాలు తగ్గిపోయి యువతకు విదేశాల్లో అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాలను తెలుగు యువతీ యువకులు అందిపుచ్చుకోగలిగారు. అమెరికా లాంటి దేశాలలో మినీ ఆంధ్ర ప్రదేశ్ అనదగిన రీతిలో తెలుగువారు విస్తరించగలిగారు. ప్రపంచమే ఒక కుగ్రామంగా అవతరించిన తరుణంలో ఇంగ్లీషు భాష

ప్రాధాన్యతను తక్కువ చేయలేము. ఆ భాషలో దొరికే విజ్ఞానం, పరిశోధనాంశాలు, గ్రంథాల పట్ల ఈ కమిటీకి పూర్తి అవగాహన, సదభిప్రాయం ఉన్నది. అయితే, విద్యార్థి ప్రాథమికదశలో మేథస్సు వికసించటానికి మాతృభాష ఉపయోగ పడినట్టుగా మరో పరాయి భాష దోహదపడదు. ఎందుకంటే, తెలిసిన భాషలో తెలియని జ్ఞానాన్ని సంపాదించటం సులువు. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా అన్ని పరిశోధనలూ నిర్ధారించిన సత్యం.

ఈ నేపథ్యంలో ఉన్నత విద్యలో పూర్తిగా తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధన అనేది అభిలషణీయం కాదని కమిటీ భావిస్తున్నది. ప్రాథమిక స్థాయి వరకూ అనగా 1 నుండి 5 వరకు పూర్తిగా తెలుగులోనే ఉంటూ ఇంగ్లీషు ఒక బోధనాంశంగా (సబ్జెక్టు) నేర్పించాలనీ, అన్ని ఉన్నత విద్యలకూ విద్యార్థి ఇష్టానికి అనుకూలంగా ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలు రెండింటినీ కొనసాగించాలని, తెలుగు మాధ్యమంలో ఇంగ్లీషును, ఇంగ్లీషు మాధ్యమంలో తెలుగునూ బోధనాంశాలుగా ఉంచాలని ఈ కమిటీ అభిప్రాయ పడుతోంది. సాంకేతిక విద్యల్లో మొదటి రెండేళ్ళకూ తెలుగు ఒక బోధనాంశంగా ఉంచాలని కూడా ప్రతిపాదిస్తోంది. ఏది ఇంటి భాషో అది ప్రాథమిక విద్యకు బోధనా భాషగా ఉండాలనేది అంతర్జాతీయ సూత్రం. ప్రాథమికవిద్యలో మాతృభాషను తక్కువ చేయటంవలన పిల్లల మనోవికాసం దెబ్బతింటుంది.

ప్రస్తుతం 10వ తరగతి వరకు తెలుగు, సంస్కృతం మిశ్రమ బోధనా విధానం అమలులో ఉంది. ఇంటర్ మరియు డిగ్రీ స్థాయిలలో కూడా ఇదే మిశ్రమ విదానాన్ని అవలంబించాలని ఇంగ్లీషు మరియు తెలుగు మాధ్యమాలు రెండింటిలోనూ అన్ని గ్రూపుల వారికి ఇది వర్తింపచేయాలని అనేకమంది కోరుతున్నారు.

**కమిటీ పరిశీలనాంశాలలో 6వ పరిశీలనాంశం :**

పాలనా రంగంలో పూర్తి స్థాయిలో తెలుగు వాడకాన్ని అమలు చేయటానికి కార్యాచరణ ప్రణాళిక.

**1. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ:**

మన పొరుగు రాష్ట్రాల్లో ఆయా భాషలు, సంస్కృతుల పరిరక్షణకు, వ్యాప్తికి ఏర్పాటైన ప్రత్యేక సంస్థలు నిర్వహించే అనేక ప్రాజెక్టులు, కార్యక్రమాలు కమిటీ దృష్టిని ఆకర్షించాయి. భాషా సంస్కృతుల పరివ్యాప్తికి, అభివృద్ధికి అక్కడి ప్రభుత్వ అజమాయిషీలో ప్రత్యేకమైన యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయటాన్ని కమిటీ గమనించింది.

అంతటి కృషి, వివిధ కార్యక్రమాల నిర్వహణలు కేవలం ఒక ప్రభుత్వ శాఖ ద్వారా సంపూర్ణం కాదని అభిప్రాయానికి ఈ కమిటి వచ్చింది.

ఉదాహరణకు తమిళనాడులో అధికార భాషగా తమిళాన్ని అమలు చేయటానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టరు నుండి ముఖ్య కార్యదర్శి వరకు అమలు పర్యవేక్షణను ఒక బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సులభంగా అర్థమైనప్పుడు మాత్రమే వాటి నివినియోగించు కోవటానికి ముందుకు రాగలుగుతారు.

ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా మాతృభాష ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్యం అవుతుంది.

ఈ దిశగా ఉత్తర్వులు, దస్త్రాలను తమిళంలో రూపొందించ టానికి అవసరమైన తమిళభాషా పరిజ్ఞానాన్ని ప్రభుత్వమే కల్పించి, పాలనా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తోంది. మాతృభాషను పాలనాభాషగా అమలు చేయటంలో ఇదొక కీలకమైన అంశం.

ఇందుకు కావలసిన యంత్రాంగం భాషాభిమానంతో పనిచేయాల్సి ఉంది. పటిష్టమైన సంస్థాగత నిర్మాణం చేపట్టవలసిన అవసరం చాలా ఉంది.

కర్ణాటక, ఒడిసా రాష్ట్రాలలో కూడా మాతృభాషలో పాలన సమర్థవంతంగా అమలు జరుగుతోంది. రెండురాష్ట్రాల్లోనూ ప్రాధికారిక సంస్థలు మాతృభాషలకు అంకిత భావంతో పనిచేస్తున్నాయి.

తెలుగు భాషాభివృద్ధికి ఒక ప్రాధికారిక సంస్థ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని భావిస్తున్నాము.

పాలనాభాషగా తెలుగు అమలుని పర్యవేక్షించేందుకోసం, తెలుగు భాషాభివృద్ధి మరియు పరివ్యాప్తి లక్ష్యాలుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం చట్టం స్థానే ఒక నిర్ణయాత్మకమైన, శక్తిమంతమైన, పదునైన "తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ" ఏర్పాటును ఈ కమిటీ ప్రముఖంగా సూచిస్తోంది. ఆమేరకు చట్టాన్ని తీసుకు రావలసిందిగా ప్రతిపాదిస్తోంది.

ఈ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ సమర్థవంతంగా తన విధుల్ని నెరవేర్చటం కోసం ఈ క్రిందివిభాగాలను ప్రతిపాదిస్తోంది.

1. అధికార భాషా విభాగం
2. తెలుగు భాషాభివృద్ధి విభాగం
3. తెలుగు సాంకేతిక, అంతర్జాల విభాగం
4. అనువాద విభాగం
5. ప్రచురణల విభాగం
6. అంతర్జాతీయ తెలుగు పరిశోధన, అభివృద్ధి, పరిరక్షణ విభాగం.

**అధికార భాషా విభాగం :**

తెలుగులో పాలనా వ్యవహారాలను నిర్వహించేందుకోసం తగు అధికారాలతో ఈ క్రింది విధులను నిర్వహిస్తుంది:

పాలనాపరంగా తెలుగును అధికారభాషగా అమలు చేయటానికి ఎదురయ్యే అవరోధాలను, సాధకబాధకాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకొంటుంది.

ఎక్కువ పౌర సంబంధాలు కలిగిన కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలలో ప్రజలు రోజువారీ వాడుకునే ఫారాలు, విధానపత్రాలు, కరదీపికలు (మాన్యువల్స్), పట్టికలు, రసీదులు, నోటీసులు, అర్జీలు, బ్రోచర్లు, ఓచర్లు, కర పత్రాల తయారీలోనూ, ముద్రణలోనూ అవసరమైన సూచనలు అందిస్తుంది. పాలనాపరమైన ఆధార గ్రంథాలను సమకూరుస్తుంది. లేదా సూచిస్తుంది.

అన్ని ప్రభుత్వ ప్రభుత్వరంగ కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలలోనూ తెలుగు అమలు తీరును, ప్రగతిని సమీక్షిస్తుంది. అవసరమైన సూచనలు, ఆదేశాలు ఇస్తుంది.

అన్ని ప్రభుత్వకార్యాలయాలలోనూ రిజిష్టర్లు, పాలనాపరమైన పట్టికలు, కరదీపికలు (మాన్యువల్స్), ఇతర ప్రచురణలను తేలికగా అర్థం అయ్యే తెలుగు భాషలోకి మార్చి అందించేందుకు

సహకరిస్తుంది.

న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు తెలుగులో తీర్పులు వెలువరించటానికి మార్గదర్శకాలు, న్యాయశాస్త్ర పారిభాషిక పదాల తయారీలో ఈ విభాగం సహకరిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన ఉద్యోగులకు శిక్షణా తరగతులు, పునశ్చరణ తరగతులు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహిస్తుంది.

ప్రభుత్వోద్యోగ భర్తీ ప్రక్రియలలో తెలుగు భాషా పరిజ్ఞానాన్ని గుర్తించే పరీక్షలకు సిలబస్ మరియూ పరీక్షా విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన మార్పులు సూచిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థలతోపాటు, పౌర సంబంధమైన అన్ని దుకాణాలు, కంపెనీల నామఫలకాలు, విజ్ఞాపనలు, త్రోవగుర్తులు, త్రోవసూచనలు, త్రోవహెచ్చరికల ఫలకాలు తెలుగులో ప్రముఖంగా కనిపించేలా ఈ సంస్థ అజమాయిషీ చేస్తుంది. ఆమేరకు ఆదేశిస్తుంది. ఆదేశాలు అమలు చేయనప్పుడు శిక్షించే అధికారాలను వినియోగిస్తుంది. శిక్షగా విధించే జరిమానా మొత్తాన్ని పెంచవలసినదిగా సూచించటమైనది.

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన విమానాశ్రయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు, ఇతర కార్యాలయాల్లో కేంద్ర ప్రభుత్వ భాషావిధానాన్ని అనుసరించి ప్రాంతీయ భాషగా తెలుగు విధిగా ఉండేలా ఈ విభాగం సమన్వయం చేస్తుంది.

ప్రజలకు సంబంధించి ప్రసారం చేసే మరియు ప్రదర్శించే ప్రభుత్వ ప్రైవేట్ ప్రకటనలు విధిగా తెలుగులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటుంది.

పాలనా పరంగా తెలుగు వినియోగానికి సంబంధించి ఆధార గ్రంథాల రూపకల్పన, పరిష్కరణ, ముద్రణ మరియు పంపిణీలను నిర్వహిస్తుంది. అన్ని ప్రభుత్వ శాఖలలో వాటి అమలు తీరును సమీక్షిస్తుంది. అవసరమైన సూచనలిస్తుంది.

తెలుగులో పాలించటానికి కావలసిన సమస్త ఉపకరణాలను సిద్ధంచేస్తుంది. అవసరమైన సూచనలు చేస్తుంది.

ఆయా రంగాల నిపుణులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, ప్రయోగాత్మకంగా తెలుగును వినియోగంలోకి తీసుకువస్తుంది.

పాలనాభాషను ఎప్పటికప్పుడు నవీకరిస్తుంది(అప్‌టు డేట్).

ప్రామాణిక తెలుగు పాలనా భాషను నిర్మించేందుకు నిపుణులతో సమన్వయం చేస్తుంది.

అధికారులు, ఇతర సిబ్బంది సందేహాలను తీర్చటానికి ఒక సహాయ, సలహా కేంద్రం(హెల్ప్‌లైన్) ఏర్పాటు మొదలైన అంశాలను ఈ అధికార భాషా విభాగం పర్యవేక్షిస్తుంది.

**తెలుగు భాషాభివృద్ధి విభాగం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిధిలోని ఆంగ్ల పాఠశాలల్లో తెలుగు తప్పనిసరిగా ఒక బోధనాంశంగా (సబ్జెక్ట్) నేర్పించటం ద్వారా పీజీ దాకా ఈ నేలమీద చదివే ప్రతివిద్యార్థికీ తెలుగు తెలిసేలా చర్యలు చేపడుతుంది.

రాష్ట్రంలో వైద్యం, ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సుల్లో కూడా మొదటి రెండు సంవత్సరాలూ తెలుగును ఒక బోధనాంశంగా చేర్చి అమలు చేస్తుంది.

తెలుగులో మాట్లాడినందుకు విద్యాలయాల్లోగానీ, ఇతర సంస్థల్లో గానీ ఎలాంటి వేధింపులు జరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటుంది.

ప్రభుత్వం సూచించే భాషాభివృద్ధి కార్యక్రమాలను ఈ చట్టంలో నిర్దేశించిన విధుల అనుసరణగా నెరవేరుస్తుంది.

తెలుగు భాషాభివృద్ధికి సంబంధించిన సాహిత్యాన్ని ప్రోత్సహిస్తుంది.

గతంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించిన వ్యవసాయం, చేనేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం, మొదలైన వృత్తిపదకోశాలను నవీకరించడం, ఇతర వృత్తి పదకోశాల నిర్మాణం మరియు ప్రచురణలను చేపడుతుంది.

పాఠశాల స్థాయిలో 5వ తరగతిదాకా మాతృభాషలోనే అన్ని అంశాలూ బోధిస్తూ, ఒక సబ్జెక్టుగా ఇంగ్లీషు నేర్పటం, విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతిక విషయాలను క్రమేణా ఒకటొక్కటే ఆంగ్ల మాధ్యమంలో చేర్చటం, ఇంటర్ మీడియట్ నుంచి అన్ని స్థాయిల్లోనూ ఆంగ్ల మాధ్యమం నడిచినా, తెలుగును ఒక బోధనాంశంగా (సబ్జెక్టు) ఉండేలా చర్యలు తీసుకుంటుంది.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు సందర్భాన్నిబట్టి రెండు భాషల్లోనూ ఉండేలా పర్యవేక్షించాలి.

తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వోద్యోగాలలో 10% రిజర్వేషన్ కల్పించేందుకు ఎంప్లాయిమెంట్ అధికారులతోనూ, పబ్లిక్ సర్వీస్ కమీషన్ అధికారులతోనూ సమన్వయంగా వ్యవహరిస్తుంది.

బోధనా రీతులను మెరుగుపరచి, తెలుగులో చదివితేనే భవిష్యత్తు అనే భరోసా కల్పించే చర్యలు చేపడుతుంది.

పాఠ్యపుస్తకాలలో ఉపయోగించే భాషను, ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన సవరణలను సూచిస్తుంది.

మానవ జీవనగమనాన్ని మలుపు తిప్పిన తాత్విక, వైజ్ఞానిక, గణిత, సాంకేతిక, వైద్య ఆర్థిక, చరిత్ర, కళ మరియు నిర్మాణ రంగాలకు సంబంధించి ప్రపంచ స్థాయి రచనలను తెలుగులోకి అనువదింప చేస్తుంది. తెలుగులో రచింపజేస్తుంది.

వాటిని తెలుగులో డిజిటలైజ్ చేయించే కార్యక్రమాలను చేపడుతుంది.

తెలుగు మాటల వాడకాన్ని పెంపు చేసేందుకోసం ప్రజల గుండె తలుపులు తట్టే కార్యక్రమాలను చేపడుతుంది. అందుకు అవసరమైన సాహితీ, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను చేపడుతుంది. తమ పిల్లలు తెలుగును ఒక బోధనాంశంగా చదివేందుకు ఇష్టపడేలా విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రేరేపించే కార్యక్రమాలు చేపడుంది.

విద్యార్థులకు తెలుగుభాషపట్ల అనురక్తి అభిమానాలతో పాటు, తెలుగులో ప్రావీణ్యతను పెంపుచేసే విధంగా వ్యాసరచన, వక్తృత్వం, ఏకపాత్రాభినయం మొదలైన పోటీలు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రతి యేటా నిర్వహిస్తుంది.

తెలుగు భాష, తెలుగు సంస్కృతి, ఆంధ్రుల చరిత్ర, తెలుగు సాహిత్యంలోని ఉన్నత విలువలు, నైతికత, సామాజిక దృష్టి పెంపొందింప చేసే అంశాలను పాఠ్యాంశాలుగా తెలుగు సిలబస్ రూపకల్పన బాధ్యతలు నిర్వహిస్తుంది.

తెలుగు భాషాభివృద్ధికి, భాష ప్రాచీనతకు సంబంధించి వివిధ

స్థాయిల్లో జరుగుతున్న పరిశోధనలను సమీక్షిస్తుంది, ప్రోత్సహిస్తుంది. తెలుగు ప్రాచీనభాషా కేంద్రంతో సమన్వయంగా పనిచేస్తుంది.

**ఇ-తెలుగు విభాగం :**

**కమిటీ పరిశీలనాంశాలలో 7వ అంశం సమాచార సాంకేతికరంగంలో తెలుగు వినియోగంలో సిఫారసులు:**

ప్రాచీన తెలుగు గ్రంథాలు, తాళపత్రాలు, ఇతర ప్రాచీన డాక్యుమెంట్ల డిజిటలైజేషన్, యూనీకోడ్ లోకి పరివర్తనల ద్వారా తెలుగు భాషను ప్రపంచ భాషగా తీర్చిదిద్దే ప్రాజెక్టులు నిర్వహిస్తుంది.

ఇంటర్‌నెట్‌లోనూ, వెబ్‌సైట్లలోనూ, సమాచార సాంకేతిక ఉపకరణాలన్నింటిలోనూ తెలుగు వినియోగం కోసం చర్యలు చేపడుతుంది. కంప్యూటరుని, యాండ్రాయిడ్ ఫోన్లను పూర్తిస్థాయిలో తెలుగులోనే నిర్వహిస్తుంది. భవిష్యత్తులో వచ్చే సాంకేతికాభివృద్ధిలో కూడా తెలుగు భాష ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటుంది.

రాష్ట్రంలోనే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోనూ, ఇతర దేశాల్లోనూ తెలుగు వారికి, తెలుగేతరులకు తెలుగు నేర్పేందుకు తెలుగు భాషా వ్యాప్తికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాఠ్యాంశాలను రూపొందిస్తుంది. ఇ-బుక్స్, ఈ-లెర్నింగ్ విధానాలలో తెలుగు భాషాబోధన చేపడుతుంది.

ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక, విశారద...లా 8-10 స్థాయిల్లో సర్టిఫికేట్ కోర్సులను నిర్వహిస్తుంది.

తెలుగు విశ్వవిద్యాలయం లేదా ఐ.ఐ.ఐ.టి.లాంటి సాంకేతిక విద్యా సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు సమన్వయం చేస్తుంది.

**ప్రచురణల విభాగం :**

భాషాభివృద్ధి గ్రంథాలు, తెలుగు ఇంగ్లీషు మరియు తెలుగుతో ఇతర భాషల నిఘంటువుల నిర్మాణం చేపడుతుంది.

అచ్చతెలుగు పదాలు, వైకృత పదాలు, పర్యాయ పదాలు, అరువు పదాలు, మాండలిక పదాలు, పూర్వకవి ప్రయోగాలను, పదబంధాలను సమీకరించటం, ఆంగ్ల సమానార్థకాలను గుర్తించటం, పదకోశాలను, ప్రయోగకోశాలను, బృహన్నిఘంటువు(లెక్సికాన్) ను రూపొందించి ప్రచురిస్తుంది.

తెలుగు భాషాభివృద్ధికి, తెలుగులో పాలనకు తోడ్పడే రచనలను ఆహ్వానించటం, రూపొందించటం, ప్రచురించటం, పంపిణీ చేయటం మొదలైన బాధ్యతలను నెరవేరుస్తుంది.

తెలుగులో పాలన సాగించటం కోసం కార్యాలయ అధికారులకు సహాయకంగా ఉండే కరదీపికలు

**అనువాద విభాగం :**

ఇంగ్లీషు మరియు ఇతర భాషా పదాలకు తెలుగు సమానార్థ కాలను గుర్తించటం ద్వారా ప్రామాణికమైన తెలుగు భాష నిర్మాణానికి పదనిథి (వర్డ్ బ్యాంకు) నిర్వహిస్తుంది.

తెలుగు భాషాభివృద్ధి, తెలుగు ప్రాచీనతలకు సంబంధించిన ఆకర గ్రంథాలను, అలాగే ప్రాచీన శాస్త్ర సాంకేతిక తెలుగు గ్రంథాలను ఇంగ్లీషు, హిందీ తదితర భాషల్లోకి అలాగే, ఇతర భాషల్లోని గ్రంథాలను తెలుగులోకి అనువదింప చేసి, ప్రచురిస్తుంది.

పాఠ్యపుస్తకాల్లో శాస్త్ర సాంకేతికపరమైన పారిభాషిక పదాలకు తెలుగు అనువాదాలు సరళంగానూ, విద్యార్థికి తేలికగా అర్థమయ్యే రీతిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది.

**అంతర్జాతీయ తెలుగు భాషాభివృద్ధి విభాగం :**

అనేక రాష్ట్రాలలోనూ, అనేక దేశాలలోనూ విస్తరించి ఉన్న తెలుగు వారు భాషాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, తగు పరిష్కారాలను చేపడుతుంది

తెలుగు భాష, తెలుగువారి సంస్కృతులను ప్రపంచం నలు మూలలా పరిచయం చేసి పరివ్యాప్తి కలిగించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. నిర్వహిస్తుంది.

విదేశీయులకు, ఇతర భాషల వారికి తెలుగు నేర్పేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పిస్తుంది. పుస్తకాలను రూపొందిస్తుంది. సాంకేతికంగా సహాయపడుతుంది.

సరిహద్దు ప్రాంతాల్లో తెలుగుపై ఇతర భాషల దాడి నివారణకు తగు చర్యలు తీసుకుంటుంది.

కవిత

# శాశ్వతం

- గుర్రాల రమణయ్య
9963921943

**ఆది** మంత్రంలో
అంతర్లీనమైన మూడక్షరాల్లా
నా భాషకు మూడక్షరాలే
మూడు లోకాల నేలే
ముప్పురు దేవతల్లా
నా రాష్ట్రమూ త్రిలింగమే
కాలం ఆత్మల్లో
ఒదిగిన త్రికాలాల్లా
నా భాషా త్రికాల జ్ఞానే
నిన్నని చూసింది
నేటిని చూస్తుంది
రేపటినీ వీక్షిస్తుంది

అక్షరానికి
ఆఖరి రోజు రాసే
అద్భుతహస్తం లేనట్టు
తెలుగు పదానికి
తెలుగు పథానికి
అంతమన్నది లేదు నిజానికి
ఎంత దాహమంటే
తనివి తీరని దాహం
అక్షరాలను తాగుతున్నకొద్దీ

ఉరకలేస్తుంది ప్రాణం
చినుకు చినుకు చేరి
కాలువ కట్టినట్టు
పది కాలువలు చేరితే
నదై ప్రవహించినట్టు
ఎన్ని భాషల పదాలో
చేరి సముద్రమైన భాష
నా తెలుగుభాష
కోటి కోటి సూర్యుళ్ళొచ్చినా
సముద్రం ఆవిరి కానట్టు
కోటి కోటి తరాలు మారినా
నా భాషకు మరుగు వుండదు

-డా॥సామల రమేష్‌బాబు
9848016136

# ప్రజల భాషలో పరిపాలిస్తేనే మనవి తెలుగు రాష్ట్రాలు

**ఆ**గస్టు 29 అనగానే గిడుగు వేంకట రామమూర్తి పంతులు గుర్తుకొస్తారు. ఈ రోజు ఆయన జయంతి. 1940కి ముందు దాదాపొక అర్ధ శతాబ్దంపాటు జరిగిన వ్యావహారిక/వాడుక భాషోద్యమానికి ఆయనే కీలకం. అయితే ఆయనకు ముందే స్వామినీని ముద్దునరసింహం నాయుడు తన "హిత సూచని"లో వాడుక భాషోద్యమ అవసరాన్ని ప్రస్తావించారు. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని గురజాడ గొప్ప సాహిత్యానికి ప్రాణం పోశారు. ఈ అంశాన్ని గిడుగు పట్టించుకొన్ననాటి నుంచీ దీనికొక గుర్తింపు, ఉద్యమరూపం వచ్చాయి.

గిడుగు వాడుక భాషోద్యమం భాషా రాష్ట్రాల ఉద్యమానికి కూడా స్ఫూర్తినిచ్చింది. ప్రజల వాడుక భాషలో సాహిత్యమూ విద్యాబోధనా జరగాలనే కోరిక అప్పటికే బలపడుతూ వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఎంత అవసరమో, ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలన్న నాటి ఉద్యమాల ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం, ఆ తర్వాత నైజాంలోని తెలుగు ప్రాంతాల విలీనంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. ఇదంతా జరగడానికి రాజకీయ అంశాలు ఎంత కారణమో... దానికి ప్రజల్లో ఏర్పడిన భాషా జాతి భావన అంతే కారణం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'మా భాషలో మమ్మల్ని మేమే పరిపాలించుకుంటాం. మా భాషలో మేం చదువుకొంటూ అనంత విజ్ఞాన వికాసాన్ని అందుకొంటాం' అనే స్వాభిమాన భావనే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పటుకూ దారితీసింది.

అయితే ఇదంతా అప్పటి చరిత్ర. మనతో పాటు ఏర్పడిన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఆ స్వాభిమానాన్ని నిలబెట్టుకొంటూ తమ భాషల్ని కాపాడుకొంటూ అభివృద్ధి చేసుకొంటున్నాయి. తెలుగువాళ్ళం మాత్రం భాషా రాష్ట్రాల మౌలికతను మరచిపోయి, కేవలం అధికార పదవీ రాజకీయాల్లో, స్వార్థ ప్రయోజనాల సాధనలోనే మునిగిపోయాం. ఇందుకు మన రాజకీయ నాయకులు, పార్టీలు బాధ్యత వహించాలి. దీనికి తోడు పాతికేళ్ళుగా వచ్చిపడుతున్న ప్రపంచీకరణ ప్రభావంతో ఆంగ్ల భాషపై మోజు పెరగడంతో పాటు, స్వంత భాషపై నిర్లక్ష్యానికి తెలుగుజాతి ఆటపట్టు అయింది.

డా॥బెజవాడ గోపాలరెడ్డి.పి.వి.నరసింహారావు, ఎన్టీరామారావు తప్ప తక్కిన ముఖ్యమంత్రులకు ప్రత్యేకించి భాషాభివృద్ధిపట్ల శ్రద్ధలేదు. ప్రజాభాషలో పాలన సాగించాలని, ఇది ప్రజాస్వామ్య మౌలిక లక్షణమన్న సంగతిని పాలకులు పట్టించుకోవడం మానేశారు. ఈ పరిస్థితి ఎంతకు దిగజారిందంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శుల కార్యాలయాల నుంచి ఇంగ్లీషే రాజ్యం చేస్తోంది. అన్ని శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ ఉత్తర్వులన్నీ (జీవోలు) ఇంగ్లీషులోనే వస్తాయి. ప్రత్యేకంగా అనుకొంటే తప్ప జీవోల తెలుగు అనువాదాలు కూడా అందుబాటులో వుండవు. సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఇప్పుడు రెండు రాష్ట్రాల ప్రభుత్వాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని వుంది. శిలాఫలకాల మీద గాని, ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల మీద గాని, తెలుగే ప్రముఖంగా ఉండాలన్న అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ఎవరూ పట్టించుకోరు. కొత్త రాజధాని అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు ఫలకం మీద తెలుగు లేదు. ఈ విషయంలో చెలరేగిన నిరసనలను ఈ రోజు వరకు ప్రభుత్వం పట్టించుకొన్న పాపాన పోలేదు. ఫలితంగా ఇటీవల ఆవిష్కరణ జరిగిన పోలీసు కేంద్ర కార్యాలయ భవనంతో సహా అనేక చోట్ల తెలుగుకు చోటివ్వక, ఇంగ్లీషుకే పెద్ద పీట వేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొన్నకేంద్ర ప్రభుత్వ'ఇన్‌కంటాక్స్' కార్యాలయం కూడా త్రిభాషా సూత్రాన్ని మరచిపోయి, ఇంగ్లీషుకే ప్రాధాన్యతనిచ్చింది. కొత్తరాష్ట్రం ఏర్పడిన దగ్గర నుంచి పరిపాలనలో తెలుగును ఒక పద్ధతి ప్రకారం అణచివేస్తున్నారు.

1966లో తొమ్మిదవ చట్టంగా అధికార భాషా చట్టం వచ్చింది. దానిలో అన్ని అంశాలూ స్పష్టంగా వున్నాయి. ఆ తర్వాత పరిపాలన తెలుగులో సాగాలని అనేకసార్లు ఎన్నో జీవోలు వచ్చాయి. ఈ నడక 2014 వరకూ సాగింది. 2013 ఏడాది చివరి రోజున జీవో నెం 909 ద్వారా తెలుగుకు ఒక మంత్రిత్వ శాఖ ఏర్పడింది. తర్వాత కొద్దినెలలకే ఏర్పడిన రెండు రాష్ట్రాల్లోనూ తెలుగులో పాలనకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేదు. నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత పరిస్థితి మరీ దిగజారుతోంది.

పాలనా భాషగా తెలుగు అమలు గురించి మనకున్నన్ని జీవోలు, తదితర ఉత్తర్వులు పొరుగు రాష్ట్రాల్లో లేవు. కాని, వారి పాలకులు- ఏ పార్టీ అధికారంలో వున్నా- తన భాష విషయంలో రాజీపడరు. దానితర్వాతే ఏదైనా! మన పాలకులకు అసలా సంగతే పట్టదు.

ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు... పాలనా భాషగా తెలుగు అమలు విషయాన్ని చాలా ముఖ్యమైనదిగా పరిగణించి సీరియస్‌గా తీసుకున్నారు. 1988 మార్చి నాల్గవ తేదీన ఆనాటి అధికార భాషా సంఘం అధ్యక్షులు నందూరి రామకృష్ణమాచార్యులనూ, ఇతర సభ్యులనూ, కార్యదర్శి సి. ధర్మారావునూ పిలిపించుకొని సమగ్రంగా సమీక్షించి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొన్నారు. వాటి ప్రకారం "తనకు ఇంగ్లీషులో చేరిన ఏ ఉత్తరాన్నయినా, ప్రతిపాదనయైనా, ఏ చర్యా తీసుకోకుండా వాటిని పంపిన కార్యాలయానికే తిప్పి పంపే అధికారం రాష్ట్రంలోని ప్రతిగెజిటెడ్ అధికారికీ వుంటుంది. తమ పైకార్యాలయాల నుంచి వచ్చినా, ఇట్లాగే తిప్పి పంపివేయవచ్చు. ఈ విధంగా తిప్పి పంపడం వల్ల జరిగే కష్టనిష్టురాలకు, నష్టానికి, జాప్యానికి బాధ్యత ఉత్తరాలు, ప్రతిపాదనలు ఇంగ్లీషులో పంపిన కార్యాలయాధిపతి మీదే వుంటుంది. 1988 ఏప్రిల్‌లో మరొక ఆదేశం ఇచ్చారు. శాసనపరమైన కొద్ది అంశాలను మినహాయించి, సచివాలయంలోని ఫైళ్ళన్నీపూర్తిగా తెలుగులోనే నిర్వహించాలి. అవి ఇంగ్లీషులో కనిపించకూడదు. వీటితోపాటు

## ఆహ్వానము

**తెలంగాణ రచయితల వేదిక**
**కరీంనగర్ జిల్లా 5వ మహాసభలు**

### కాళోజి జయంతి సందర్భం - సదస్సు

**తెలంగాణ భాష విశిష్టత - ఆధునికత, ప్రజలు**

9-9-2017 శనివారం ఉ॥10గం.- సా.6గం.వరకు
వేదిక: సినారె ప్రాంగణం, బి.విజయకుమార్ ప్రెస్ భవన్,
**కరీంనగర్.**

ఆచార్య రవ్వా శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.
ప్రొ.జయధీర్ తిరుమలరావు, డా॥నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం, డా॥ సామల రమేష్‌బాబు, డా॥వి.సింగారావు, పెద్దింటి అశోక్ కుమార్, డా॥కాలువ మల్లయ్య, డా॥కె.ముత్యం, డా॥బాలనాగు జంగారెడ్డి, డా॥గూడూరి మనోజ, డా॥ఎ.కె.ప్రభాకర్,డా॥యాకూబ్, గాజోజు నాగభూషణం మున్నగువారు పాల్గొంటారు.

## ఆహ్వానము

### తాపీధర్మారావు 131వ జయంతి సభ

19-9-2017 మంగళవారం సా॥6గం.లకు
వేదిక : విశాఖ పౌరగ్రంథాలయం, బి.వి.కె.కాలేజి ఎదురుగా, ద్వారకానగర్, **విశాఖపట్టణం.**

సాహితీవేత్త, విమర్శకుడు, తెలుగు పత్రికల్లో, తెలుగు సినిమా రంగంలో ప్రజల భాషకు పట్టం కట్టిన ఘనుడు, సంస్కర్త తాపీధర్మారావుగారి జయంతి సభకు విచ్చేయండి.
శ్రీమతి తాపీ సుజాత, డా॥సామల రమేష్‌బాబు, డా॥ఎం.విజయగోపాల్, కిల్లాన దిలిప్, టి.శివశంకర్, కె.ఎస్.చంద్రశేఖరరావు మున్నగువారు పాల్గొంటారు.
పి.కన్నయ్య, **సమైక్య భారతి, విశాఖపట్టణం.**

వెంటనే అమలులోకొచ్చే విధంగా మరికొన్ని సంబంధిత ఆదేశాలను కూడా ఇచ్చారు. ఆ ఏడాదిలోనే ప్రారంభమయ్యే 'విభవ' తెలుగు సంవత్సరాన్ని 'అధికార భాషా సంవత్సరం'గా పరిగణిస్తూ స్పష్టమైన లక్ష్యంతో ఆనాడు ఎన్టీఆర్ ప్రభుత్వం వ్యవహరించి, పరిపాలన మొత్తాన్నీ ప్రజల భాషలోకి మార్చింది. కాని, ఆయన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు... తెలుగుదేశం పార్టీవారు గానీ, కాంగ్రెస్ వారు గానీ అందరూ... ఆ ప్రజాస్వామిక మార్పును తిరగరాసి, పరిపాలనను ఇంగ్లీషు లోకి నెట్టివేశారు.

ఈ పరిస్థితికి పాలక పార్టీల నేతలు.. స్పష్టంగా చెప్పాలంటే ముఖ్యమంత్రులు బాధ్యులు. వారికి రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడమే కారణం. వాళ్లంతా ఓట్ల కోసం ప్రజల భాషలోనే ప్రసంగాలు చేస్తారు. వాగ్దానాలు చేస్తారు. కాని అధికారంలోకి రాగానే అంతా మర్చిపోతారు. కీలక జిల్లా స్థాయి వరకు న్యాయస్థానాల్లో తప్పనిసరిగా స్థానిక భాషలోనే వ్యవహారాలుండాలని స్పష్టం చేసే జీవో నెం. 485/1974 మార్చి 29 (హోంశాఖ)ను ఎవరూ పట్టించుకోరు. అంతా ప్రజలకు అర్థం కాని పరాయిభాషలోనే సాగిపోతోంది. కారణం మన రాష్ట్రపాలక వర్గాల ప్రజా వ్యతిరేక ధోరణులే.

తెలుగులో పాలనగాని, న్యాయ వ్యవహారాలు గాని జరగనప్పుడు ఇది తెలుగు భాషా రాష్ట్రం ఎందుకవుతుంది? తెలుగులో పూర్తిగా పాలించలేని పార్టీ పేరు తెలుగుదేశం అని ఎందుకు వుండాలి? మన రాష్ట్రంలో పాలక పార్టీలే కాదు, ప్రతిపక్షాల నేతలు కూడా ఈ విషయంపై ఎందుకు మౌనంగా వుంటున్నారు? వారి ఉద్యమాంశాలలో ప్రజలభాష వుండదా?ఇవన్నీ కీలక చర్చనీయాంశాలు.

ఇప్పుడు మళ్ళీ గిడుగు రామమూర్తి గారి జన్మదినోత్సవాన్ని తెలుగు భాషా దినోత్సవంగా మన రాష్ట్రప్రభుత్వం నేడు నిర్వహించబోతున్నది. తమకు తోచిన వారికి అవార్డులను ప్రదానం చేసి, ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. కొన్ని వాగ్దానాలను కురిపిస్తారు కూడా. అయితే, గత రెండేళ్ళుగా చేసిన వాగ్దానాలను ఒక్కటైనా ఆయన ప్రభుత్వం అమలు చేసిన పాపాన పోలేదు. వాటి అమలుకు చర్యల్ని ప్రకటించడంతో పాటు, ఈ సారైనా పాలన విషయంలో స్పష్టతనివ్వాలి. 'ఈ రోజు నుంచీ నా కార్యాలయం నుంచీ, నా ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి మొదలుపెట్టి సచివాలయమంతా పరిపాలనను తెలుగులోకి మళ్ళిస్తాం. రాబోయే వంద రోజుల్లో పూర్తిగా ఈ లక్ష్యాన్ని సాధిస్తాం' అని ఆయన వేదిక మీద నుంచి ప్రకటిస్తే ప్రజలంతా సంతోషిస్తారు. అదే విధంగా వివాదాస్పద జీవో 14 ఫిబ్రవరి 2017 (మున్సిపల్ శాఖ)ని అధికారికంగా రద్దు చేస్తూ ప్రభుత్వపాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని కూడా ప్రకటించాలి.

ఇప్పటికైనా తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను నెలకొల్పడానికి చట్టసభల్లో వెంటనే బిల్లును ప్రవేశపెట్టి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి, దాన్ని అమలు చెయ్యాలి. అందుకు తగినంత బడ్జెటు కేటాయింపు ఇవ్వడంతో పాటు రాష్ట్రంలో, విద్యారంగంలో తమ భాషా విధానాన్ని స్పష్టం చేయాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రి మీద వుంది.

*(ది.29-82017 ప్రజాశక్తి దినపత్రిక నుండి)*

-ఆచార్య పులికొండ సుబ్బాచారి

# భాషావిధానంపై బాధ్యతా రాహిత్యం

రెండు తెలుగురాష్ట్రాలలో కలిపి తొమ్మిది కోట్ల మంది తెలుగు మాట్లాడే జనాభా ఉన్నారని తెలుగు ప్రాంతాలకు బయట మరి తొమ్మిది కోట్లమంది తెలుగు మాట్లాడేవారు (ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను) నివసిస్తున్నారని ఇటీవలి కాలపు లెక్కలు తెలుపుతున్నాయి. 18 కోట్ల మంది తెలుగు మాట్లాడుతూ ఉంటే దాదాపు 60 టీవీ ఛానళ్లు 24 గంటలు తెలుగు (భ్రష్ట తెలుగు)లో పనిచేస్తూ ఉంటే దాదాపు 50 లక్షల తెలుగు దినపత్రిక ప్రతులు ప్రతి రోజూ ప్రజలకు చేరుతూ ఉంటే, అంతర్జాలంలో మరికొన్ని లక్షల మంది ఈ పత్రికలు చదువుతూ ఉంటే, ఏదో కొంపలంటుకుంటున్నట్టు తెలుగు రేపో ఎల్లుండో చచ్చిపోబోతూందని గొడవ పెడతారెందుకండీ' అని ఇటీవల ఒక తెలుగు మేధావి తర్కానికి దిగాడు. వినడానికి చాలా బాగుంది. కానీ తెలుగు భాషకు సంబంధించి గొంతెత్తి అరిచేవారు తెలుగు అమలుకోసం అహర్నిశలూ తపించేవారు భయపడుతున్నది తెలుగు చచ్చిపోతుందని కాదు. మాతృభాషకు సంబంధించి తెలుగు ప్రజలకు సహజ సిద్ధంగా వచ్చిన హక్కుల గురించి. తెలుగు ప్రజలు పొందవలసిన విజ్ఞానం, చదువులు, భాష కారణంగానే పొందలేకపోతున్నారని. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు దాటినా తెలుగు ప్రభుత్వాలకు ఒక భాషా విధానం సమగ్రంగా రూపొందించుకోవాలనే తెలివిడి ఇంకా ఏర్పడలేదనే.

సరే తెలుగు చచ్చిపోదు. కానీ జీవచ్ఛవంలా ఉంటే సరిపో తుందా? అవును ఈ తరం వారు అందరికీ తెలుగు రాయడం, చదవడం వచ్చు. ఇప్పటికీ అక్షరాస్యుల సంఖ్య 65 శాతమేనని లెక్కలు చెబుతున్నాయి. అంటే ఇంకా 35 శాతం తెలుగు ప్రజలకు రాయడం, చదవడం రాదనే కదా. ఇప్పటి తరం పోయిన తర్వాత సంగతేమిటి? ఏ బడిలోను తెలుగు చెప్పకపోతే తెలుగు మీడియం పాఠశాలలే లేకపోతే తెలుగు చదవడం రాయడం రాని తరం ఒకటి పూర్తిగా తయారు కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది? కేవలం పాతిక ముప్పై, నలభై ఏండ్లలో తెలుగు రాయడం చదవడం వచ్చిన వారు గతిస్తే పరిస్థితి ఏమిటి? తెలుగు రాయడం చదవడం రాని తరం తయారైనప్పుడు తెలుగు పత్రికలు ఎన్ని లక్షలు అచ్చయితే ఏమి లాభం? అంతర్జాలంతో తెలుగు ఎలా మనగలుగుతుంది? అప్పుడు తెలుగు కేవలం ఒక గిరిజన భాషలాగా వినికిడి భాషగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం అతి దగ్గరగా లేదా? నలభై ఏభై సంవత్సరాలు ఒక వ్యక్తికి దీర్ఘకాలం కావచ్చు. కానీ ఒక జాతికి అది చాలా తక్కువ సమయం. ఇప్పుడు భాష గురించి అజాగ్రత్తగా ప్రవర్తిస్తే జరగబోయే విపరీత పరిణామాలకు బాధ్యత వహించవలసింది ఆ పాపాన్ని మూట కట్టుకోవలసింది ఇప్పటి ప్రభుత్వాలు కాదా?

ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. పోయిన సంవత్సరం ఇదే రోజున తెలుగు ప్రభుత్వం విశేషించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలను ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి సంవత్సరం లాగానే అవి కూడా కనుమరుగు అయ్యాయి. ఆ అమాత్యులు సహా అధికారులు ఆ సభా వేదిక నుంచి కిందికి దిగగానే ఆ సంగతిని మర్చిపోయినట్లుంది.

అంతేకాదు ఇది జరిగిన కొద్దిరోజులకే బాధ్యతగలిగిన ఒక అమాత్యుడు తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని, ఇంగ్లీషు మాధ్యమంలోనే ఉద్యోగాలొస్తాయని మున్సిపల్ పాఠశాలలన్నింటిలో తెలుగు మాధ్యమం తీసేసి ఇంగ్లీషు మాధ్యమం పెడతామని ప్రకటించారు. ఇది భాషా ప్రేమికులకు తీవ్ర అఘాతం అయింది. తెలుగువారు పిల్లల తల్లిదండ్రులు అందరినీ అయోమయానికి గురిచేసింది. ఇది ఎంత బాధ్యతారాహిత్యమైన ప్రకటనో చెప్పవలసిన పనిలేదు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా గురుకుల పాఠశాలలు ఇంగ్లీషు మీడియంలో ఉంటాయని ప్రకటించింది.

పాఠశాలలన్నింటిలోను పదవతరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా ఉంటుందని ఐదవ తరగతి వరకు తెలుగు మాధ్యమం ఉంటుందని వగైరా వగైరా ప్రభుత్వ ఉత్తర్వులు ఎందుకు అమలు కావడం లేదు. దానికి భిన్నంగా బాధ్యత గల అమాత్య శేఖరులు ఇంగ్లీషు మాధ్యమం గురించి ఎందుకు ప్రకటన చేశారు? ప్రభుత్వాలు ఇంత బాధ్యతారాహిత్యంగా ఎందుకుంటున్నాయి, అని ఆలోచించాలి. తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని చెప్పేవారు ఇంకా ప్రభుత్వంలోని వివిధ స్థాయి అధికారులు, అటు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు గ్రహించవలసిన ప్రధానమైన విషయం ఒకటి ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. అంటే 14 లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఈ పద్నాలుగు లక్షల మంది తెలుగు వారికోసం పని చేయాలి. అంటే తెలుగులో పనిచేయాలి అని అర్థం. అంటే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ తెలుగులో ఉండాలి అని అర్థం. తెలుగులో పనిచేయ వలసిన 14 లక్షల మంది ఉద్యోగులు తెలుగు మాధ్యమం కాక ఏ మాధ్యమంలోనో చదువుకోవలసిన అవసరం ఏముంది? బయటి ఉద్యోగాలకు పోయే కొద్దిమంది ఆంగ్లమాధ్యమంలో చదువుకుంటే సరిపోదా? ప్రభుత్వాలు తప్పనిసరిగా అధికార భాష అమలుచేస్తే ఉద్యోగులందరూ తెలుగులో పనిచేయవలసి వస్తే వారు తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలోనే చదువుకోవాలి కదా! కాబట్టి అధికార భాష అమలుకు తెలుగు మాధ్యమంలో చదువులు చెప్పడానికి విడదీయరాని సంబంధం ఉందని ఈ ప్రభుత్వాలు గ్రహించాలి. ఈ సూక్ష్మాన్ని గ్రహించకుండా స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాల తర్వాత కూడా అధికారభాషని ప్రజల మాతృభాషలో నడపలేకపోవడం ప్రభుత్వ

పరంగా ఒక భాషా విధానాన్ని ఏర్పరచుకోకపోవడం మన ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడాన్ని, అవగాహన లేకపోవడాన్ని స్పష్టంగా చెబుతుంది.

అంతే కాదు, ఒక స్వతంత్ర దేశంలోని పౌరులు తమకు దగ్గరలో ఉన్న ఏ ప్రభుత్వ కార్యాలయానికి పోయి అయినా తన మాతృభాషలో అధికారిక కార్యకలాపాలు చేసుకోవడం అనేది అది స్వతంత్ర దేశం అని చెప్పడానికి మొదటి గుర్తు, మొదటి ప్రజాధికారం. ఈ అధికారం ప్రజలకు లేకపోతే ఆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదు. ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వంలో తమకు సంబంధించిన పనులన్నీ తన మాతృభాషలో చేసుకోగలగడం అనేది సహజంగా సంక్రమించిన హక్కు.

ప్రాచీన తెలుగు హోదా పరిస్థితి ఏమిటి? ఈ సంస్థ కార్యాలయాన్ని ఎక్కడ పెట్టుకోవాలో కూడా రెండు తెలుగు రాష్ట్రాలు ఒక అవగాహనకు రాలేకపోయాయి. నిధులను సమంగా తీసుకొని రెండు రాష్ట్రాల్లో కార్యాలయాలు పెట్టుకోవాలా అనే అలోచనకు కూడా రాలేదు. రెండు రాష్ట్రాలలో అధికార భాషా సంఘాలున్నాయి. సాంస్కృతిక సలహాదారులున్నారు. ప్రభుత్వాలు చాలా ఉన్నత స్థాయిలో ప్రకటనలు చేస్తాయి. కానీ క్లాసికల్ తెలుగు సంస్థను ఇంత వరకు మైసూరు నుంచి తెలుగు నేలకు తెచ్చుకోలేకపోయాము. వందల కోట్ల రూపాయలు కేంద్ర నిధులు వృథాగా ప్రతి సంవత్సరం పోతుంటే తెలుగు వారంతా చూస్తూ కూర్చోవలసిందేనా? ఈ మాత్రం శ్రద్ధ లేకపోతే ఎలా.

రెండు రాష్ట్రాలలో మఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో తెలుగు అమలుకు సంబంధించి పాఠ్యపుస్తకాలలో ఉండే భాషకు సంబంధించి, పాఠ్యపుస్తకాలలో ఉండే విషయాల గురించి కూడా భిన్నమైన ఆలోచనలున్నాయి. ఉండడంలో విభేదించ వలసిన అవసరం లేదు. అధికారభాష శైలికి సంబంధించి కూడా భిన్నమైన ఆలోచనలు ఉండవచ్చు. కానీ ఉమ్మడి భాషా విధానాలు ఉండవచ్చు. ప్రాచీన సాహిత్యం ప్రాచీన భాషా పరిశోధన రెండు వైపులా ఒకేలా ఉంటుంది. భాషాశాస్త్రం, కావ్యశాస్త్రం, వ్యాకరణం ఛందస్సు వంటి శాస్త్రాలు రెండు చోట్ల ఒకటే. కాగా ఉమ్మడిగా ఆలోచించి చేయవలసిన పనులు పైన చెప్పినట్లుగా ప్రాచీన తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటు వంటివి చాలా ఉన్నాయి. ముందు వారి వారి రాష్ట్రాలలో భాషావిధానాలు ఏర్పరచుకొని తర్వాత ఉమ్మడి విషయాల గురించి దృష్టి పెట్టవచ్చు. భాషా సాహిత్యాలకు కేంద్ర ప్రభుత్వ నిధులను సంపాదించుకోవడంలో ఉమ్మడి వ్యూహాలు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకు రెండు రాష్ట్రాల అధికారభాషా సంఘాలు లేదా సాంస్కృతిక శాఖలు కలిసి పని చేయవలసి ఉంటుంది.

ఏ అధికారాలు లేని అధికార భాషా సంఘాల స్థాయిలో అన్ని అధికారాలున్న ప్రాధికార సంస్థలు రావాలి. ఈ సంస్థ భాష అమలుకు సంబంధించి ఒక ఉత్తర్వు ఇస్తే దాన్ని అన్ని ప్రభుత్వ సంస్థలు విధిగా పాటించేలా చేసే అధికారం ఈ సంస్థలకు కట్టబెట్టాలి. అసలు అధికారభాషా సంఘం అధ్యక్షులను ఎంపిక చేయడంలోనే వీరి శ్రద్ధ కనిపిస్తూ ఉంది. భాషా శాస్త్ర నేపథ్యం లాంగ్వేజ్ ప్లానింగ్‌తో ఏ సంబంధం లేని వారిని ఎన్నడూ భాషల వినిమయం, అమలుకు సంబంధించిన పనిచేయని వారిని ఈ పదవిలో నియమించడం రాజకీయ పునరావాసాన్ని అస్మదీయులకు కల్పించే విషయంలో చూపే శ్రద్ధవల్ల జరుగుతూ ఉంది. ఆ పనికి తగిన వారిని నియమించే శ్రద్ధకాని ఆలోచన కాని ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయం.

లాంగ్వేజ్ ప్లానింగ్ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న అనుభవజ్ఞులను భాషోద్యమంలో అంకితమై పనిచేసే వారిని పిలిచి చర్చించి, అలాంటి అనుభవజ్ఞులతో భాషా ప్రాధికార సంస్థలను ఏర్పరచుకొని, అధికార భాష అమలుకు, తెలుగు మాధ్యమం అమలుకు ఉన్న లంకెను గ్రహించి వాటిని కలిపి భాషా వికాస వ్యూహాలను రూపొందించుకోవాలి. ఇప్పటికైనా తెలుగు ప్రభుత్వాలు కళ్ళు తెరిచి వృథాగా పోతున్న కేంద్రప్రభుత్వ నిధులను తెచ్చి క్లాసికల్ లాంగ్వేజ్ సంస్థను మన రాష్ట్రాలలో ఏర్పరచుకోవాలి. ఇప్పటికైనా మించి పోయింది లేదు తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ముందు ఉద్యోగాలు వస్తాయనే భరోసాను ప్రభుత్వాలు కల్పించాలి. చిత్తశుద్ధిని చూపిస్తే సాధించలేనిది లేదని గ్రహించాలి.

*(ది. 29-82017 **ఆంధ్రజ్యోతి** దినపత్రిక నుండి)*



# అన్ని మునిసిపల్ పాఠశాలల్లో ఇంగ్లీషుతోపాటు తెలుగు మీడియం కొనసాగించాలి.

## -ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి.

2006 నుండి ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి ప్రైవేట్ పాఠశాలల్లోలాగా మునిసిపల్ పాఠశాల విద్యార్థులు కూడా ఇంగ్లీషు మీడియం ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించారు. తెలుగు మీడియంలో చదవాలనుకునే విద్యార్థులు తెలుగు మీడియం చదువుతున్నారు. అయితే 2017-18 విద్యాసంవత్సరం నుండి మునిపల్ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం విద్య అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంగ్లీషు మీడియం విద్య ఇప్పటికే ఉంది కదా, కొత్తగా అమలు చేయాలని నిర్ణయించడంలో ఉద్దేశం ఏమిటి? అంటే మునిసిపల్ స్కూళ్ళలో తెలుగు మీడియం తొలగించి వాటిని పూర్తిగా ఇంగ్లీషు మీడియం స్కూళ్ళుగా నడపదలచుకున్నారా? ఇదిప్పుడు భేతాళ ప్రశ్న అయిపోయి కూర్చుంది. ఎందుకంటే తెలుగు మీడియం ఉంటుందా, ఉండదా అనే విషయం మునిసిపల్ శాఖ గాని, విద్యాధికారులుగాని స్పష్టంగా చెప్పడం లేదు. జి.ఒ.ఎం.ఎస్.నెం.14 / 02-01-2017 లో ఇప్పుడున్న తెలుగు మీడియం మునిసిపల్ స్కూళ్లన్నీ ఒకటి నుండి పదో తరగతి వరకు ఇంగ్లీషు మీడియం స్కూళ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. 2016-17 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివే విద్యార్థులకు ఇది వర్తించదు అన్నారు. అంటే వాళ్లు తెలుగు మీడియంలో కావాలంటే చదవొచ్చు. మరి ఒకటి నుండి తొమ్మిదో తరగతి వరకు తెలుగు మీడియం రద్దయిపోతుందా? అదే జీవోలో 2016-17లో అన్ని మునిసిపల్ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు హర్షించారని కూడా అన్నారు. ఫౌండేషన్ కోర్సు వల్ల విద్యార్థుల స్థాయి బాగా పెరిగి పోటీ పరీక్షలకు వాళ్లను తయారుచేస్తోందని, ఇందులో మాధ్యమం చాలా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అందువల్ల ఫౌండేషన్ కోర్సు తప్పనిసరి చేస్తున్నామని జీవోలో ఉంది. మునిసిపల్ స్కూళ్ళలో తెలుగు మీడియం రద్దుచేయాలనే ఉద్దేశమే ఉంటే అదెందుకు స్పష్టంగా చెప్పరు?

తర్వాత మళ్లీ 13.07.2017న మునిపల్ శాఖ వారు జారీ చేసిన సర్క్యులర్ (Lr. Roc.No. 7176/2016/J2) లో ఒకటి నుండి పదో తరగతి వరకు ఇంగ్లీషు మీడియం పుస్తకాలు సంబంధిత అధికార్ల నుండి తీసుకోమని హెడ్ మాస్టర్లను ఆదేశించారు. పోయిన సంవత్సరం తొమ్మిదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదువుకున్న విద్యార్థులు పదో తరగతిలో అదే మీడియంలో కొనసాగుతారని సర్క్యులర్‌లో ఉంది. మరి ఒకటి నుండి తొమ్మిదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివే అవకాశం ఉంటుందా, ఉండదా? ఈ విషయం చెప్పకుండా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ఇంగ్లీషు మీడియంలోకి మారేలా ప్రోత్సహించాలని చెప్పారు. ప్రోత్సహించాలి (మోటివేట్) అనంటే అర్థం బలవంతంగా ఇంగ్లీషు మీడియంలోకి మార్చమనైతే కాదు. విద్యార్థులు తెలుగు నుండి ఇంగ్లీషు మీడియంలోకి మారుతున్నారు కాబట్టి మిగిలిపోయిన తెలుగు మీడియం పుస్తకాలను డి. ఈ.వోల ద్వారా మునిసిపల్ కమిషనర్లు సేకరించి భద్రపరచమని ఆదేశించారు. అయితే తెలుగు మీడియంలో చదవాలని కోరుకునే వారికి ఇక ఆ అవకాశం ఉండదని ఎక్కడా చెప్పలేదు. ఉంటుందని కూడా చెప్పలేదు. ఏమిటీ గందరగోళం? తెలుగు మీడియంలోనే చదవాలనుకునే విద్యార్థులకు బదులు మొదలయ్యి యాభై రోజులు దాటినా పాఠ్యపుస్తకాలు సరఫరా కాలేదు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థిసంఘాలు, ప్రజాసంఘాలు, మేధావుల ఒత్తిడి వల్ల తెలుగు మీడియం పుస్తకాలు ఆగస్టు మొదటి వారంలో సరఫరా చేశారు. అందువల్ల తెలుగు మీడియం ఉంటుందని అనుకోవాల్సి వచ్చింది కానీ తెలుగు మీడియం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేయలేదు..

ఆగస్టు 4నాడు మునిసిపల్ శాఖవారు జారీ చేసిన మరో సర్క్యులర్ (Roc.No.7176/2016/J2) లోకూడా తెలుగు మీడియం కొనసాగు తుందని చెప్పలేదు. మునిసిల్ కమిషనర్లు ఒకటి నుండి పదో తరగతి వరకు ఇంగ్లీషు మీడియం పుస్తకాలు, పదో తరగతి తెలుగు మీడియం వారికి తెలుగు మీడియం పుస్తకాలు అందేలా చూడాలని చెప్పారు, తెలుగు మీడియం పుస్తకాల పంపిణీకి సంబంధించి చాలా గందరగోళం ఉంది. అది అర్థం చేసుకునేంత పరిజ్ఞానం నారాయణ స్కూళ్ళలో చదవని మాబోటి వారికి లేదు. కాబట్టి తెలుగు మీడియం విషయం సూటిగా చెప్పగలరు. ఇదిలా ఉండగా రానున్న పరీక్షలు ఇంగ్లీషులో రాయవలసి ఉంటుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులు ఎవరికి ఇష్టమొచ్చిన మాధ్యమంలో వాళ్లు చదువుకోడం చాలా న్యాయమైన విషయం. బలవంతంగా అందర్నీ ఇంగ్లీషు మీడియంలోకి లాగాలనే అత్యుత్సాహం మునిసిపల్ శాఖ వారికి ఎందుకో అర్థం కావడం లేదు. ఒకటి నుండి అయిదవ తరగతి వరకు 99.5 శాతం మంది ఇంగ్లీషు మీడియంలో చేరారని మునిసిపల్ శాఖ వారు చెబుతున్నారు. వాస్తవానికి 3,4,5వ తరగతి విద్యార్థులను వాళ్లనడగకుండా, తల్లిదండ్రులకు కూడా తెలుపకుండా ఇంగ్లీషు మీడియంలోకి మారినట్లు చూపిస్తున్నారు గాని వారంతా తెలుగు మీడియం విద్యార్థులే. ఇలా చేయడం వారి హక్కుల్ని హరించడమే. బలవంతంగా ఇంగ్లీషు మీడియంలోకి మారిస్తే విద్యార్థులు బడి మానేయడం ఖాయం. మునిసిపల్ శాఖ తీరు చూస్తుంటే తెలుగు మీడియంను పూర్తిగా రద్దు చేయబోతున్నాం అని సూటిగా చెప్పలేక, పొమ్మనలేక పొగబెట్టినట్లు ఉంది.

ప్రొద్దుటూరులోనైతే గత మునిసిపల్ చైర్మన్ మార్చి 2017లో పట్టణంలోని మునిసిపల్ పాఠశాలలన్నిటిలో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉండాలని లేఖ రాసినట్లు తెలిసింది. విద్యార్థుల సమ్మతి లేకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఇలా తానే నిర్ణయం తీసుకోవడం చాలా అన్యాయం. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటి నుండి పదవ తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలి. తెలుగురాష్ట్రంలో తెలుగు మాధ్యమంలో చదువుకోవడానికి ఇన్ని ఆటంకాలు కల్పించడం, తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయాలని ప్రయత్నించడం చాలా విపరీతమైన విషయం. ప్రభుత్వం తక్షణమే మునిసిపల్ స్కూళ్లలో తెలుగు మీడియం కొనసాగుతుందని ప్రకటించాలి.

విద్యార్థుల పరిస్థితిని, వారి ఇష్టాయిష్టాలను, కష్టాలను గుర్తించి రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ పాఠశాలల్లో ఒకటి నుండి పదో తరగతి వరకు ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేస్తూ వెంటనే జి.వో విడుదల చేయాలి.

**ఇట్లు**

**ప్రొద్దుటూరు సామాజిక సంస్థలు, ప్రజలు**

-డా॥మాడభూషి శ్రీధర్
9490412108

# తెలుగు అధికార భాష అనడం అబద్ధం

**తెలుగు రానివాడికీ, తెలుగు మాత్రమే వచ్చిన వాడికీ ఆంగ్లం తెలియకపోవడం వల్ల తీరని అన్యాయం జరుగుతోంది. ప్రపంచంలో ఎక్కడా తల్లిభాషకు ఇంత ద్రోహం జరగడంలేదు. ఆంగ్లభాషా బానిసత్వపు జాడ్యం ఆంధ్రానికి పట్టుకుంది.**

పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్ భాషలు వాడుతున్నప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టులలో ఆ రెండు భాషలను ఎందుకు వినియోగించడం లేదు? అని ఒక నాగరికుడు న్యాయమంత్రిత్వశాఖను సమాచారహక్కు కింద అడిగాడు. పార్లమెంటు మరోచట్టం చేసేవరకు ఉన్నత న్యాయ స్థానాలలో, ఉభయ సభలలో, రాష్ట్రాల శాసన సభలలోనూ బిల్లులు, చట్టాల సవరణలు, రాష్ట్రపతి, గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లు, రాజ్యాంగం కింద, పార్లమెంట్ శాసనసభలు చేసిన చట్టాల కింద, జారీ చేసే ఉత్తర్వులు ఇంగ్లీష్‌లో మాత్రమే ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 స్పష్టంగా చెప్పింది. 348(2) కింద రాష్ట్రపతి ముందస్తు అనుమతితో ఏ రాష్ట్రమైనా తమ హైకోర్టులో హిందీ లేదా తమ భాషను వినియోగించుకోవడానికి నిర్ణయం తీసుకోవచ్చు. ఒక వేళ ఏ రాష్ట్రమైనా ఇంగ్లీష్ కాకుండా మరొక భారతీయ భాషను నిర్దేశిస్తే, ఆ రాష్ట్రంలో చేసిన బిల్లులకు, చట్టాలకు ఇంగ్లీష్ అనువాదాలు అధికారిక రాజపత్రాలలో ప్రచురించాలి. అంటే భారతీయ భాషను అత్యున్నత న్యాయ, శాసన విభాగాలలో ఉపయోగించడానికి వీలులేదు. ఈ ఆర్టికల్ ప్రకారం వ్యవహరిస్తున్నామని న్యాయ మంత్రిత్వ శాఖవారు జవాబు ఇచ్చారు.

భారతీయ భాషా ప్రేమికులు ఎంత గింజుకున్నా లాభం లేదు. ఇటీవల విజయవాడలో రెండురోజుల పాటు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. మన భాషను ఎక్కువగా వాడాలని మంత్రులు, న్యాయ మూర్తులు, కవులు, రచయితలు, పండితులు, నటులు సముచిత సందేశాలు ఇచ్చారు. ఏ విధంగా అనే సందేహానికి మాత్రం సమాధానం ఏ భాషలోనూ దొరకలేదు. **జీవించే హక్కులో తెలుసుకునే హక్కు కూడా ఉందని సర్వోన్నత న్యాయస్థానం అనేకమార్లు వివరించింది.** ఆ మాటను ఇంగ్లీష్‌లో చెప్పింది. తెలుగు, హిందీ వంటి భారతీయ భాషలు మాత్రమే తెలిసిన వారికి ఈ హక్కు ఉందని తెలియదు. సర్వోన్నత శాసనం మన రాజ్యాంగం, ఇంకా వేలాది చట్టాలు ఉన్నాయి. **అప్పుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రానికీ, ఇప్పుడు రెండు రాష్ట్రాలకూ తెలుగులో చట్టాలు లేవు. తెలుగులో చట్టాలు ఉండాలని చట్టమే లేదు. పుట్టి పెరుగుతున్న ప్రతి పౌరుడికీ చట్టాలు తెలుసునని న్యాయశాస్త్రం భావిస్తుంది. ఇది చట్టపరంగా వమ్ముకాని భావన. నాకు ఇంగ్లీష్ రాదు, తెలుగే వచ్చు. కనుక నాకు హక్కులూ బాధ్యతల గురించి తెలియదంటే కోర్టులు అంగీకరించవు. నీకు తెలిసినా తెలియక పోయినా తెలుసునని భావించి, తప్పు చేస్తే శిక్ష వేస్తారు.** రేషన్ కార్డు దరఖాస్తు నుంచి మొదలై మంచినీటి సరఫరా, వాహనం లైసెన్స్, బడిలో చేరడానికి దరఖాస్తు, ఓటరు కార్డు, పదో తరగతి పత్రాలు వంటి అనేకానేక **వ్యవహారిక పనులన్నీ తెలుగువాడు వచ్చీరాని ఆంగ్లంలో చేయవలసిందే. కవిత్వం, సాహిత్యం, నవలలు తప్ప మిగిలిన అన్ని రంగాలలో వాడేది ఆంగ్లమో, లేక ఆంధ్రాంగ్ల సంకరమో తప్ప ఆంధ్రం మాత్రం కాదు. తెలుగు అధికార భాష అన్నది అన్నిటికన్నా పెద్ద అబద్ధం. అది వ్యవహార భాష కూడా కాదు. 'సత్యమేవ జయతే' అనే వేదవాక్యం మన నినాదం, విధానం కాదు. అబద్ధం ఆధారంగా మనుగడ సాగిస్తున్న మనం ఆడే మరొక అబద్ధం- తెలుగే అధికార భాష.** రాజ్యాంగం, శిక్షాస్మృతి వంటి కీలకమైన శాసనాలు తెలుగులో లేకుండా వాటిని తెలుసుకుని పౌరులు ఏ విధంగా అనుసరిస్తారని తెలుగు భాషాభిమానులు ఆలోచించవలసి ఉంది. సాధారణ జీవనంలో, సమాజంలో అందరితో సంభాషించడానికీ, లేఖలకీ, ఈమెయిల్స్ -పొట్టి ముచ్చట్లు పంపుకోవడానికీ తగిన భాషను తయారుచేసి, దాన్ని వినియోగించే సాంకేతిక ప్రజ్ఞను సమకూర్చ కుండా తెలుగో తెలుగని గుండెలు బాదుకోవడం వల్ల ఏమిటి ప్రయోజనం?

తనకు అన్యాయం జరిగితే తెలుగువాడు పోలీసు స్టేషన్‌లలో తెలుగులో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందా? దానికి దిక్కూ మొక్కూ ఉంటుందా? ఆ నేరానికి సంబంధించి ఇచ్చే ప్రకటనలు, వాంగ్మూలాలు తెలుగులో నమోదు చేసుకునే వీలు ఎంతవరకు ఉంది? ఆరోపణ పత్రాలు ఆంగ్లంలో ఉంటే తెలుగు మాత్రమే తెలిసిన నిందితుల గతేమిటి? వారి నేరాన్ని రుజువు చేసే సాక్ష్యాలను ఇంగ్లీషులో వెల్లడిస్తే, తెలుగులో చెప్పినా వాటిని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే, ఆ అనువాదం సరిగ్గా ఉన్నదో లేదో – ఇవన్నీ ఎవరు వివరిస్తారు? కోట్లాది కేసుల గందరగోళంలో పడి ఊపిరి తీసుకోవడానికి కూడా ఖాళీ లేని న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఆ అనువాదాలను పరిశీలించి, సక్రమంగా ఉన్నాయో లేదో నిందితుడికి ఎప్పుడైనా చెప్పడం జరిగిందా? నిజానికి కోర్టులలో ఎంతమందికి తెలుగువచ్చు? అందులో ఎందరికి నిజంగా ఇంగ్లీష్ వచ్చు?

తెలుగులో న్యాయం దొరకదు. ఇంగ్లీష్‌తో పాటు చట్టాలు కూడా తెలిసీ తెలియని న్యాయవాదులు, అసలు ఏమీ తెలియని న్యాయార్థులను మోసం చేస్తూ ఉన్నా దీని మీద కూడా ఫిర్యాదు ఇంగ్లీష్‌లో చేసుకోవలసిందే. తెలుగు రానివాడికీ, తెలుగు మాత్రమే వచ్చిన వాడికీ ఆంగ్లం తెలియకపోవడం వల్ల తీరని అన్యాయం జరుగుతోంది. **ప్రపంచంలో ఎక్కడా జన్మభూమిలో తల్లి భాషకు ఇంత ద్రోహం జరగడం లేదు. ఆంగ్లభాషా బానిసత్వపు జాడ్యం ఆంధ్రానికి పట్టుకుంది. తెలుగు అంతరించే భాషలలో ఉందంటే ఆశ్చర్యమా?**

*(వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్)*

*(మూడేళ్ళక్రితం సాక్షి దినపత్రిక నుండి..)*

# మాతృభాష ...... జిందాబాద్.

-యర్రంశెట్టి శాయి
76809 22626

అర్ధరాత్రి-

తలుపులు దడ దడ బాదారెవరో-దొంగలేమో అని ఖంగారు పడ్డాడు సాయిరాం-ఎందుకైనా మంచిదని ఒక కర్ర తీసుకుని తలుపు వెనుక నక్కాడు.

"ఎవరు?" అడిగింది వాళ్ళావిడ జెర్మనీ భాషలో-

"మేమే-ఇంటర్నేషనల్ స్మగ్లర్స్..మా సాయం కావాలని ఆన్ లైన్ లో రిక్వెస్ట్ పెట్టారుకదా" వాళ్ళు ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పారు.

"ఫర్లేదు తలుపు తియ్-వాళ్ళుమన రాజకీయ నాయకుల్లాంటోల్లు కాదు-చాలా మర్యాదస్తులు" ఆమెతో స్పానిష్ భాషలో చెప్పాడు సాయిరాం. ఆమె తలుపు తెరచింది. ముగ్గురు వ్యక్తులు లోపలికొచ్చి సోఫాల్లో కూర్చున్నారు. వెంటనే సాయిరాం ఫోన్లు చేసి పదిమంది కాలనీ వాళ్ళను తమిళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ భాషల్లో పిలచాడు.

వాళ్ళంతా నిద్ర కళ్ళతో వచ్చారు-

"మీరు చెప్పింది చాలా కష్టమైన పని సార్ - వందకోట్ల రూపాయలు ఖర్చౌతుంది" అన్నారు స్మగ్లర్స్ హిందీలో.

"50 లక్షలకు కుదరదా?" అడిగాడు రంగారెడ్డి కేరళ భాషలో.

"మాకు కేరళా లాంగ్వేజ్ రాదు" అన్నారు వాళ్ళు ఒరియా భాషలో.

"నాకు పంజాబీ వచ్చు" అన్నాడు రంగారెడ్డి గుజరాతీలో.

"పోనీ మీకు అస్సామీ భాష వచ్చా?" అడిగాడతను నాగాలాండ్ భాషలో.

"అది మా కాలనీలో ఎవ్వరికీ రాదు" మిజోరాం భాషలో చెప్పాడు యాదగిరి.

"మీరందరూ హైదరాబాద్‌లో వుంటున్నారు కదా! మీ అందరూ తలోభాషా మాట్లాడుతున్నారేంటి?మీకు మాతృభాష లేదా?" అడిగారు వాళ్ళు జపనీస్ భాషలో.

"అందరం మొఖాలు చూసుకున్నాం. అవును మిగతా అన్ని రాష్ట్రాల్లో లాగా మనకూ ఒక మాతృభాష వుండాలి కదా" అన్నాడు జనార్ధన్ ఆలోచనలో పడుతూ.

"అవన్నీ మాకు మాతృభాషలే" అంది శ్యామలా దేవి.

"మదర్ టంగ్ లేకపోతే పోనీ కనీసం ఫాదర్ టంగ్ అయినా ఉందా?" ఆ స్మగ్లర్స్ మళ్ళీ ఉర్దూలో అడిగారు.

ఈ లోగా మా కాలనీ ప్రెసిడెంట్ గోపాలరావ్ వాళ్ళ తాతయ్యను తీసుకొచ్చాడు. వాళ్ళ ప్రశ్న విని ఆయన కన్నీళ్లు పెట్టుకుంటూ సమాధానం చెప్పాడు అరబిక్ భాషలో.

"అది వంద సంవత్సరాల కిందటి విషయం బాబూ.. అంటే 2017 వ సంవత్సరం! అప్పుడు నా వయసు పన్నెండేళ్ళు..



రెండు తెలుగు రాష్ట్రాల నాయకులందరూ కలసి స్కూళ్ళల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టేసరికి తెలుగు అనే మా మాతృభాష దిక్కులేని చావు చచ్చింది బాబూ.. అప్పటినుంచి మేము ఎవడికి తోచిన భాష వాళ్ళు నేర్చుకుని మాట్లాడుకుంటున్నాం. మా పిల్లలు మాట్లాడే భాష మా కర్థం అవదు. మా మనవలు మాట్లాడే భాష మా పిల్లలకు అర్థం కాదు. నేను నా ఈ నూట పన్నెండేళ్ళ వయసులో..ఎన్నో రకాల హత్యలూ, సజీవ సమాధులూ చూసాను కానీ ఇలా సాక్షాత్తూ తల్లి లాంటి భాషను సజీవ సమాధిచేసిన సంఘటన మా తరం వాళ్ళమే చూసాము. అప్పటినుండి తెలుగువాళ్ళం తల్లిలేని వాళ్ళమైపోయాము బాబూ–మా మాతృభాష గొప్పతనం గురించీ, మా ఆనాటి పాలకులు మాకుచేసిన ద్రోహం గురించీ భావితరాల వారికి తెలియజేసి అప్పుడు ప్రాణాలు విడవాలని ఇంతకాలం బ్రతికి వున్నా–ఇప్పుడు మా మాతృభాష గురించి కనీసం మీలాంటి మనసున్న ఇంటర్నేషనల్ స్మగ్లర్స్ అడిగారంటే నాకదే ఎంతో ఆనందంగా వుంది బాబూ!" అంటూ ప్రాణాలు విడిచాడతను.

స్మగ్లర్స్ కన్నీళ్లు తుడుచుకున్నారు.

"మేము ఇంటర్నేషనల్ స్మగ్లర్స్ కనుక మేము అన్ని భాషల్లో మాట్లాడతాం. కానీ మాకూ ఒక మాతృభాష వుంటే బాగుండేదని మేమెప్పుడూ ఫీలవుతూ వుండేవాళ్ళం. మాతృభాష తీయదనం ఇంకే భాషకూ ఉండదని మాత్రం మాకనిపిస్తూండేది" అన్నాడు ఒకతను గోవన్ భాషలో.

"అంటే మీకూ మాతృభాష లేదా?" రష్యన్ భాషలో అడిగాడు యాదగిరి.

"ఉండేదని మా తాత ముత్తాతలు చెప్తూండే వారు. అదే తెలుగు భాష అని మీ తాత గారు చెప్తూంటే మాకిప్పుడు అర్థమయింది..." కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పారు వాళ్ళు పోర్చుగీస్ భాషలో.

సాయిరాం వెంటనే కాలనీ వాళ్ళతో చైనీస్ భాషలో మాట్లాడాడు.

"సోదరులారా! మన మాతృభాష వాచకం, లిపి అన్నీ ఎప్పుడో మనకు దూరమైపోయాయ్. అవి మన రాష్ట్రాల్లో పోయినా విదేశాల్లో స్థిరపడిన మనవాళ్ళు వాటిని జాగ్రత్తగా దాచుకున్నట్లు తెలిసింది. దాచుకోవటమే కాదు వాళ్ళు ఇప్పటికీ తెలుగు భాష మాట్లాడు తున్నారని కూడా మనకు ఈ ఇంతర్నేషనల్ స్మగ్లర్స్ చెప్తున్నారు.

వారందరి సాయంతో మన భాషని మనకి తిరిగి అందుబాటులోకి తేవడానికి వంద కోట్లు వీరికి మనం ఇవ్వాలి. కనుక వెంటనే అందరూ తలో కోటి రూపాయలూ ఇస్తే వీళ్ళు మనకి సాయం చేస్తారు" అనగానే

"ఎంత డబ్బైనా ఇవ్వడానికి మేము రెడీ" అంటూ అందరూ హిబ్రూ భాషలో అరచారు.

మాతృభాషమీద వాళ్ళకున్న ప్రేమ చూసేసరికి స్మగ్లర్స్ కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్.

వెంటనే వాళ్ళ నాయకుడు లేచి ఏడుపు ఆపుకుంటూ అందరినీ కౌగలించుకున్నాడు.

"సోదరులారా!" అంటూ ఫ్రెంచ్ భాషలో మాట్లాడటం మొదలు పెట్టాడు.

"మేము ప్రపంచ దేశాలన్నిటిలో అన్నిరకాల స్మగ్లింగ్‌లూ చేసాం. కానీ ఇంతవరకూ మాతృభాషల స్మగ్లింగ్ చేయలేదు. ఇక్కడి కొచ్చేవరకూ అదికూడా చేయాలని అనుకున్నాం గాని ఇప్పుడు మీ మాతృభాష మీద మీకున్న ప్రేమాభిమానాలు చూస్తోంటే మీదగ్గర ఒక్క పైసా కూడా తీసుకోకుండా మీకు సాయం చేయాలని నిర్ణయించుకున్నాం.

కేవలం నెలరోజుల్లోనే ఇటలీ నుంచి మీకు తెలుగు భాషకు చెందిన సామాగ్రితోపాటు తెలుగు నేర్పే ఆచార్యులను కూడా తీసుకొచ్చి మీ కాలనీకి బహూకరించదల్చుకున్నాం"

మొత్తం మా కాలనీ అంతా చప్పట్లతో మార్మోగి పోయింది.

కవిత

## భాషను బతికించుకోవద్దా?

**–గంటేడ గౌరునాయుడు**

ఆక్రమించుతోంది బడిని ఆంగ్ల మాధ్యమం
మాతృభాషకోసము సాగాలి ఉద్యమం
వ్యవహారిక భాషకొరకు ఎత్తిన పిడికిళ్ళలోని
సత్తువ ఏమాయె? ఏదీ తెలుగు పౌరుషం ?

గొంతు మార్చుకోవాలట మన బడి గంట
వెలుగుభాష మరవాలట తెలుగు దీపమంట
పిల్లలపుడె నేర్వాలట తెల్లవాడి మాట
నలగాలట ఆంగ్లం ఇక తెలుగువారి నోట.

మనమంతా బానిసలం, గానుగలం, పీనుగలం
కావాలని, తెల్లోడికి ఊడిగమే చేయాలని
ఏనాడో బీజం వేసాడిక్కడ మెకాలె,
ఆ ఫలితం అడుగడుగున ఆంగ్ల మెకాలే.

కమ్ముకుంది నేలంతా ఆంగ్లభాష కాలుష్యం
అయ్యో అడుగడుగునా అమ్మభాష కవమానం
మరణశయ్య ఎక్కనుంది కదా మాతృభాష
తల్లడిల్లి ఆడుతోంది తెలుగుతల్లి శ్వాస.

ఎంత ఎదిగినా చెట్టువేళ్ళు నేలలోనే
ఎన్ని నేర్చినా తృప్తి అమ్మ మాటతోనే
అంగడిలో పరభాషలు అవసరార్థమే
అమ్మభాష వద్దన్న బ్రతుకు వ్యర్థమే.

పెట్టు'బడులు' మరీమరీ బలపడేందుకు
సర్కారు బడులు చల్లచల్లగ మూసేందుకు
నేతలాడుతున్న గొప్పనాటకం ఇదీ–దీన్ని
ఆపాల్సిన బాధ్యత మనపైనె ఉన్నదీ.

మహామహెూదయులారా ! మేధావుల్లారా !
ఉద్యమ నిర్మాతలార ! ఉపాధ్యాయులారా !
మాతృమూర్తి మౌనఘోష ఆలించండీ
భాషను బ్రతికించగ పోరాడుదాము రండీ!

-రమేష్ పట్నాయిక్
9440980396

# "సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ పాఠశాలల చట్టం" విద్యావ్యాపారాన్ని నియంత్రిస్తుందా?

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో విద్యావ్యాపారాన్ని నియంత్రించడం అనే ప్రకటిత లక్ష్యంతో ఒక ముసాయిదా చట్టాన్ని అనుబంధ నియమావళిని మరియు ఇతర పత్రాలను రూపొందించి అంతర్జాలంలో అధికార వలగూడులో ఉంచింది. వీటిపై ఆసక్తి ఉన్నవాళ్ళు తమ అభిప్రాయాన్ని ఆన్‌లైన్‌లో తెలియజేయడానికి ఒక అవకాశాన్ని ఇచ్చింది. మన రాష్ట్రంలో నిరక్షరాస్యులు 65 శాతం, అంతర్జాల నిరక్షరాస్యులు సుమారు 90 శాతం. వీరిలో ఎవరూ స్వతంత్రంగా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయలేరు. సదరు ముసాయిదా ఆంగ్లంలో ఉంది. అదీ చట్ట సంబంధమైన భాష కావడంచేత చాలామందికి అర్థంచేసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు. వీటన్నింటికి మించి ఆసక్తి ఉన్న వాళ్ళు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి ప్రభుత్వం ఒక వారం గడువు మాత్రమే ఇచ్చింది. ఈ పరిస్థితులలో ఎంత మంది తమ అభిప్రాయాలను తెలియజేయగలరో చూడాలి. ప్రభుత్వం ముసాయిదా చట్టంపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి గడువును తగినంతగా పెంచడమేకాక ఇతర ఆటంకాలను కూడా తొలగిస్తుందని ఆశిద్దాం.

1982 లో ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం వచ్చిన విషయం తెలిసిందే. 1982 విద్యా చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల స్థాపన మరియు నియంత్రణకు 1983 నుంచి 1988 వరకు వచ్చిన అనేక నిబంధనావళుల స్థానంలో 1994లో క్రొత్త నిబంధనావళి తీసుకువచ్చారు. ఈ నిబంధనావళికి ఆనాటి నుంచి నేటి వరకు అనేక సవరణలు వచ్చాయి. వచ్చిన సవరణలన్నీ కూడా చట్టాన్ని నీరు గార్చేవే. కాగా, చట్టం కాని, దాని నిబంధనలు కానీ ఏనాడూ సక్రమంగా అమలు జరగలేదు. సదరు చట్టం ప్రకారం ఏ సంస్థ అయినా పాఠశాల పెట్టడానికి 'ఆవశ్యకత' నిబంధనను పాటించాలి. అంటే ఇంతవరకు విద్య అందని వారి కొరకు వారున్న ప్రాంతంలో మాత్రమే పాఠశాల పెట్టాలి. ఈ నిబంధనను పరిశీలిస్తే ఆందరికీ విద్య అందాలనే సామాజిక స్పృహ ఉన్న ట్రస్టులు పాఠశాలలు స్థాపించిన కాలంనాటి ఆచరణను చట్టబద్ధం చేసారని మనకు అర్థమవుతుంది. అయితే ఆ చట్టం చేయబడిన మరుసటి రోజునుంచీ అది ఉల్లంఘనకు గురవుతూనే ఉంది. ఎందుకంటే అప్పటికే ఆకాశం (భావజాలం) మారిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో 80లలోనే విద్యా వ్యాపారం ఒక స్థాయిలో పెరగడం ప్రారంభమైంది. ధార్మిక సంస్థలు పాఠశాలలను స్థాపించడం పలుచబడింది. లాభార్జన లక్ష్యంతో పాఠశాలలు స్థాపన ప్రారంభమైంది. క్రొత్తగా పాఠశాల పెట్టడానికి పాత కారణం స్థానంలో క్రొత్త కారణం వచ్చింది. విద్య అందని వారికొరకు కాకుండా విద్య కొనుగోలు చేయగలిగే వారి కొరకు పాఠశాలల స్థాపన ప్రారంభమయ్యింది. తామర తంపరగా ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకు వచ్చాయి. ''ఆవశ్యకత'' నిబంధన ఉల్లంఘించబడుతూ వచ్చింది. ఇప్పుడు, ప్రతిపాదిత క్రొత్త చట్టం ద్వారా సదరు ఉల్లంఘన వ్యవస్థీకృతం కానున్నది. ప్రతిపాదిత "సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంట్ పాఠశాలల చట్టం" నియమావళి 3(2)(ఎ) లో ఆవశ్యకత నిబంధన స్థానంలో "విద్యార్థులు చేరే అవకాశం నిబంధన" వచ్చిచేరింది. ఫీజులు కట్టగలిగే వాళ్ళున్నదగ్గరే 'అవకాశం' ఉంటుంది. మార్కెట్ ఉన్నదగ్గరే ప్రయివేట్ వాళ్ళు పాఠశాలలు పెడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే 1982 చట్టంలో "సామాజిక అవసరం" కీలకమైతే 2017 ముసాయిదాలో 'మార్కెట్ అవకాశం' ప్రధానం!

ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాక దేశంలో అనేక రాష్ట్రాలలో విద్య వ్యాపారమయమైన మాట నిజమే. కాని ఇంతవరకు విద్యారంగంలో వ్యాపారం చేయవచ్చు అని కేంద్ర ప్రభుత్వం చట్టం చేయలేదు. అటువంటి చట్టాన్ని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయలేదు. టి.యమ్.ఏ.పాయ్ కేసు (1993) లో సుప్రీం కోర్టు - విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేయడానికి యాజమాన్యాలకు అనుమతిస్తూ - ఇచ్చిన తీర్పు ఎడల తీవ్రమైన విమర్శలు వచ్చిన విషయమం తెలిసిందే. అయితే, పెద్ద ఎత్తున విమర్శలకు గురైన ఈ తీర్పులో కూడా సుప్రీం కోర్టు విద్యారంగంలో వ్యాపారాన్ని అనుమతించలేదు. విద్యార్థుల దగ్గర నుండి వసూలు చేసే ఫీజులను ఆ విద్యా సంస్థ అభివృద్ధికే ఖర్చుచేయాలని నిర్దేశించింది. ఇది మధ్యంతర న్యాయం. ఇంకా చెప్పాలంటే మధ్య తరగతి న్యాయం. టి.యమ్.ఎ. తీర్పు ప్రకారం ప్రైవేట్ యాజమాన్యం విద్యార్థుల వద్ద ఫీజు వసూలు చేసుకోవచ్చు. అంటే ఫీజు కట్టలేని వారికి ఇందులో చదువుకునే అవకాశం ఉండదు. అందుకే దీనిని మధ్యతరగతి న్యాయం అంటున్నారు. విద్యావకాశం ఆర్థిక స్తోమతతో ముడిపడి ఉంటుంది. విద్యను సామాజిక బాధ్యతగా గుర్తించిన భారత రాజ్యాంగ విలువలకు ఇది విరుద్ధం. పేదలు దళితులు ఈ వ్యవస్థకు బయట ఉంటారు. టి.యం.ఎ. పాయ్ తీర్పు విషయాన్ని అలా ఉంచితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994 లో విడుదల చేసిన నిబంధనలు కూడా సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగానే ఉన్నాయి. అవి అమలు జరగక పోవడం, అందుగల కారణాలు వేరేవిషయం. నిబంధన 18(4) లో "విద్యార్థుల నుండి వసూలు చేసే ఫీజులలో 50 శాతం ఉపాధ్యాయుల జీతాలకు, 15 శాతం వారి పదవీ విరమణ ప్రయోజనాలకు, 15 శాతం పాఠశాల నిర్వహణకు, 15 శాతం పాఠశాల అభివృద్ధికి చెల్లించి లేదా ఖర్చుచేసి యాజమాన్యం 5 శాతం తీసుకోవచ్చని ఉంది. సదరు జీ.ఒ 1 ఆఫ్ 1994 లో

నిర్దేశించిన ప్రైవేట్ పాఠశాల యొక్క ఆదాయ వ్యయ విధానం పేదవారి ప్రయోజనాలకు చోటులేనిది అయినా, లాభ నష్టాలు లేని పద్దతి అని మాత్రం మనం అంగీకరించాలి. అయితే అదే జీ.ఒ ప్రకారం ఆదాయ వ్యయ నిబంధనలను అమలు చేయవలసిన గవర్నింగ్ బాడీ (పాలనా సంస్థ)లో బాలల సంరక్షకులకు తగిన ప్రాతినిధ్యం లేకుండా చేయడం వలన ఈ నిబంధన ఎప్పుడూ అమలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా చట్టంలో పైన సూచించిన నిబంధనను అమలు చేయడానికి అవసరమైన పటిష్టమైన వ్యవస్థను రూపొందించడానికి బదులు పై నిబంధననే ఎత్తివేయబడింది. ప్రస్తుత ముసాయిదా చట్టం సారభూతంగా చెప్పాలంటే ప్రైవేట్ పాఠశాల యొక్క ఆదాయ వ్యయాలపై ఎటువంటి నిబంధన విధించలేదు. నిబంధన పెట్టి అమలు చేయకపోవడం అవినీతి, నిబంధననే ఎత్తివేయడం కార్పోరేటురీతి. దీనికే ముద్దుపేరు సరళీకరణ. ఈ ముసాయిదా చట్టంలో పాఠశాల నిర్వహణలో యాజమాన్యం లాభం చేసుకోవచ్చని, ఆ లాభాన్ని అదే పాఠశాల అభివృద్ధికి గాని, లేక ఆ పాఠశాల యాజమాన్యం వేరొక పాఠశాల స్థాపిస్తే అందుకొరకు గాని ఖర్చుచేయవచ్చని విభాగం (12 -1)లో పేర్కొన్నారు. అంటే విద్యార్థుల ఫీజులతో తమ వ్యాపారాలు విస్తరించుకోవచ్చన్న మాట. ఈ న్యాయం మధ్యతరగతి పరిధులను కూడా దాటింది.

ప్రైవేటు పాఠశాలలు ప్రతి సంవత్సరం ఎవరి అనుమతి లేకుండా 12 శాతం ఫీజులు పెంచుకోవచ్చని, అయితే అంతకంటే ఎక్కువగా పెంచాలంటే జోనల్ రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవాలని, రెగ్యులేటరీ కమిటీ అంగీకరించకపోతే రివిజన్ కమిటీ వద్దకు వెళ్ళవచ్చని ముసాయిదా చట్టం పేర్కొంది. మరొక విషయం గత రెండు మూడు వారాలలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ పాఠశాలలు బట్టలు, బూట్లు, బ్యాగులు, పుస్తకాలు పాఠశాలలలో అమ్మకూడదని, తమవద్దే కొనుగోలు చేయాలని విద్యార్థులను నిర్బంధించకూడదని హెచ్చరించడం వార్తాపత్రికలలో మనం చూస్తున్నాం. అయితే ప్రస్తుత ముసాయిదా చట్టం పాఠశాల యాజమాన్యాలు వారు విద్యార్థులకు ఇచ్చే పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు మరయు ఇతర వస్తు సేవలకు రుసుము వసూలు చేయవచ్చని స్పష్టంగా పేర్కొంది. అంటే పాఠశాలను మార్కెట్‌గా నిర్వహించకూడదనే నిబంధనలే రద్దవుతున్నాయి.

1982 నాటి ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టంలో మరియు 1994 నాటి నిబంధనావళిలో ప్రతి పాఠశాలకు ఆట స్థలం ఉండాలని నిబంధనలు ఉన్నాయి. అయితే, ఈ నిబంధనలు అమలు జరగక పోవడమేగాక 2009లో నీరు కార్చబడినాయి. 2009 లో 'ఆట స్థలం పాఠశాలకు ఆనుకునే ఉండనవసరం లేదని, పాఠశాలకు కొంత దూరంగా కూడా ఉండవచ్చని, కొంత దూరంలో ఉన్న మున్సిపల్ పార్కును కూడా ఆట స్థలంగా చూపించవచ్చని, అది కూడా సాధ్యం కాక పోతే పాఠశాలలలోనే ఒక హాలును ఇండోర్ గేమ్స్‌కు ప్రధానంగా యోగాకు కేటాయిస్తే సరిపోతుందని' 1994 నాటి నిబంధనావళికి సవరణలు చేసారు. ప్రస్తుత ముసాయిదా చట్టంలో ఆట స్థలం అన్నమాటే లేదు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సౌకర్యాలుండాలని మాత్రమే నిబంధన పెట్టారు. ఈ ముసాయిదా చట్టం "సరళీకరణ" అంచులు చూసింది.

ఈ ముసాయిదా అత్యధిక విషయాలలో ప్రైవేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉంది. ప్రధానంగా ముసాయిదా చట్టంలో 16వ సెక్షనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సంరక్షకులు కోర్టులకు వెళ్ళకుండా నిబంధనలు విధించారు. ఫీజుల విషయంలో బాలలు లేదా సంరక్షకులు జోనల్ ఫీ రెగ్యులేటరీ కమిటీ నిర్ణయాలపై గాని, రివిజన్ కమిటీ నిర్ణయాలపై గాని సివిల్ కోర్టులకు వెళ్ళకూడదని ఈ సెక్షన్‌లో నిబంధన పెట్టారు. 2010 నుండీ కేంద్రం కోర్టులను ప్రక్కన పెట్టే ప్రయత్నం చేస్తూన్నా వివిధ విభాగాల నుండి వస్తూన్న వ్యతిరేకత వలన ఇంత వరకూ అది సాధ్యం కాలేదు. అదలా ఉండగా, విద్యార్థులను ఎంపికచేసుకునే విధానాన్ని ఉపాధ్యాయులను నియమించుకునే విధానాన్ని విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళిని రూపొందించుకోవడం పూర్తిగా యాజమాన్యాల హక్కుగా ఈ ముసాయిదా గుర్తించింది. ఉపాధ్యాయుల జీతనాతాల విషయంలో ఎటువంటి నిబంధనలు లేవు. విద్యార్థుల ఫీజులు పాఠశాల ఖర్చుపై ఆధారపడి ఉంటాయని పేర్కొనడం జరిగింది గాని పాఠశాల ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెంచి చూపించే అవకాశం నిబంధనలలో ఉంది. ఈ ముసాయిదా సుమారు ప్రతి విషయంలో కూడా ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి అనుకూలంగా తయారు చేయబడింది. కొస మెరుపు ఏమంటే ఈ ముసాయిదాను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారిని సంప్రదించి తయారు చేసినట్లు ప్రభుత్వ అధికార వలగూడులో ప్రకటన ఉంది. ప్రభుత్వం ఫిక్కి తయారుచేసిన ఈ ముసాయిదాను ఉపసంహరించి, విద్యావేత్తలతో ఒక సంఘం నియమించి ప్రభుత్వం పాఠశాలలను ఏవిధంగా అభివృద్ధిచేయాలి, ప్రైవేట్ పాఠశాలలను ఏవిధంగా నియంత్రించాలి అనే సమస్యలపై నివేదిక ఇవ్వమని కోరడం సరియైన పద్ధతి కావచ్చు.

కవిత

## అన్నీ ఆయుధాలే

-డా.కె.జి.వేణు
9848070084

ఈ మధ్య ఇంటిచుట్టూ తుపాకులు
మళ్ళీ మళ్ళీ వస్తున్నారు సోదాలకోసం
గుట్టుగా విచారణ అంతా అర్ధరాత్రే
కన్నవారి ప్రేమ కంగారుతో వణికి పోయింది
బాల్యం మాత్రం ధీమాగా ధైర్యంగానే వుంది
సమాచారం అందిందంటూ లాఠీలు వూగాయి
ఇళ్ళంతా భూతద్దాలతో గాలిని సైతం గాలించారు
ఉన్నట్టుండి కెవ్వున కేక... దుప్పటి లాగి చూశారు
దొరికింది... అన్నీ ఆయుధాలే... అంటున్నారు
ఆశ్చర్యంగా పెట్టె తెరిస్తే నిండా పుస్తకాలే
ప్రభుత్వం పట్టుబట్టి నిలువునా నిషేధించిన
అచ్చతెలుగు వాచకాలు...
స్పృహతప్పిన తెలుగుతల్లి అవయవాలు...

# నాగోడు వినిపించుకోరూ ... అనామక తెలుగు పిల్లకాయ



**నువ్వు పెద్దయితే ఏమవుతావు?**
నన్ను చాలామంది అడిగే ప్రశ్న!
డాక్టరో, ఇంజనీరో, కలక్టరో అని చెబితే మురిసిపోదామని.

**నేను జీవించాలి**
కానీ నాకు గట్టిగా చెప్పాలనిపిస్తుంది. యేమిటంటే 'నేను జీవించాలి' అని. బ్రతకటం కాదు. ఎలాగోలా బ్రతకటం కాదు. చెప్పింది చేసుకుపోయే యాంత్రికంగా బ్రతకడం దండగ. నా బుర్ర పెట్టే పనిలేకపోతే నేను ఉన్నా లేనట్టే.

**జీవించాలి**
ఉత్సాహంగా నేనంటూ ఉన్నానని అందరికీ తెలిసేలా జీవించాలి. చుట్టపక్కాలను మురిపిస్తూ వాళ్ళ మురిపాలకు మురిసిపోతూ జీవించాలి. కొత్తదారిలో నడిచేందుకు పరుగు పెట్టాలి.
మీకు కోపం వచ్చినా సరే అంటున్నా..జీవించడమంటే మీలో చాలామందికి తెల్వకపోవచ్చు.

**జీవించడం నా బడిచదువుల్లోనే మొదలవ్వాలి**

- చదువంటే ఇష్టంగా వుండాలి
- రోజంతా తనివితీరా ఆటలాడాలి
- బోలెడంతమంది నేస్తగాళ్ళు వుండాలి
- బడి కబుర్లు ఇంట్లోవాళ్ళకి చెప్పాలి
- పంతులమ్మలు కొట్టకూడదు, తిట్టకూడదు కూడా.
- మంచి మంచి కథలు చెప్పాలి

**బడి చదువుల్లో ...**
నాకు చెప్పే ప్రతిదీ నాకు అర్థం కావాలె.
మరి అర్థం కాకపోతే ఎలా నేర్చుకోవాలె?
తెలవకపోతే ప్రశ్నలు అడగాలా వద్దా?

**బడి చదువుల్లో...**
మరి ఇంగ్లీషులో చెప్తారంట ఏంటి?
మాకు తెల్సినవి కూడా ఇంగ్లీషులో చెప్పి
తెలియకుండా చేయడమేమిటి?
ఇద్దురంగ లేదూ?
అప్పుడింక ప్రశ్నలా నా మొహమా?
నోరు మూసుకుని గుడ్లప్పచెప్పి కూచోటమేగా?

**మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు**
ఇప్పటికే ఇబ్బడి ముబ్బడి కారణాలున్నాయి
మేము బడి చదువులు మద్దెలో మానేయడానికి
అవి చాలదన్నట్లు ఈ ఇంగ్లీషు మహమ్మారిని మా మీదకు తోలారా?

**అందరికి మంచి బడి చదువులు**
అంటున్నారు కదా! అందరికి కావాల్సిన చదువులంటే?
- ఐటీ వుద్యోగాల కోసం చదువులా?
- అమెరికా వెళ్లేందుకు చదువులా?
- డాకటేరు అయ్యేందుకు చదువులా?
- ఇంజినీరు అయ్యేందుకు చదువులా?

**ఐటి, అమెరికా, డాకటేరు, ఇంజినీరు**
జనం పోగా సానా సానా మంది మిగిలిపోతారు కదా?
మరి వాళ్ళ సంగతేంటి?

**ఆ బహుకొద్దిమంది చదువులకోసం**
మా అందరి చదువులు చట్టుబండలు చేయడం ఎక్కడి న్యాయం?
ఆ బహుకొద్దిమంది అయినా బాగున్నారా?
ఇంగ్లీషు బాగా రావాలన్నా తెలుగు బాస మీద పట్టుండాలంటున్నారు కదా?
ఆ ఐటీ చదువులు యెంత బాగున్నాయో?

**అందరిదీ ఒకే మాట**
జాతిపిత గాంధి తాత చెప్పారట.
విశ్వకవి రవీంద్రుడు చెప్పి శాంతినికేతన్ నడిపినారు కదా?
'ఇంటిభాషలోనే పిల్లల చదువులు మొదలవ్వాలని'
పెద్ద పెద్ద విద్యావేత్తలు అదే చెప్పారంట
కొత్త విద్యా చట్టం అదే చెప్పిందంట

**ఉనెస్కో అదే చెప్పింది**
మాపంతులమ్మ ఓ వివరం చెప్పారు
ప్రపంచ దేశాల పిల్లల బాగోగులు పట్టించుకునే ఉనెస్కో
ఎన్నో దేశాలలో7 లచ్చల పిల్లకాయలను చూసి నిగ్గుతేల్చిన విసయం
పిల్లల చదువులు ఇంటి భాషలోనే మొదలవ్వాలని

**అమెరికాను మించిన ఇంగ్లీషు మోజు**
అమెరికాలోకూడా వేరే దేశాలనుండి వచ్చిన పిల్లలకు వాళ్ళ బాసలో మొదలుపెట్టి తర్వాతే ఇంగ్లీషులో చెబుతారంట
మరి మనమేంటి? అంతా తిరకాసుగా వుంది
జనం బాసను కాదని పరాయి బాసలో చదువులు మొదలంటారు

**అమ్మానాన్నలు అమాయకత్వంతో**
ఇంగ్లీషు మాయలో పడిపోయారు
ఈ చదువులు మమ్మల్ని మందమతులుగా చేస్తవని తెలియదు
మద్దెలో మానేయడం దాదాపు ఖాయమని తెలియదు
వల్లె వేసే చదువులన్న సంగతి తెల్వదు

**ఏమైనా చెయ్యరూ!**
నాగోడు విన్నారు కదా?
మీకు అర్థమైతే మీ నేస్తాలతో పంచుకోండి
మమ్మల్ని ఈ ఇంగ్లీషు మీడియం విపత్తు నుండి కాపాడండి.

– డా॥ఎస్.ఆర్.పరిమి

# బతుకు బడి

–కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్
9848428978



"గిర్రున తిరుగుతూ భవిష్యత్, వర్తమాన, భూత కాలాలను కళ్లెదుట చూపించేది ప్రయాణం కదూ" అని తన కొచ్చిన ఊహకు తనలో తాను చిరునవ్వు నవ్వుకున్నాడు వెంకటేశం.. కాలుష్య కాసారంలా దుమ్ము రేపుకుంటూ దూసుకెళుతున్న ఆర్టీసి పల్లె వెలుగు బస్సులో తాను పనిచేసే గ్రామానికి వెళుతూ, ఒక కిటీకీ వైపు కూర్చుని ప్రయాణం చేస్తున్నాడు వెంకటేశం. కిటికీ లోంచి బయటి అందాలను ఏరోజుకారోజు కొత్తగా చూసి స్ఫూర్తి పొందడం వెంకటేశంకి అలవాటు.

కొద్దిగా పొట్టిగా, చామనచాయగా ఉండి నెలవంకనే చిరునవ్వుగా ధరించి, నేరేడు కనులతో, నెలరేడు కళతో నిండిన తేజస్సు వెంకటేశం సొంతం. అంగవైకల్యంతో పుట్టిన వెంకటేశంకి, అవిటితనం తన ఎదుగుదలకి ఆటంకం కాదని నమ్మిక.. ఆ దృఢ వ్యక్తిత్వమే అతనికంటూ ఓ గుర్తింపును తెచ్చింది. అడవిలోని మారుమూల తాండాలో పుట్టి, అనుకోకుండా జరిగిన పరిణామాల్లో పట్టణానికి వలస వచ్చి ప్రభుత్వ బడిలో చదువుకుని ప్రభుత్వ టీచర్‌గా మనుగడ సాగిస్తున్న వెంకటేశంకి కొన్ని అభ్యుదయ భావాలున్నాయి.. ఎవరి ఉప్పు తిన్నామో వారికి తగిన న్యాయం చేయాలి అనేది చిన్ననాటి నుంచి తనతో పాటు పెంచుకున్న సిద్ధాంతం.. తాండలో గుడుంబాకు బానిసై భర్త చనిపోవడంతో ఊహ కూడా తెలియని వయసున్న కొడుకు, కూతుర్ని తీసుకుని వలస వచ్చి, ఇళ్లల్లో పాచి పనులు చేసి పిల్లలను పెంచి పెద్ద చేసింది వెంకటేశం తల్లి రుక్మింబాయి. చదివితే భవిష్యత్తు ఉంటుందని, తాను పాచిపనులు చేసే ఇళ్ళలోని పిల్లలని చూసి, తన పిల్లలూ చదువుకోవాలని పట్టు బట్టి, తాను తినీ, తినక వారిద్దరినీ చదివించింది. అందుకే తల్లి రుణం తీర్చుకోలేనంటుంటాడు అతని స్నేహితులతో వెంకటేశం.. ప్రభుత్వం స్కాలర్ షిప్‌లతో చదివించింది గనుక, ప్రభుత్వ కొలువు చేస్తున్నాం కనుక, నిజాయితీగా ప్రభుత్వ ఋణం తీర్చుకోవడం తన కనీస బాధ్యత అని వెంకటేశం నిశ్చల అభిప్రాయం. తోటి టీచర్లలో కొందరు అతనితో విభేదించినా, తను నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడిన వ్యక్తిత్వం వెంకటేశంది.

సర్రున దూసుకెళ్తున్న బస్సులోంచి పైరగాలులు పంచిన పొలిమేరలు దాటి వెళ్తూ.. మరో ఊరు నడిబొడ్డు చిత్రాన్ని చూస్తున్న వెంకటేశం చూపులు అకస్మాత్తుగా అలజడి నొందాయి.. తాను చూసిన దృశ్యాన్ని మరలా చూడాలని, అప్పటికే దాటిపోయిన ఆ సంఘటన కోసం కిటికీలోంచి బయటకు తలపెట్టి మరీ చూసేందుకు ప్రయత్నించాడు.. తాను ఇంతకుముందు చూసింది నిజమా, భ్రమా అర్థం కాలేదు అతనికి. దారిలో కనబడి మాయమైన దృశ్యాన్ని కళ్ళు మూసుకుని గుర్తు చేసుకునేందుకు ప్రయత్నం మొదలెట్టాడు. అవును, అక్కడ తాను చూసింది కచ్చితంగా నాయక్‌నే.. వాడెందుకు అక్కడున్నాడు..? బజ్జీలమ్మే కొట్టులో పొట్లాలు కడుతూ కనిపించిన కుర్రవాడు నాయకేనా.. కాదా.? అలాంటి మరో కుర్రవాడా.. అనుమానం తొలుస్తోందతనికి.. నాయక్ అయితే, అసలు అక్కడెందు కున్నాడు అదే ప్రశ్న వెంకటేశంను వెంటాడటం మొదలెట్టింది...

"స్కూలు నుంచి తిరిగి ఊరు వెళ్ళేటపుడు నిర్ధారించుకోవాల్సిందే" అనుకున్నాడు వెంకటేశం.. నాయక్ గుర్తురాగానే తాను తొలిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలంలోని కుగ్రామం అమాన్‌పూర్ గుర్తొచ్చింది.. నల్లమల అడవి పరచుకున్న పచ్చని కుడ్యచిత్రం అతని కళ్లముందు కదిలింది.

-- --

ఎత్తైన చెట్లు.. విశాలంగా విస్తరించిన మహావృక్షాలు.. కోయిల కుహూరవాలు.. మధ్య నిత్య వసంతంలా తోచే కానలో, అతి కొద్ది మంది తండా వాసులున్న గ్రామం అమాన్‌పూర్. ఆ ప్రాంతంలో బడి పెట్టాలని, అవేర్ అనే స్వచ్ఛంద సంస్థ ఒక చిన్న గదిలో ప్రారంభించి ఆ తర్వాత పిల్లలను బడిబాట పట్టించలేక ప్రభుత్వానికి అప్పగించేసింది. తరువాత ఏళ్ల తరబడి పాడుబడ్డ ఆ బడిలో పిల్లలను చేర్చి.. తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా టీచర్‌గా కొలువు పొందిన వెంకటేశం మీద పడింది.

"ఎవ్వరూ వెళ్లడానికి ఇష్టపడని అమాన్‌పూర్‌లో నీకు పోస్టింగోయ్! మరి ఎలా నెట్టుకొస్తావో" అని డి.ఈ.వో అపాయింట్‌మెంట్ అనంతరం అన్నమాటలను గుర్తు చేసుకుంటూ అమాన్‌పూర్ బయలు దేరాడు వెంకటేశం...

కొత్తూరులో దిగి అక్కడ నుండి అమాన్‌పూర్‌కి నడచి వెళ్లాలి సుమారు నాలుగు కిలోమీటర్లు. కొత్తూరు చేరుకుని అక్కడ బస్సు దిగిన వెంకటేశం అడవమ్మ అందాలను చూస్తూ నడుస్తున్న శ్రమని మరచిపోతూ వెళ్తున్నాడు వెంకటేశం. చిన్నప్పుడెప్పుడో అమ్మ చెబుతుండగా విన్నాడే గానీ ఎప్పుడూ అడవిని చూసెరగని వెంకటేశం కొన్ని చోట్ల ఆకాశం అంటిన చెట్లను చూస్తూ. ఆ అడవితల్లి అందాలకు ముగ్ధుడైపోయాడు.. వెంకటేశం రాకకోసం అన్నట్లుగా కోయిలలు రాగాలు మొదలెట్టాయ్.. అవి కుహూ అంటూంటే వెంకటేశం గొంతు కలిపాడు.. సొంత గూటికి వచ్చిన పక్షిలా కొత్త అనుభూతికి లోనవుతూ అమాన్‌పూర్ చేరుకున్నాడు.. అక్కడక్కడా ఉన్న ఇగ్లూలను తలపించే పూరి గుడిసెలను చూస్తూ ముందుకు నడు స్తున్నాడు. అప్పటికే నేలను ముద్దా డాలనేమో సూర్యకిరణాలు చెట్ల కొమ్మలను, ఆకులను చీల్చుకొస్తున్నాయా అన్నట్లు దూసుకొస్తు న్నాయ్..

అంతలో చెట్ల చాటు నుంచి విసురుగా వచ్చిన చిన్న పిల్లాడు, నడుస్తూ వస్తున్న వెంకటేశాన్ని నెట్టి మరీ, పరుగు లంఘించుకున్నాడు.. అసలే కుంటు కుంటూ.... కుంటూకుంటూ.... నడుస్తున్న వెంకటేశం ఒక్కసారిగా జరిగిన పరిణామానికి నివ్వెరపోయి, నిలదొక్కుకోలేక తొట్రుపాటుపడి క్రింద పడిపోయాడు.. ఎర్రమట్టి, గులక రాళ్ళు మాత్రమే ఉన్న ఆ కాలిబాటలో క్రిందపడిన వెంకటేశంకి చిన్నచిన్న గాయాలయ్యాయి. అంతలో అటుగా పిల్లలకు బాలామృతం (పిల్లలకి పెట్టే పౌష్టికాహారం) పెట్టేందుకు వస్తున్న అంగన్ వాడీ ఆయా నాగాయిమోతి వెంకటేశ్ క్రింద పడిపోవడం చూసింది. చేతిలోని బాలామృతం తెస్తున్న గిన్నెను అక్కడే వదిలి,

"సామీ ఎవురు నువ్వా ఇట్ట పడ్డవేందీ" అను కుంటూ పరిగెత్తుకొచ్చి లేపింది..

చదువుకున్న వాడిలా కనిపిస్తున్న వెంకటేశంని చూస్తూ, కాళ్ళు సరిగా లేవని గుర్తించిన ఆయా, "అజ్జొజ్జొజ్జొ...ఏందయ్యా కుంటి పిల్లగాడని సూడకుండా నూకినారా ఎదవలూ, "ఆల్లంతే నువ్ లోనెట్టుకోమాకా, పిండి తెస్తున్నా..జూసి ఏటయ్యిందని లగెట్టుంటారయ్యా....

"అయ్యోరూ అందరం తాండా వదిలొచ్చేసినం. పోడు చేయ్యొద్దని సర్కారీ జెప్పినంక అందరం వచ్చేసినం. మా అయ్యా.. అమ్మా గుడా..! తాండాలో గందరూ ఏడేడ్నో బోయారు.. మేమంతా ఈ ఊర్ల తలోపని జేసు కుంటున్నం..."

"మరిక్కడైనా చదువు కొనసాగిచ్చువచ్చు కదా..?" ప్రాధేయ పడుతున్నట్లు అన్నాడు వెంకటేశం..

"అయ్యోరూ మీకో నిజం జెప్పమందువా. మనూర్లో బడి తీసేసినారు.. చిన్న బళ్ళన్నీ గలిపి వేరే ఊర్ల బడికి పోవాలని సర్కారు జెప్పిందంటగదా..! అంతలో పోడు యవసాయం జెయ్యనీకుండా సార్లు అడ్డుకుంటుండార్.. ఇంకా ఆ ఊర్ల యావుంది గనుక మాకని ఈడకొచ్చినం అయ్యోరూ.. ఈడ గూడా మా అయ్య బడి జేర్చనీకి తీసుకుపోయిండు. ఈ సర్కారీ బడిలో గూడా అంతా ఇంగ్లీషు మీడియం పెట్టింగ్రు గందా.. అందుకే నేజదవని మా అయ్యకి జెప్పా"...

"అయ్యోరూ.. నిజ్జంగా నేను ఇంగ్లీషు మీడియంల జదవ లేనని..అర్థమైనంక.. చదూకోని పెద్ద సర్కారీ ఉజ్జోగం జేయాలన్న నా గోరికంతా జంపుకున్నా అయ్యోరూ.." అంటూ ఒక్క ఉదుటన వెంకటేశంని గట్టిగా వాటేసుకుని భోరున విలపించాడు.



[redacted]

కూసుందుగానీ..'' అంటూ పట్టుకుని నడిపించి, పక్కనే భూమ్యానాయక్ ఇంటి దగ్గర మంచం వాల్చి కూర్చోబెట్టింది.. పలకరాళ్లతో కట్టిన ప్రహరి , మొత్తం పేడ కల్లాపి జల్లిన ఆ కాంపౌండ్ చుట్టు కళ్ళు తిప్పాడు, గ్రామంలో ఉన్న దానిలో అదే కాస్త పెద్ద ఇల్లులా తోచింది... గోడలా మారి వృథాపోతూ మట్టి గొట్టుకు పోతూన్న రాతి పలకను చూసి వెంకటేశంలోని టీచర్ మనసు చివుక్కుమంది .. జరిగిన విషయం కన్నా, తనకు గ్రామంలో పిల్లల వివరాలు ఇచ్చే పెన్నిధి నాగాయమోతీ రూపంలో దొరికిందనుకున్న వెంకటేశం ఆమెని పలు ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేశాడు..

ఆమె చెప్పిన ప్రకారం అక్కడ నలభై గిరిజన కుటుంబాలున్నాయ్.. పిల్లలు మాత్రం ఇంటికి నలుగురు చొప్పున ఉన్నారని, వారిలో చదువుకున్న వారు ఒక్కరూ లేరని, అడవిలో కుందేళ్ళ వేటకి వెళ్లటం, కర్రపుల్లలు ఏరుకు రావటం.. బట్టలేకుండా దుమ్ములో ఆడటం మాత్రమే వారందరికీ తెలిసిన విద్యలని అర్ధమైంది వెంకటేశంకి.. తన ముందున్న లక్ష్యం ఎంత కష్టతరమైనదో తెలిసొచ్చిందతనికి.

వెంటనే బడెక్కడుందని ఆమెని ఆరా తీసాడు...

"ఏందయ్యా గొంపదీసి నువ్వుగాని అయ్యోరివా ఏందీ.."అంటూ బిత్తర చూపు లతో చూసిన ఆమె చూపుకి, "అవునంటూ" చిరునవ్వు నిండిన తలను ఊపుతూ సంజ్ఞ చేశాడు..

ఆమె కళ్లలో అనుకోని మెరుపు.. అనుమానం.. ఆశ్చర్యం.. అనందం కల గలిపిన చూపు దాచుకునే ప్రయత్నం చేస్తూ..

"అయ్యోరూ.. ఈ కోతినాయాళ్ళు జదూ కుంటారా.. నాకైతే అనుమానం జానా ఉండాది.. నువ్ జదివిస్తవా నిజ్జంగానే" అంటూ నడుంచుట్టు కొంగు చుట్టుకుంటూ చంగుచంగున నడుస్తూ బడి చూపేందుకు సమాయత్తమైన ఆమె వెనుక నెమ్మదిగా నడిచాడు వెంకటేశం. ఓ పది గుడిసెలు దాటిన తర్వాత ఆగి..

"ఇదిగో అయ్యోరూ ఇదే నువ్వడిగిన బడి.." అని చుట్టూ ముళ్లకంపతో నిండి పోయి మధ్యలో ఎక్కడో ఉన్న ఓ గదిని చూపించింది. తన పని అంత సులభం కాదని గ్రహించిన వెంకటేశం ఆమెని పిలిచి తాను తెచ్చిన చాక్లెట్లు, బిస్కెట్లను బ్యాగు లోంచి తీసి ఆమె చేతిలో పెట్టి పిల్లలను పిలవమని చెప్పాడు.. ఏం జరుగుతుందో అర్ధమైన ఆమె,

" ఓరే.. చుక్కడు.. సిన్నోడు..నాయకా, కందిరీ.. నల్లి, తామరా, చిట్టీ , కవల, పుడిగా, ఏడున్నార్రో.." అని కేకపెట్టింది..

అంతే అప్పడిదాకా చాటుగా వీళ్ళనే అనుసరించిన ఓ నలుగురితోపాటు, మరో పది మంది పిల్లలు... చల్లిన బియ్యం కోసం వచ్చిన పిచ్చుకల్లా వాలిపోయారు.. ఒంటి మీద గోచీలు తప్ప ఒక్కడికి కూడా ఏమీ లేవు.. చిన్న పిల్లలకి అవి కూడా లేవు... ఆడ పిల్లలు మాత్రం చీరెలు చించి చుట్టిన వేషంతో అక్కడ ప్రత్యక్షమయ్యారు..

వారినలా చూడగానే ఉసూరనిపించింది వెంకటేశంకి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 69 ఏళ్లు .... ప్చ్ అని నిందించుకున్నాడు.

"ఇదిగో ఇయన మనూరుకొచ్చిన పెద్ద మడిసి.. అందరూ దణ్ణమెట్టండి" అని గట్టిగా ఆదేసించినట్లు చెప్పింది నాగాయమోతి. అందరూ తలలూపారు.. విచిత్రంగా అరుస్తూ అందరూ ఒక్కసారిగా నేలమీద పడుకుని లేచారు..

"ఇంద ఈ సామి ఈడుంటాడు.. అందుకని మనమంతా ఈ గది తుడవాలె, చెట్లు కొట్టాలే.." అని చెప్పింది.

అందరికీ లోపల్లోపలేదో అనుమానం తొలుస్తోంది.. వెంకటేశంని అనుమానంగా ఎగాదిగా చూస్తూ పనిలోకి దిగిపోయారు. ఏదో జరగబోతోందని వారికి సంశయం పెరుగుతోంది.. అందరూ వెంకటేశం తెచ్చిన బిస్కెట్లు, చాక్లెట్లు తింటూ మధ్య మధ్యలో అతని వంక అనుమానంగా చూస్తూ.. గంటలోపలే ఆ గదికి కంపచెట్ల కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించారు.. అందరికీ తనతో తెచ్చిన డ్రింక్స్ ఇచ్చాడు.. అంతలో కూలిపనుల కెళ్ళి తిరిగి అక్కడికి చేరుకున్న పెద్దలు ఏం జరుగుతోందని ఆరా తీశారు... వెంకటేశంని ఓ గంట ప్రశ్నలతో పీల్చేశారు.. గ్రామస్తులకి, వెంకటేశంకి మధ్య నాగాయిమోతి వారధిగా నిలిచి అతని పని సులువు చేసింది. చివరకు అమాన్‌పూర్‌లో బడి మొదలయ్యేందుకు మార్గం సుగమమైంది.

అంతలో ఒక పిల్లోడు వెంకటేశంకి దగ్గరగా వచ్చి.. "సదూ జెప్తవా నాకు.. బాగా సదూకుంటా" అని అన్నాడు..

కన్నులు చెమ్మగిల్లుతుండగా ఆ పిల్లోడిని దగ్గరకు తీసుకున్నాడు వెంకటేశం.

"నా కొడుకే దొరా... ఆ ఇసుకలో, చెట్ల మీద ఏదోటి రాత్తుంటడు.. గదేందో మాకు తెలవ దాయె.. పిచ్చోడు బొమ్మలేయో ఏత్తడు దొరో మా నాయకు" అంటూ మురిసిపోతూ చెప్పాడు పిల్లోడి తండ్రి, గ్రామపెద్ద భూమ్యా నాయక్. నాయక్‌ని చూశాక ఇక్కడి పిల్లలను చదివించి ప్రయోజకులని చేయవచ్చని నమ్మక మొచ్చింది వెంకటేశంకి.

"అందరినీ పంపాలె బడికి అని సర్కారు గట్టిగా చెప్పింది.. పనికి పంపడం నేరం.. జైల్లో పెడతారు" అంటూ కాసేపు పెద్దోళ్లకి నచ్చజెప్పాడు... దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పెరుగన్నంతో నేర్చుకున్న వెంకటేశం. ఊరిపెద్ద భూమ్యా నాయక్ చేత జ్యోతి వెలిగించి, రిబ్బన్ కట్ చేయించి బడి ప్రారంభించాడు వెంకటేశం..

నాగాయమోతిని, ఇళ్ళదగ్గరుండే పెద్దోళ్లనీ చదువుకోవడానికి బడికి రమ్మని పిలిచాడు. ప్రార్ధనతో ప్రారంభమైన కాసేపటికే తెచ్చిన స్వీట్లు తిన్న పిల్లలు పరిగెత్తి పారిపోయారు.. మరలా అందరినీ పట్టుకు రావడం కోసం నానా అగచాట్లూ పడాల్సి వచ్చింది వెంకటే శంకి.. ఎట్టకేలకు ఆరు నెలలు కష్టపడితే గానీ బడి ఒక కొలిక్కి రాలేదు.. ప్రభుత్వం నిధులు ఇచ్చేంతవరకూ ఆగితే కుదరదని, తన జీతంలో డబ్బు వెచ్చించి పిల్లలకు చక్కని యూనిఫాం కూడా తెచ్చిచ్చాడు వెంకటేశం.. పట్నం నుంచి టైలర్‌ని పిలిపించి మరీ కుట్టించాడు.. ప్రైవేట్ స్కూల్స్‌కి ధీటుగా బెల్ట్, టై కూడా తెచ్చి పిల్లలకి రోజూ పెట్టుకొచ్చేలా అలవాటు చేశాడు.. తనతో పాటు పట్టణం నుంచి తెచ్చిన ఫ్లెక్సీతో ప్రాథమిక పాఠశాల, అమాన్‌పూర్ అని, స్కూల్ బోర్డ్ కూడా చేయించి పెట్టాడు వెంకటేశం...

నలభై మంది పిల్లలని మొదటి ఏడాదే బడిబాట పట్టించడంలో విజయం సాధిం చాడు వెంకటేశం...

విషయం తెలుసుకున్న డి.ఇ.వో.. వెంకటే శంని అభినందించి, మరో టీచర్‌ని కూడా వెంకటేశంకి మద్దతుగా పంపించాడు..ఆ

సంవత్సరం బెస్ట్ ఫ్రెష్ టీచర్ అవార్డుకి కూడా వెంకటేశం పేరుని డీ.ఇ.వో. రికమెండ్ చేశాడు. కొద్ది రోజులకి విద్యార్థులలో చదువు మీద ధ్యాస పెరిగింది.. చదువువల్ల పిల్లలని ఎంత చక్కగా చూడొచ్చో పెద్దలకి తెలిసొచ్చింది..

నాయక్ అందరికీ ఆదర్శంగా నిలుస్తూ చదువుతున్నాడని చాలా సార్లు వెంకటేశం ద్వారా తెలుసుకున్న అతని తండ్రి భూమ్యా నాయక్ సంబరపడ్డాడు. ఇంటి దగ్గర పద్యాలు చదువుతూ తల్లిని కూర్చోబెట్టి, అ పద్యం వర్ణన  చెబుతుంటే, తండ్రిగా మురిసి పోయిన భూమ్యానాయక్, "మావోణ్ణి ఎన్ని కట్టాలొచ్చినా బాగా సదివిత్తా అయ్యోరూ.. ఈ దినం నీకు ఆనజేత్తున్నా..నిజ్జం దొరా సదివిత్తా అంతే." అంటూ గర్వంతో ఓ రోజు మీసం మెలేశాడు, పెద్దచిన్న తారతమ్యం లేకుండా అందరితో కూలీకి వెళ్ళే అమాన్ పూర్ తాండా పెద్ద భూమ్యానాయక్.

నాలుగేళ్ళు గడిచాయి. అప్పటికే ఆ చిన్న స్కూల్‌లో అమాన్‌పూర్ తాండా పిల్లలందరూ చేరి చదువుకుంటున్నారు.. చుట్టు పక్కల తాండా పిల్లలు కూడా నలుగురైదుగురు వచ్చి ఈ చిన్న బడిలో చదువు కుంటున్నారు. చక్కగా శ్రద్ధ పెట్టి చదివే నాయక్ అంటే వల్లమాలిన అభిమానం పెంచుకున్నాడు వెంకటేశం. రెండేళ్ళలో పదో తరగతికి వచ్చే నాయక్ ఖచ్చితంగా పది పాయింట్లు సాధించి ఐఐఐటి సీట్ సాధిస్తాడని వెంకటేశంకి గట్టి నమ్మకం. అంత బాగా చదివే నాయక్ కు ఇంగ్లీషంటే మింగుడు పడదు. ఇంగీషు చదవడం రాక మొదట్లో జ్వరం వచ్చి మంచం పట్టాడు నాయక్. ఆ దెబ్బతో పిల్లలందరు మానేస్తారేమో అన్న దిగులు కూడ పట్టుకున్న వెంకటేశం. నాయక్ ని అతని తల్లిదండ్రులని బ్రతిమాలి, బామాలి ఇంగ్లీష్ భయం లేకుండా చదివిస్తానని చెప్పి తిరిగి బడికి వచ్చేలా చేసాడు. చదువు మీద శ్రద్ధ తగ్గకుండా ఇంగ్లీషు కొంచెం కొంచెంగా నేర్పే ప్రయత్నం చేశాడు.. అయినా ఇంగ్లీషు పేరు చెబితేనే నాయక్ ఒణికి పోయే వాడు.. అన్నీ పాఠాలనూ  సులభంగా వల్లెవేసే నాయక్‌ను ఇంగ్లీషులో మాత్రం ముందుకు పరిగెత్తించ లేక పోయాడు వెంకటేశం. అయినా జాగ్రత్తలు చెప్పి ఇంగ్లీషు అవసరాన్ని తెలిపి, ఇంగ్లీషులో చమక్కులు, హాస్యం చెప్పి.. నాటికలు, నాటకాలు చెప్పి రకరకాలుగా మరీ నాయక్‌ను చదివించే ప్రయత్నం చేసేవాడు వెంకటేశం..

కాలానికి ఆడుకోవడం అలవాటేమో.. వెంకటేశంని అమాన్‌పూర్ స్కూల్ నుండి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులనుంచి ఆదేశా లందాయి.. రెండో టీచర్ మాణిక్యంకి విధులు అప్పగించి బయలు దేరాడు.... వెంకటేశం వెళ్ళిపోతున్నాడని తెలిసి అమాన్ పూర్ గ్రామం లోని ఒక్కరు కూడా కూలీకి పోకుండా గగ్గోలు పెట్టారు.. పిల్లలంతా భోరున ఏడవటం ఆరంభించారు.. వెంకటేశ్ అయ్యోరెళితే నేను దూకేస్తానంటూ ప్రియ శిష్యుడు నాయక్ చెట్టు చిటారు కొమ్మెక్కాడూ. చిన్నపిల్లలంతా వెంకటేశం కాళ్ళని చుట్టేసు కుని వెళ్ళొద్దంటూ వేడుకున్నారు.. ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా వేదనా భరితంగా మారిపోయింది.. తన్నుకొస్తున్న కన్నీటి వరదని పంటి బిగువున ఆపుకుంటూ అందరికీ నచ్చజెప్పిన వెంకటేశం త్వరలోనే తిరిగి వస్తానని, వారందరి వల్లే తనకి పదోన్నతి వచ్చిందని అబద్ధం చెప్పి నాయక్‌ను బాగా చదవాలని చెప్పి, బదిలీ అయిన  మరో నగర పంచాయితీ హైస్కూల్‌కి వెళ్ళాడు.. అంతే ఆ తర్వాత అప్పుడప్పుడూ ఫోన్లలో మాట్లాడినా  తన పనుల్లో కొత్త స్కూల్ వాతావరణం, అక్కడి విద్యార్థుల వికాసంపై దృష్టి పెట్టిన వెంకటేశం అమాన్ పూర్‌ను తాత్కాలికంగా మర్చిపోయాడు.. ఆ వూరు, తన ఉద్యోగం తొలి అడుగులు అన్నీ జ్ఞాపకాలను అప్పుడప్పుడు అందంగా గుర్తు చేసుకుంటూ ఉంటాడు అంతే..!

అంతలో వెంకటేశం ప్రయాణం చేస్తున్న బస్ కిర్రుమని ఆగింది.. లేడీ కండక్టర్... సార్ కనిగిరి వచ్చింది సర్.. అని పెద్దగా కేక వేయడంతో వర్తమానంలోకి వచ్చిన వెంకటేశం బస్సు దిగి, కుంటు కుంటూ హైస్కూల్ వైపు అన్యమస్తకంగా అడుగు లేశాడు. మనసంతా గందరగోళంగా ఉంది.

"అరే ఏమైంది.. అసలలా  ఎందుకు జరిగింది..? నిజమా .. అబద్ధమా.. ? ఎన్ని కష్టాలొచ్చినా చదివిస్తానన్నాడు కదా భూమ్యా నాయక్ .., మరి కొడుకుని అలా ఎందుకు పనిలో పెట్టాడు..? వెంకటేశం  మనసు మనసులో లేదు..

నాయక్ ఎస్.ఎస్.సి పాస్ అయితే తాండాలలోని గిరిజన విద్యార్థులకి  ఎంతో ఆదర్శంగా నిలుస్తాడని ఆశించాడు వెంకటేశం. కానీ ఇలా ఎందుకు జరిగిందో అర్థం కాలేదతనికి.. అమాన్‌పూర్‌లో పనిచేస్తున్న మాణిక్యంతో మాట్లాడే ప్రయత్నం చేశాడు.. ఫోన్ అవుటాఫ్ కవరేజ్ ఏరియా..! అసహనం పెరిగిపోయింది వెంకటేశంకి. ఒళ్లంతా చల్లబడినట్లు అనిపిస్తోంది. వెంటనే ప్రిన్సి పాల్‌ని కలిసి శెలవు అనుమతి తీసు కున్నాడు.. తిరిగి తాను నాయక్ లాంటి కుర్ర వాడిని చూసిన పొదిలి అనే ఊరు  బయలు దేరాడు.. ఆందోళన పెరుగుతుండగా గంట తర్వాత పొదిలి చేరుకుని బస్టాండ్ నుంచి ఆత్రంగా కుంటుకుంటూ... కుంటుకుంటూ తాను వెళ్ళాల్సిన ప్రదేశం వైపు అడుగు లేశాడు.. బజ్జీల కొట్లో ఉన్న నాయక్‌ని చూసి స్థాణువయ్యాడు వెంకటేశం .. వెంకటేశంని చూసి పారిపోదా మనుకుని, దాగుదా మనుకుని ప్రయత్నించి అప్పటికే తనని అయ్యోరు చూసేశాడని అర్థమైన నాయక్.

''అయ్యోరూ మీరేంది.. ఈడకొచ్చి నారు..." అని పలకరించాడు..

"అదేందిరా నాయక్... నువ్ కొట్లో పని చేయడం ఏమిటి..? ఎందుకలా..?" అని ఆశ్చర్యం, బాధ, కలగలసిన స్వరంతో అడుగుతుండగానే "ఎవఁ్రా ఉల్లి కోయమంటే ముచ్చట్లేంటి .. కష్టమర్లు పెరిగేటైంలో.." అంటు గట్టిగా కేకలేశాడు యజమాని..

"ఈ అయ్యోరు నాకు పాఠాల్జెప్పిండు.. నన్ను జూసి వచ్చిండు.. ఇప్పుడే వస్తా దొరా.." అని బ్రతిమాలుతున్నట్లుగా మూతి పెట్టడంతో యజమాని 'సరే' అన్నట్లు తలూపి,

"తొందరగా రా.. ! నీకేదో లెక్కలు దెల్సని పెట్టుకున్నా.. నువ్వెళితే ఈడ ఎవ్వడికీ అచ్చరం రాదు ఆ" అంటూ పెద్దగా అరచి నట్లు చెప్పి... అతని పనిలో అతను నిమగ్నమై పోయాడు.

"సరే దొరా బేగి వస్తాలే" అని యజమాని విన్నాడో లేదో పట్టించుకోకుండా కుంటు కుంటూ వస్తున్న మాస్టారిని చేయి పట్టుకుని పక్కకు తెచ్చాడు..

"ఎట్టున్నారు అయ్యోరూ... మీజెప్పిన జదువుతోనే ఈడ పంజేస్తున్నా దెల్సా అయ్యోరూ.." పెద్దరికం కలగలిపిన భాషలో గొప్పగా చెప్పాడు..

నాయక్‌ని లాగిపెట్టి కొట్టాలనిపించింది

వెంకటేశంకి.... తమాయించుకుని,

"బడి ఎందుకు మానేశావ్ నాయక్" అని గద్గద స్వరంతో అడిగాడు.. అడుగుతుంటే వెంకటేశం కళ్ళు చెమ్మగిల్లడం చూశాడు నాయక్ ..

"అయ్యోరూ అందరం తాండా వదిలొచ్చేసినం. పోడు చేయ్యొద్దని సర్కారీ జెప్పినంక అందరం వచ్చేసినం.. మా అయ్యా.. అమ్మా గుడా..! తాండాలో గందరూ ఏడేడ్నో బోయారు.. మేమంతా ఈ ఊర్ల తలో పనిజేసుకుంటున్నం..."

"మరిక్కడైనా చదువు కొనసాగిచ్చవచ్చు కదా..?" ప్రాధేయ పడుతున్నట్లు అన్నాడు వెంకటేశం..

"అయ్యోరూ మీకో నిజం జెప్పమందువా. మనూర్లో బడి తీసేసినారు.. చిన్న బళ్ళన్నీ గలిపి వేరే ఊర్ల బడికి పోవాలని సర్కారు జెప్పిందంటగదా..! అంతలో పోడు యవసాయం జెయ్యనీకుండా సార్లు అడ్డుకుంటుండార్.. ఇంకా ఆ ఊర్ల యావుంది గనుక మాకని ఈడకొచ్చినం అయ్యోరూ.. ఈడ గూడా మా అయ్య బడి జేర్చనీకి తీసుకుపోయిండు. ఈ సర్కారీ బడిలో గూడా అంతా ఇంగ్లీషు మీడియం పెట్టింర్రు గందా.. అందుకే నేజదవని మా అయ్యకి జెప్పా"...

"అయ్యోరూ.. నిజ్జంగా నేను ఇంగ్లీషు మీడియంల జదవ లేనని..అర్థమైనంక.. చదూకోని పెద్ద సర్కారీ ఉజ్జోగం జేయాలన్న నా గోరికంతా జంపుకున్నా అయ్యోరూ.." అంటూ ఒక్క ఉదుటన వెంకటేశంని గట్టిగా వాటేసుకుని భోరున విలపించాడు. అంతవరకూ మామూలుగా ఉన్న నాయక్..! కుండపోతగా వర్షిస్తున్న నాయక్ కళ్ళను చూసి వెంకటేశంకీ కనుల ఆనకట్టలు తెగిపోతున్నా సంబాళించుకుంటున్నాడు.. " అవును అయ్యోరూ.. మా ఊర్లందరినీ జదివించేంత, పెద్ద జదువులు జదవాలని అనుకున్నా అయ్యోరూ, నీకు దెల్సుగందా నాకు ఇంగ్లీ సంటేనే బయమని.. మీ సలవతో ఏదో మొక్కుబడిగా ఇంగ్లీసు జదివినా.. మిగిలిన అన్నీ బాగొచ్చు ఆయ్యోరూ మీకు దెల్సుగా.. ఇంగ్లీసంటే జాలు నాకు బయమైతది అయ్యోరూ.. నేన్ జదవలేను అందుకే మా అయ్యని బామాలి బడికి ఎల్లనని తెగేసి జెప్పినా.."

"ఇంట్ల కాలీ ఎందుకని ఇగో సేట్ దగ్గర పొట్లాలు గట్టాలని జేరిన, అయ్యోరూ..పైసలు దండిగా ఇస్తడు.. ఇంగా తిండి గూడ కడుపు నిండా బెడ్తడు.. సానా మంచోడు అయ్యోరూ..కడుపు దెలిసిన మడిసి మీలాగా..!" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ..!

"అది కాదురా పిల్లలు పనిజేయడం తప్పురా.. చదువుకోవాలి.." ఏదో చెప్పాలని ప్రయత్నించాడు వెంకటేశం..

నాయక్‌కి ఈ విషయంలో ఒక ప్రభుత్వోద్యోగిగా తాను ఏ విధమైన సహాయం చేయలేని అశక్తుడనని వెంకటేశంకు అర్థమైంది. ప్రభుత్వం గుడ్డిగా జారీ చేసిన ఓ జీవోతో తాను పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైందని తెలిసొచ్చింది వెంకటేశంకి. ధారాపాతమవడానికి బద్దలయ్యే గుండె ఆదేశాల కోసం ఆగిన కన్నీటిని శిష్యుడు చూడకుండా అలాగే ఉంచి.. కుడి మోకాలు మీద కుడి చేయి ఆనించి, కుంటుకుంటూ..కుంటుకుంటూ వెనుదిరిగాడు వెంకటేశం. గుండె బద్దలయ్యింది.. ఒక చేత్తో పగిలిన కన్నీటి కావడి కుండలను తుడుచుకుంటూ చిన్న పిల్లాడిలా ముందుకు నడిచాడు.. వెంకటేశం ఎటెటో తన పయనం అన్నట్లు..!

అంతలో అక్కడికి చేరుకున్నారు బజ్జీల బండి సేటూ, నాయక్ తండ్రి భూమ్యానాయక్. వెళ్ళిపోతున్న వెంకటేశం వైపు చూస్తూ నిలబడి పోయారు. వెంకటేశంని పిలిచేందుకు ముందుకు వెళ్ల బోయిన తండ్రిని చుట్టుకుని భోరుమన్నాడు నాయక్.!

**వాటేసుకుని భోరుమంటున్న నాయక్ తల నిమురుతూ.. "అయ్యోరు కాదు వెంకటేశా, సర్కారు 'గుంటిది', గుడ్డిది గూడా. ఆ...!" అని కళ్ళు తుడుచుకున్నాడు భూమ్యానాయక్.**

**"అందుకే బళ్ళు చచ్చిబోతున్నాయ్.. చదువుల్లేక చట్టు బండ లవుతున్నాయ్" అంటూ "పదండి వెళ్దామని" తలూపాడు బజ్జీల బండి సేటు..!**

(అమ్మ భాష విలువ తెలియక అవసరాన్ని పట్టించుకోకుండా నిర్వీర్యం చేస్తున్న పెద్దలందరికీ కనువిప్పు కలుగుతుందని ఆశిస్తూ...)

కవిత

[redacted]

-బి.వి.శివప్రసాద్
98485 27109

నేల నుండి నింగి కెగసె
అద్భుత భావ దార
అలసి సొలసి కన్ను మూసె
ఒక సఫల జీవన తార
ఆ అవిశ్రాంత కవితా శిల్పి
కలము కదిలెను హలము తీరుగ
సాహితీ వనంలో పూయించెను భావసుమములు
కొల్లలుగ రోజు వారిగ
చిత్రసీమయు మురిసి మెరిసెను
ఆ సృజనకారుని రమణీయ
గేయ సుమముల సువాసనకు
తెలుగు గజలుకు బ్రహ్మ తానై
ఆత్మ, స్వరము అన్ని తానై
కొత్త పాటకు సొబగులద్దెను
చదువులమ్మకు ముద్దు బిడ్డై
విద్య నేర్పే గొప్ప గురువై
శిష్యులెందరో మెచ్చుకొనగా
జ్ఞాన మూర్తిగ వెలుగులొందె
పూర్ణ జీవితమనుభవించి
మంచి కవితలు మనకు పంచి
ఆ తార తరిగిపోని కీర్తి బడసె
విశ్వమునకు వీడ్కోలు పలికె
*(శ్రీ డా॥ సి. నారాయణ రెడ్డికి స్మృత్యంజలి)*

-స.వెం.రమేశ్

# జగదలపూరు(బస్తరుజిల్లా)లో తెలుగువారు

**కా**కినాడలో ఏటేటా పిల్లల పండుగ జరిపే "క్రియ" జట్టులో ముక్కెమైనవారు జగన్‌గారు. వీరూ వీరి నేస్తాలు కొందరూ కలిసి అప్పుడప్పుడూ ఉడుమలపేటకు వచ్చేవారు. అక్కడ జరుగుతుండిన తెలుగు తరగతులను చూడడానికి, తెలుగువారితో కలిసి తిరగడానికీ వస్తుండేవారు. అట్లా రెండునెలల కిందట వచ్చినప్పుడు, ఉడుమలపేటను ఆనుకొని ఉండే ఏనుగుమలలను ఎక్క వచ్చినారు. రెండునాళ్లపాటు ఆ కొండలను ఎక్కీదిగీ అలసిసొలసి వచ్చి పడుకొన్నప్పుడు, చిత్రకోట సోర (జలపాతం) గురించి చెప్పుకొచ్చినారు. చత్తీసుగడ నాడులోని జగదలపూరుకు దగ్గరలో ఉండే ఆ సోర ముచ్చట్లను కతలుకతలుగా చెవులూర చెప్పినారు. ఆగస్టునెలలో రమ్మనీ, ఆ తావును చూపుతాననీ మాటిచ్చినారు. సరేనని బయలుదేరినాము. తమిళనాడునుండి నలుగురమూ, తెలంగాణ నుండి ఆరుగురూ, ఆంద్రనుండి ఇద్దరూ, విశాకవరకూ పట్టేగి (రైలు) ఇరువులను (సీట్లను) పదిలపరచుకొన్నాము. పయనానికి వారం ముందు, జగన్నుండి పిలుపు వచ్చింది. వారికొక చిన్న ముప్పు, కాలి ఎముక చిట్లింది, కదలలేని నిలవరం. కాకినాడ జట్టు మొత్తం ఆగిపోయింది.

మిగిలిన పన్నెండు మందిమీ బయలుదేరినాము. విశాకనుండి జగదలపూరు వరకూ రానూపోనూ కలిపి మూడునాళ్లే పయనం మాది. మేము పోయింది; చిత్రకోట తీర్తంకోట సెలలను చూడడానికే. నాతో వచ్చిన వాళ్లందరూ అందుకోసం వచ్చినవాళ్లే. నేనయితే అందుకోసం మట్టుకే కాదు, అక్కడేమయినా తెలుగుజాడలు దొరకకపోతాయా అనే కోరికతో కూడా.

పన్నెండుమందిమీ కలిసి పొద్దున్నే ఒక అద్దేగి (టాక్సీ)ని మాట్లాడుకొన్నాము. మా తోలరి (డ్రైవర్) పేరు బిశ్వాస్. తెలుగు తెలుసా అని అడిగినాను. తెలియదని హిందీలో చెప్పినాడు. జగదలపూరులో తెలుగువాళ్లు ఉన్నారా అన్నాను. ఉన్నారనీ, అయితే ఎక్కడున్నారో తెలియదనీ, జగదలపూరుకు అయిదారుమైళ్ల దవ్వులోని వాళ్ల పల్లెలో ఉన్నారనీ మందల చెప్పినాడు. నాకు కావలసినది దొరికింది. అతనితో వచ్చీరాని హిందీలో మాట్లాడుతూ చెలిమి చేయడం మొదలుపెట్టినాను. మునిమాపటికి మా పయనం ముగిసినాక వాళ్ల పల్లెకు పిలుచుకొని పోతానని మాటిచ్చినాడు.

పొద్దుననుండి నడిపొద్దు వరకూ జలజల జాలువారే తీర్తంకోట (తీరత్‌గడ్) సోరలో మునకలు వేసినాము. నడిపొద్దు కొద్దిగా పడమరకు వంగే వేళకు చిత్రకోటకు చేరుకొన్నాము. బెదురు పుట్టింది. గుండెల్ని గుబగుబలాడించే అందం చిత్రకోట సోరది. గోదావరిలో కలిసిపోవాలనే తపనతో బిరబిర పరుగెత్తుతూ వచ్చి, ఎత్తయిన కొండమీదనుంచి వడివడిగా లోయలోకి దూకే చోటుపేరే చిత్రకోట.



ఇంద్రావతికి తెక్కణపు తావును తెక్కణ బస్తరు అంటారు. పాత బస్తరును వక్కణ, తెక్కణాలుగా చీలుస్తూ పారుతుంటుంది ఇంద్రావతి. జగదలపూరు కూడా యింద్రావతికి తెక్కణంగానే ఉంటుంది. ఈ తెక్కణ బస్తరు నిక్కానికి తెలంగాణలో ఉండవలసింది. ఉమ్మడి ఆంద్రనాడువారికి కానీ, ఇప్పటి తెలంగాణ వారికి గానీ ఆ సోరణ లేదనుకోండి. వావిలాల గోపాలకృష్ణయ్యగారు చివరివరకూ ఈ తావును కలవరించినారు. ఆయన మాటలని పట్టించుకొన్న దిక్కులేదు.

హోరున దూకే చిత్రకోట సోరను చూసుకొని వెనుతిరిగినాము. మా తోలరి, అటుగా వస్తున్న ఒక నడీడు అతడిని పిలిచి, నాకు నెళవు చేసినాడు. అతను గలగల తెలుగులో పలుకరించినాడు. జగదలపూరులోనూ, ఆ చుట్టుపక్కల కొన్ని పల్లెల్లోనూ తెలుగువాళ్లు ఉన్నారట. వీరంతా కళింగాంధ్రనుండి వలసవచ్చినవారట. వారి తెలుగు కళింగ తెలుగులాగానే ఉంటుందని, ఆంద్ర, తెలంగాణలలో ఇప్పుడు మాట్లాడుతున్న తెలుగులకు వేరయిన తెలుగును వినాలంటే బీజపూరు వైపు వెళ్ళాలట. జగదలపూరు నుండి మూడునాలుగు గంటల పయనమట. బీజపూరు చుట్టూ చాలా తెలుగు పల్లెలున్నాయట. వాళ్లు వలసవచ్చినవారు కారట. ఇంద్రావతి పరుగులాగా ఇంతా చెప్పి ఆగినాడు. అతని అమ్మనుడి తెలుగు కాదట, మలయాళమట. వాళ్ల తాత తరిలోనే జగదలపూరుకు వచ్చేసినారట.

తెలుగు మాటల మైకంలోపడి అతని పేరును కూడా అడగలేదు నేను. తిరిగి బయలుదేరినాము. జగదలపూరులో రాచనగరు ఉందంటే చూడడానికి పోయినాము. నగరులోపల ఆ రాచ కుటుంబం వారి తరతరాల పటాలు, నట్టనడుమన పెద్దపటం. అందులో ఆ రాజుపేరు, పేరుపక్కన చెవుల్లో (బ్రాకెట్లలో) 'కాకతీయ' అనే పేరు. అక్కడ కాపలా ఉన్న కోలుకారు (పోలీస్)ని అడిగితే, ఆ రాజులు ఒడియా వాళ్లనీ, ఒడిశా నుండి వలస వచ్చినవాళ్లనీ చెప్పినాడు. చూడడానికి వచ్చిన వాళ్లందరితోనూ ఇవేమాటలు. తెలుగువాళ్లం చెవులు తీపుకొంటూ వింటూనే ఉన్నాము.

**(తరువాయి (33వ పేజీలో)**

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

# వాడుక భాషలో వింత పోకళ్ళు

**యి**టీవల వంద, వందాయాభై కిలోమీటర్ల దూరంలో వుండే వూర్లకు తరచుగా బస్సు ప్రయాణం చేయవలసి వస్తోంది.

అమరావతి, రాజహంస, గరుడ మొదలైన పేర్లతో యేసీ బస్సులు సిద్ధంగా వున్నాయి. అయితే బస్సులు బయల్దేరకముందే బస్సుల్లో వుండే టీవీ గడబిడ చేయడం మొదలుపెడుతుంది. గత పదిహేనేళ్లుగా తప్పించుకుంటున్న సినిమాలు ప్రయాణీకులపైన దాడి ప్రారంభిస్తాయి. 1996 ప్రాంతాల్లో సినిమాల్లో పెచ్చుపెరిగిన హింసాత్మక దృశ్యాలకు మనస్సు చెదిరిపోవడంతో, అప్పటినుంచీ సినిమాలకు వెళ్ళడం మానేశాను. యిప్పుడు బస్సుల్లో వస్తున్న, యిదివరకూ పేరుగూడా వినని సినిమాలను చూస్తున్నప్పుడు అవి నాకు తెలుగు సినిమాలు కావేమోనన్న అనుమానం రాసాగింది. అందుకు ఆ చిత్రాల్లోని కథ, నేపథ్యం, పాత్రలు, వాళ్ల వేషాలు మాత్రమే గాకుండా, వాళ్ల భాష గూడా ముఖ్యమైన కారణం. యిటీవల నేను చూసిన చిత్రంలోని యీ సంభాషణ చూడండి:

"త్రీ యియర్సునించీ లవ్ చేస్తున్నా! యస్ అని చెప్పట్లేదు, నో అని చెప్పట్లేదు. తనకోసం నా అభిరుచులూ అలవాట్లూ కూడా మార్చుకుంటానన్నాను..."

"తను ఓకే అంటే నిజంగా నీ అభిరుచులూ అలవాట్లూ మార్చుకుంటావ్రా?" అమ్మాయిని లవ్‌లో దించడమనేది యిన్‌స్టెంట్ గాదురా, యిట్సే లైఫ్..."

"అవన్నీ నాకు తెలియదురా! హెల్ప్ చేస్తావా లేదా?"

యీసంభాషణను మళ్లీ విని, యిక్కడ రాశాక, నేను రాసిన వాక్యాల్లో యెన్ని పారిభాషిక పదాలున్నాయోనని వెతికాను. కిలోమీటర్లు, యేసీ బస్సులు– యీ మాటల్లో మొదటిదానికి తెలుగుమాట లేదు. రెండోదానికి సమశీతోష్ణ + బస్సు అని వాడవచ్చు. కానీ అది కృతకంగా వుంటుంది. అయితే త్రీయియర్సును మూడేళ్లనుంచీ అనవచ్చు. లవ్‌కు ప్రేమ అనే తెలుగుమాట వుండనే వుంది. యస్– అవును. నో– కాదు. ఓకే– సరే! యిన్‌స్టంట్– వెంటనే జరగడం, లైఫ్– జీవితం. యిన్ని మంచి తెలుగుమాటలుండగా వాటికి బదులుగా యింగ్లీషు మాటలు వాడడమెంతవరకూ సబబు?

యీ మాటలు విదేశాల్లో వుండే యిద్దరు ఐటీ యింజనీర్లు మాట్లాడుతారు. పోనీ స్వదేశానికి తిరిగొచ్చాక వాళ్ళ మాటలెలా వున్నాయి? చూడండి.

"ప్రేమ పెళ్ళి అంటే నాకు వొపీనియన్ లేదు..."

"నువ్వే యిష్టమని యెక్స్‌పెక్టేషన్ పెంచేసి నిన్ను లవ్‌లో పడేయచ్చు... పెళ్లయిన తరవాత నా లైఫ్‌స్టయిలేంటి, నా ప్రిఫరెన్సులేంటి, టైమింగ్సేంటి అన్నీ చెప్పాలనుకున్నాను..."

"టెస్టుచేసి పెళ్లి చేసుకుంటావా నన్ను?... నువ్వు చెప్తుంటే నాకు వక పర్సెంటు గూడా డవుట్ రాలేదు. అంత బాగా ఏక్టు చేశావు. నువ్వు లైఫు గురించి చెప్తుంటే, నేనా ప్లేస్‌లో వుంటే యెంతబాగా చూసుకునేదాన్నో అనుకున్నాను...."

యిక చాలు. యిటీవల బస్సుల్లో నేను చూసిన కుర్రకారు సినిమాల్లో భాషంతా యిలాగే వుంది. వో పాత తెలుగు చిత్రంలో యీ సంభాషణ చూడండి. యిందులో గూడా ఆ యువకుడు విదేశాలనుంచే అప్పుడే తిరిగొచ్చాడు:

"యివ్వాళ యేమిటి వంటలు?... యేముంది? దేశంకాని దేశం తిరిగి తెలుగు పచ్చళ్లకూ, కూరలకూ ముఖం వాచి వుంటాడు. పులిహోర, చక్కెరపొంగలి, దద్దోజనం... కరెక్ట్. త్రిమూర్తుల్లాంటి త్రి అన్నాల్నీ చేయడం..."

"దాందేముంది నాయనా! ఫస్టుగా చేసి వడ్డించేస్తాను"

యీ సంభాషణల్లో గూడా కరెక్టు, ఫస్టు అనే రెండు యింగ్లీషు పదాలొచ్చాయి. మొదటిమాట ఆ యువకుడిది. రెండవది వంట లక్కది. అయితే అప్పటికీ యిప్పటికీ యెంత తేడా! యిక వో టీవీ వ్యాఖ్యాతగారి మాటలు చూడండి:

"మీరిద్దరూ గూడా ఫుల్‌స్వింగ్‌లో వున్నారు. జనరల్లీ మీ డిస్కషన్స్‌లో స్టోరీ డిస్కషన్స్ గూడా వస్తూ వుంటాయా?"

"వొక్క సారి సడన్‌గా నేను వెరైటీ సినిమాల్లో ట్రైచేస్తూ వుంటాను. ట్రై సంథింగ్ డిఫరెంట్ అని..."

యిలా సాగిపోతూ వుంటుంది. యీ మాటల్లో తెలుగు మాటలెన్ని? అక్కడ మనం తెలుగుమాటలు వాడలేమా?

యీబాధ తెలుగు సాహిత్యానికి గూడా తప్పడంలేదు. యిటీవల వచ్చిన వొక తెలుగుకథలోని కొన్ని వాక్యాలు చూడండి:

లేత తేనెరంగు జుట్టుని కేవ్స్‌గా మార్చిన హెయిర్‌స్టైల్ అమ్మాయి. వెంటే వో వ్యక్తి నడుస్తున్న ఫీలింగ్... గుండెల్లో పాప్ పేలింది. తనని మాడ్రన్ కాదంటారేమోనన్న భయం... పేరెంట్స్ యేమంటారనే టెన్షన్... తనకు యింపార్టెన్సు రావడం పెద్ద యిగో సాటిస్‌ఫేక్షన్... అయినా అన్‌యిన్స్‌పైరింగా అనిపించి పర్సనల్‌గా కలవడానికి అపాయింట్‌మెంట్ అడగాలనిపిస్తోంది..."

మరో కథలో:–

"లంచ్ అవర్లో స్టాఫ్ నంతటినీ పిలిచారు. సైకలాజిక్ కౌన్సిలింగ్ అని అనౌన్సు చేశారు. అందరికీ కొశన్ పేపరిచ్చి, ఏబీసీడీల్లో ఒక దాన్ని టిక్ చేయమన్నారు. అవి చదువుతూ తనను తాను పబ్లిక్‌గా చదివినట్లు ఫీలింగ్. సైకాలజిస్టు లెదర్‌బాగ్ తెరిచి గ్లాస్ బాటిల్స్ పైకి తీశాడు. బాటిల్స్‌లో రెడ్, వైట్, యెల్లో, బ్లూ రంగు లిక్విడ్స్ వున్నాయి..."

భాష వొక ప్రవాహం. ప్రవాహంలోకి అవసరంకొద్దీ చాలా మాటలు వచ్చి కలుస్తాయి. అయితే వున్న మాటల్ని వదిలేసి, అదొక విశిష్టమైన పద్ధతి అనుకుని యింగ్లీషు మాటలు వాడడ మెంతవరకూ సహేతుకం? వో సభలో ప్రముఖ వక్త– అతగాడు తెలుగు ఆచార్యుడుగా పదవీ విరమణ గూడా చేశాడు– అన్నాడు– "నేనెంతో హాపీగా ఫీలవుతున్నాను. నా అనుభవాలు మీతో షేర్ చేసుకోవడంకోసం వచ్చాను..." యిప్పుడు తెలుగువాళ్ళు 'సంతోషం' అనేమాట పూర్తిగా మరచిపోయారనిపిస్తోంది. అందరూ హాపీగానే ఫీలవుతున్నారు.

తెలుగుభాషకు తొలినాటి సాహిత్యకారులు చేసిన సేవ చాలా గొప్పది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి గోదావరిజిల్లాల తెలుగు నుడికారాలతో వెలిగిపోతూ వుంటుంది. చలంగారి తెలుగు వాక్యాలు జలపాతపు పాయల్లా వేగంగా దూకుతాయి. కుటుంబరావుగారి వాక్యం మంచినీళ్లలా తేటగా స్పష్టంగా వుంటుంది. మల్లాది రామకృష్ణశాస్త్రిగారి జాణ తెలుగు కృష్ణాతీరపు సారాన్నంతా వొడిసి పట్టుకుంటుంది. చాసోగారి విజయనగర మాండలికం, రావిశాస్త్రిగారి విశాఖభాష సజీవంగా పలుకుతాయి. ముళ్ళపూడి వెంకటరమణ వాక్యానికి రంగులూ రాగాలూ అద్దుతారు. యింగ్లీషువాక్య విన్యాసాన్ని గుర్తుచేసినా బుచ్చిబాబుగారి రచనలు తెలుగుకు కొత్త అందాలనే సంతరిస్తాయి. కథావస్తువు కనుగుణంగా తనభాషను గొప్పగా మలుస్తారు తెన్నేటి సూరి. ప్రామాణికమనిపించే తెలుగువాక్యంలోని నాజూకు రాయలసీమ పలుకుబళ్లను తీసుకొస్తారు మధురాంతకం రాజారాం. యిలా అనేకమంది గొప్ప రచయితలు తీర్చిదిద్దారు ఆధునిక తెలుగువచనాన్ని యిప్పుడిలా ఆధునికులు సంకరభాషగా మార్చే ప్రమాదమొకటి ముంచుకొస్తోంది.

వడ్డెర చండీదాసుగారు తన "హిమజ్వాల" నవలకు వెనుక మాటగా రాసిన అర్థాను (స్వా) సారంలో యిలా రాశారు.

"మంచి వచనంలోని కవిత్వం, మంచి కవిత్వంలోని వచనం నాకిష్టం. అవి చలనాన్నీ, సంద్రతనీ సంస్పందనలనీ చిత్రిస్తాయి. ఆంగ్లపదాలను విధిగా వాడాల్సిన అవసరం లేదనిపించి, వాడకపోతే (ముఖ్యంగా, సంభాషణలలో) అసహజంగా అనిపించవచ్చు. ఆంగ్ల భాషవల్ల కలిగిన మేలు, కీడుగా మారేంతదాకా పోకుండా–ఈ సంధికాలంలో కొంత (అ)సహజత నుపేక్షించడం దౌష్ట్యం కాదేమోనని.

రానున్న రెండుమూడు దశాబ్దాలలో భాషలో (గ్రాంధికభాష మాట కాదు! తెలుగుభాష గురించి) చాలా మార్పులు, కూర్పులు జరుగుతాయని, సంస్కృతాంగ్లాల్లో లాగా క్లుప్త వ్యక్తతకీ, పొందికకీ, వివిధ శాస్త్ర విషయాలను వివరించేందుకనుగుణంగా మన భాష మార్పులకు లోనవుతుందని భావించి, ఆశించి– అనే మనం కేంద్రించి, ధృవించి, స్నానించి లాంటివి కూడా వాడొచ్చునని.."

చండీదాసుగారు ఆస్ట్రేను బూడిదబుడ్డీ అనీ, బాత్‌టబ్‌ను స్నానాలతొట్టీ అనీ అన్నప్పుడు ముచ్చటేస్తుంది. తొండనాడు తెలుగు రచయితలు తాము అనువదించిన తమిళ కథలలో 'సంపాదకీయం' ను తలయుగం అనీ, డిప్యూటీ కలెక్టరును అనుపరి అనీ, ప్రశ్నను అడక అనీ, పోలీసును కోలుగారు అనీ, దీపాన్ని బెళుకు అనీ, బస్సును పేరెగి అనీ లారీని సరుకేగి అనీ– యిలా అచ్చతెనుగు మాటల్ని వాడుకలోకి తేవటానికి ప్రయత్నించారు. యేదయినా వొకమాటను వాడిన కొత్తలో కృత్రిమంగానే వుంటుంది. వాడుక పైన్నే అది అనవాటవుతుంది. అవసరమున్నప్పుడు పరభాషలోంచీ పదాల్ని అరువు తెచ్చుకోవడం తప్పుగాదు. తప్పదుగూడా! అయితే పని గట్టుకుని, అవసరంలేని పరభాషా పదాల్ని వాడి, తెలుగు వచనాల్ని కలుషితం చేయడం భావ్యంగాదు. సినిమా, టీవీ, పత్రికలు, సాహిత్యం వంటి మాధ్యమాలు భాషతో చెలగాటమాడడం తప్పు! యీ ప్రమాదాన్ని యిప్పటికైనా మనం గుర్తించకపోతే తెనుగుభాష తనకున్న విశిష్టతను కోల్పోక తప్పదు.

**(31వ పేజీ తరువాయి)**



చాందినీచౌకులో బొమ్మల కొట్టు ఉందని తెలిసి బయలు దేరినాము. మా జట్టువాళ్లంతా బొమ్మల కొట్టులోకి దూరినారు. కొట్టు ఆయన్ని తెలుగు తెలుసా అని అడిగినాను. తెలియదని చెప్పి, పక్కనే ఉన్న సందుని చూపించి, ఆ సందులో తెలుగువాళ్లున్నారని చెప్పినాడు. తమిళనాడు తెలుగువాళ్లం నలుగురమూ గబగబా సందులోకి పోయినాము. సందులో ఒక చిన్న పెంకుటింటి ముందు ఒక పెద్దావిడ కూర్చుని ఉంటే పలుకరించినాము. నవ్వుతూ తియ్యటి కళింగ తెలుగులో పలికింది ఆ తల్లి. తాగడానికి చల్లటి నీళ్లిచ్చింది. తేనీరు తాగమని బతిమాలింది. ఆ తావుపేరు బాలాజివాడ అని చెప్పింది. మనుమడైన గౌతమ్ అనే పిల్లవాడిని తోడుగా పంపి, దగ్గరలోనే ఉన్న ఆంధ్రసమాజానికి దారి చూపించింది. 'ది బస్తర్ డిస్ట్రిక్ట్ ఆంధ్రా అసోసియేషన్, జగదల్‌పూర్' అని హిందీలో, ఇంగిలీసులో ఉన్న పేరు పలక మమ్మల్ని లోపలికి పిలిచింది. మరునాడు ఆగస్టు 15, సొతంత్ర పండుగ. ఆ ఏర్పాట్లలో ఉన్నారు అక్కడి తెలుగువారు. తమిళనాడు తెలుగువాళ్లం అనగానే సుంత వింతగా ఎంతో ఎలమిగా చేతులు చాచారు. జగదలపూరులోనూ ఆ చుట్టుపక్కలా కలిపి ఇరవయివేలమంది తెలుగువారున్నారట. వారిలో 200 ఏండ్లనుండి 50 ఏండ్ల కిందటివరకూ వలస వచ్చినవారు ఉన్నారట. ఒకరిద్దరు తప్ప తెలుగు రాతలు తెలిసినవారు లేరు. బడిలో కాకుండా ఆంధ్ర సమాజ కట్టడం (బిల్డింగు)లో ఆదివారం పూట తెలుగు తరగతులను నడిపించాలని అనుకొంటు న్నారు. అయితే ఎట్ల నడపాలో, కావలసిన పొత్తాలేమిటో, నేర్పే వారెవరో ఏమీ తెలియడం లేదు అని వాపోయినాడు. 'తెలుగువాణి' చేతనయిన సాయం చేస్తుందని చెప్పినాను. మరునాడు కొడి (జండా) పండుగకురమ్మని పిలిచారు. పొద్దున్నే అందరమూ ఇంకొకసారి అక్కడకి పోయినాము. చాలామంది ఉన్నారు. నోరారా పలకరించారు. చేయారా కౌగలించుకొన్నారు. ఎన్నో ఏండ్లుగా చిత్రకోట సోరను చూడడానికి ఎందరో తెలుగువారు వస్తున్నారు, పోతున్నారు. కానీ ఇన్నేండ్లకు మమ్మల్ని వెతుక్కొంటూ మీరు వచ్చారు' అని గొంతులు తడబడుతుంటే బరువుగా అన్నారు మాతో. చెమరించిన కళ్ళతో తిరుక్కొన్నాము.

తెలుగువాణి మీద ఇప్పుడు మరొక బరువు పడింది.

–ఆచార్య జయధీర్ తిరుమలరావు
9951942242



# భాషాసాహిత్యాల యుద్ధకవచం కాళోజి కవిత్వం

**ఒక** కుటుంబ సభ్యుడిని కోల్పోతే అతడి కోసం పరితపిస్తాం. ఓ కుటుంబాన్ని కోల్పోతే తిరిగి పొందడానికి ప్రాణాలు ఇస్తాం. మాతృదేశాన్ని చేజారిపోతే సామూహికంగా ఒకటై పోరాడుతాం. అది మానవుడి సహజ ప్రవృత్తి.

అలాగే ఓ మనిషి తన భాషని కోల్పోవడం చూసి భరించలేక అరిచి గీపెడతాడు. ఒక పూర్తి భాష తమ నుండి దూరం అవుతుందంటే భరించలేడు. తప్పుచేసిన వాడు, చేయనివాడు ఖైదులో పడతానని ఎందుకు భయపడతాడు? తన నోటి భాషని అక్కడ స్వేచ్ఛగా వ్యక్తం చేయలేనని భయభ్రాంతుడౌతాడు. సంకెళ్ళు చేతులకు కాదు. నోటికి పడతాయి. అది భరించలేడు.

తల్లిభాష మాతృదేశం కన్నా విలువైనది. భాషని కోల్పోయినవాడికి దేశం ఇక లెక్కలోకి రాదు. తన భాషావ్యక్తీకరణ కోసం తపిస్తాడు. అది మానవ అత్యంత సహజ గుణం.

తెలంగాణా భాష కోసం తెలంగాణీయులు ఎన్నో శతాబ్దాల నుండి పరితపిస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యానంతరం మొగలులు, ఢిల్లీ సుల్తాను, గోలకొండ నవాబు, ఆసఫ్‌జాహీలు, ఆంగ్లేయుల పాలనాకాలంలో భౌగోళికంగా ఈ ప్రాంతం వారి అధీనంలో ఉండేది. భాష కూడా స్వేచ్ఛకోల్పోయి శుష్కించి పోయింది. రాజ్యభాషగా, పాలనా భాషగా, బోధన భాషగా, ఆస్థాన భాషగా ఏనాడూ గుర్తింపు పొందలేదు. ఈ విషయం హైదరాబాదులోని ప్రభుత్వ అభిలేఖాగారంలో పదకొండో శతాబ్దం నుండి లభించే ప్రాచీన పత్రాలను పరిశీలిస్తే ఇట్టే తెలిసిపోతుంది. సంస్కృతం, అరబ్బీ, పర్షియన్, ఉరుదూ, ఆంగ్ల భాషలలో మాత్రమే పాలన జరిగింది. ప్రభుత్వంలోని ఏ ఒక్క విభాగంలోని ఏ ఒక్క పత్రం కూడా తెలుగులో లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాష కొంత గుర్తింపు పొందినా తెలుగుకి సోదర భాష అయిన తెలంగాణా భాషకు ఏమాత్రం గౌరవం లభించలేదు. పైగా ఉన్న గౌరవం తగ్గింది. దుష్టభాషగా, విలన్లు మాత్రమే ఉపయోగించే భాషగా పరిమితం అయ్యింది. అందుకే ప్రత్యేక రాష్ట్రోద్యమం భాషా సంస్కృతుల కోసం మొదట మొదలైంది. ఇది వాస్తవం.

ఏ ప్రాంతం వారికి ఆ భాష పట్ల అభిమానం సహజం. ఈ నేలలో జన్మించిన ప్రతివాడు తెలంగాణ భాష అంటే ప్రాణం ఇస్తాడు. మలిదశ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వేలాది మంది మరణాలకు వేరు వేరు కారణాలు ఉండి ఉండవచ్చు. కాని అందరు కూడా తెలంగాణ భాషకి జరిగే అవమానాన్ని తట్టుకోలేక పోయారు. అందుకే పాటల్లో, నినాదాల్లో, కేకల్లో, ధర్నాల్లో, ఉపన్యాసాల్లో, రచనల్లో, తెలంగాణా భాషని ప్రతిధ్వనింపచేసి కొంత ఊరట పొందారు. ఇప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి సహజంగా తెలంగాణ భాషలోనే చక్కగా మాట్లాడతాడు. ఉపన్యసిస్తాడు. తన భాషని మరవలేదు. తన యాసని విడవలేదు.

ఐతే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తరువాత తెలంగాణా భాషకి తగినస్థానం లభిస్తుందని ఆశించారు. ఆవిధంగానే ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఆ భాషకు అన్ని రంగాలలో గౌరవం పెరుగు తుందని చాలామంది ఆశించారు. అలాంటి వారిలో కాళోజి ఒకరు. ఏదో ఒకరోజు తెలంగాణ భాష సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని చివరి క్షణాల దాకా కలలు గన్నారు.

తెలంగాణా రైతాంగ పోరాట కాలంలో తొలి ఆంధ్రమహాసభలు జరిగే కాలంనుండి నైజాంలో తెలంగాణా భాషకి జరిగిన అన్యాయంపై ఎలుగెత్తిన మొదటి కవి కాళోజి. సురవరం ప్రతాపరెడ్డి అయితే తెలంగాణలో కవిత్వం రాలేదన్న చిన్న విమర్శకు జవాబుగా 'గోలుకొండ కవుల సంచిక' తెచ్చాడు. ఆయన 'భాష'పై అనేక వ్యాసాలు రాశాడు. కాళోజి తెలంగాణా రాష్ట్రంలో తెలుగు భాష, సంస్కృతి, వేషధారణ గురించి కూడా ఎంతో ఆవేదన చెందాడు. ఆ క్షణంలోనే భాష గురించి తన కవిత్వంలో ఎన్నోసార్లు ఉటంకించాడు. తన మరణం చివరి కవిత వరకు భాషని ప్రధాన వస్తువుగా చేశాడు. కవితేతివృత్తం అన్నప్పుడు అతని కవితాత్మని కూడా గ్రహింపులోకి తెచ్చుకోవాలి. కాళోజికి కవిత్వం వస్తువు, రూపం భాష వేరు వేరు కావు. ఆ రెండూ ఐక్య అస్తిత్వం ఒకటే. నిజానికి అతని చాలా కవితలలో విమర్శ పాళ్ళు ఎక్కువ. సామాజిక కోణంలోంచి రాసిన ధిక్కారంలో భాష కూడా ఒక భాగంగా చూడాలి. ఈ రకంగా ఒక మాండలిక భాషపై కవిత్వం రాసిన కవులలో కాళోజిదే ప్రధాన స్థానం. భాషా సాహిత్య సంస్కృతుల విషయంలో కాళోజి భావనలు ఎలా ప్రతిబింబించాయో తెలుపడమే ఈ వ్యాసం ఉద్దేశం.

కాళోజి ఫౌండేషన్‌వారు 2001లో ప్రచురించిన 'నా గొడవ' కాళోజి కవిత సంపూర్ణ సంకలనం ఆధారంగా చేసుకుని ఈ వ్యాసం రాస్తున్నాను. కాళోజి 'నా గొడవ'లో రాజకీయాలు, ఆధిపత్యాలు, భాషా సంస్కృతులు అనే మూడు ముఖ్యమైన అంశాలు కనుపిస్తాయి.

'నా గొడవ' మొదటి సంపుటంలోని మొదటి కవిత 1940లో రాశాడు. దాని పేరు 'మాతృదేశం'. ఆ కవిత మొదటి పంక్తిలోనే – మాతృదేశము మాట ముచ్చట/ ముదము గూర్పదు మదికి నినియెడి / పరమ నీచుడు ధరణి నంతత / గలయ వెదికన గాననగునా" అని అన్నాడు.

'మాతృదేశము మాట ముచ్చట' మాట అనడంలో శబ్దం తల్లి భాషగా సంభావిం చాడు. తల్లివంటి దేశం అంటే దానిలో తల్లిభాష ఒక

భాగం. ఆ భాషని విని ఆనందించని పరమ నీచుడు ఎవరైనా, ఎంత వెదికినా కనుపిస్తాడా? అని ప్రశ్నించాడు. ఐదో కవిత 'వ్యత్యాసాలు'లో కావ్యగానాలు ఒక చోట, కావ్య పిపాసువులు ఒకచోట అంటూ, 'సాహితీ నిలయమొక చోట, చదువరులంత ఇంకొక చోటా' అని స్పష్టం చేశాడు. భాషాపరంగా దీనికి కొనసాగింపుగా తదుపరి 'ఆంధ్రుడా (1942)' అనే కవితలో 'ఏ భాషరా నీది ఏమి వేషమురా? ఈ భాష ఈ వేష మెవరి కోసమురా" అని ప్రశ్నించాడు.

'నీ భాష దీనతకు, నీవేష దుస్థితికి కారకుడవు నీవేయని కాంచవెందుకురా' అని విమర్శించాడు. "తెలుగు బిడ్డవయ్యు తెలుగు రాదంచును సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా" అని ఈసడించాడు. ఈ భావాన్ని తెలంగాణా ప్రత్యేక రాష్ట్రోద్యమ కాలంలో రెండున్నర జిల్లాల తెలుగుని నిరాకరిస్తూ తెలంగాణ భాష అస్తిత్వాన్ని అప్పుడే గుర్తించాడు. ఇప్పుడు తెలంగాణ బిడ్డవయ్యు నీ భాషని నీవు మరిచి పోతావా అనే రీతిలో ఈ కవిత స్ఫురిస్తుంది. అందుకే 1944లో రాసిన 'ఇంకెన్నాళ్ళు' (పే.7) కవితలో సాహిత్యం, భాష ప్రజల పక్షం నిలవాలని అవి ప్రజలను కదలించాని భావించాడు. అంతేకాదు తన కవిత్వాన్ని ఆ రీతిగా రాసి చూపించాడు. భాషకు ఇతివృత్తానికి మధ్య చక్కని సమన్వయం సాధించాడు.

"కలము పోటున కదపజాలని
కావ్య గానము ఇంకెన్నాళ్ళు
కాళోజి కవి కైత వినియు
కదలకుందురు ఇంకెన్నాళ్ళు?"

అని ప్రశ్నించాడు. ప్రజలను పట్టించుకోకుండా వారిని నిద్రపుచ్చే కవిత్వం ఇంకానా? అని ప్రశ్నిస్తూ కాళోజి కవితను మెచ్చుకున్నవారు, చదివినవారు సైతం కదలక పోవడానికి కారణం ఏమిటి అని సూటిగా ప్రశ్నించాడు. ఈ ప్రశ్న అతని మరణానంతరం కూడా మనల్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది. 1942లో రాసిన 'లేకుంటేమి' కవితలో పండించు ప్రాణాలు పస్తుపడ్డాక. పాడు రాజ్యాన్ని కాపాడకుంటేమి?" (పే.14) లో రైతు బాధలు తీర్చని రాజ్యం గొడుగు కింద సుఖాలు అనుభవిస్తూ, రైతు వ్యతిరేక రాజ్యానికి కవులు అండదండలు ఎందుకు అందించరని ఆనాడే అడిగాడు. నైజాంపై భాషా కవితల అస్త్రశస్త్రాల్ని గురిపెట్టిన తెలంగాణా ప్రజాకవి కాళోజీ. ఆనాడు నైజాంకి వత్తాసు పలుకుతూ ప్రభుత్వం గూడిలో చేరిన కవులు తక్కువ. విచిత్రం ఏమంటే ఇవ్వాళ అదే నైజాంని పొగిడే పాలక వర్గాల తాబేదారులుగా కొందరు ప్రవర్తిం చడం కాళోజి ఊహించని పరిణామం. ఈ కోణంలోనే "1945లో రాసిన 'ఓరాజా' కవిత (పే.17)ని చూడాలి. 'పోషించు వాడవని పూజించు జనుల, పీఠమెక్కినదాది పీడించు టేనా" అని రాశాడు. 'కల్లగాదిది, కైతకాదిది' అని 'నగ్నసత్యాలు' (పే.20) కవితలో విస్పష్టం చేశాడు.

1952లో 'సరస్వతీ భక్తుల్లారా!' కవిత (పే.23)ను రాశాడు ఇందులో సీమాంధ్రకవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి. 'కన్నీటి కబురు' అనే పుస్తకంలోని తెలంగాణ భాషని అవమాన పరుస్తూ సభలో మాట్లాడితే దానికి ఈ కవిత ద్వారా జవాబు చెప్పాడు.

"మా రచనలో వ్యాకరణం మాత్రమే లేదు
మీ రచనంతా వ్యారణం: మరేమీకాదు
... మా నోట రాలిన మాట
ఆనోటా ఆనోటా
వినవింద్రై, మనసుకు పసంద్రై..
సారస్వత పూజా ద్రవ్యంగా
భద్రపరుచుకున్నారు మీ వైయ్యాకరణులు'..
సరస్వతీ భక్తుల్లారా
బ్రహ్మనే వెక్కిరిస్తారా' అని అంటాడు.

తెలంగాణ ప్రజలకు వారి భాష ముఖ్యం. ఆంధ్ర పండితులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి లాంటి వారికి వ్యాకరణం మాత్రమే ముఖ్యం. కాని నిజానికి పదసంపద సృష్టి ముఖ్యం. తెలంగాణా ప్రజల భాషలో వినడానికి వీనుల విందైన చక్కని భాష ఉంది. పసందైన పదాలు ఉన్నాయి. వీరే అపర భాషా బ్రహ్మలు. సరస్వతీ భక్తులు. భాషను సృష్టించే తెలంగాణ బ్రహ్మను వెక్కిరించడం తప్పని మరునాడు శ్రీకృష్ణదేవ రాయ భాషానిలయంలో జరిగిన కవి సమ్మేళనంలో ఈ కవిత చదివి వినిపించాడు. తెలంగాణా భాష కోసం పండితులను ఎదుర్కొన్న సాహసి. ఆంధ్రుల వ్యాకరణాన్ని ఒప్పుకుంటే వారి భాషని ఒప్పుకోవాలి. ఒకసారి ఒప్పుకుంటే తెలంగాణా భాష గౌరవం తగ్గిపోతుంది. వారి యాస, ఉచ్చరణ అంగీకరించాక మరో ఆలోచన ఉండదు. ఇదీ కాళోజి భావన. అందుకే 'ఎవరను కొన్నారు ఇట్లవునని' (పే.34)లో

"సత్తా రాగానే కళ్ళు నెత్తికెక్కి పోతాయని
త్యాగులు సైతం గడియలో భోగులయి
పోతారని–అలా ఎవరనుకొన్నారని" వాపోతాడు.

సత్తా కోసం, పోరాడినవారు అది రాగానే భోగులు మారిపోతారు. ప్రజల భాష కోసం కాకుండా భోగభాషకి, ఆలంకారిక భాషకి దగ్గరవుతారు. అలాంటి భావం ఈ చరణాల్లో ధ్వనిగా వినిపిస్తుంది. తెలంగాణా భాష, ఆ భాషగా మారుతుందని అతని భయం.

'పరాభావన పంతం' (1966) విభాగం లోని నా గొడవ (పే.49) అనే కవితలో–

నఖరాలు లేనట్టిది
నాజుకుది కానట్టిది
నా గొడవను నది

అక్షరాల జీవననది' కవితలో తెలంగాణ భాషా కవిత్వాలు అనలంకార ప్రధానమైనవి. అందుకే నఖరాలు లేనట్టిది అన్నాడు. అట్లని నాజూకుగా ఉండదు. అది అక్షరాల జీవననది' తెంగాణ భాష ఒక మహా ప్రవాహం అనే భావం సంకేతించాడు కాళోజి.

1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఏర్పడింది. దీనికి ముందు కాళోజి వంటి కవి పండితులు చాలామంది కలసి 'అఖిలాంధ్ర సాహిత్య పరిషత్తు" ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన ప్రభుత్వం ఈ స్వతంత్ర సాహిత్య పరిషత్తులో కాళోజి వంటి వారు ఉంటే ప్రభుత్వాన్ని విమర్శిస్తారనే ఆలోచనతో సాహిత్య అకాడమిని స్థాపించారు. దీనివల్ల సాహిత్యంపై తమ తమ వర్గాలు, ఉన్నత వర్గాల పట్టు కొనసాగించాలని, తెలంగాణా కవులు, రచయితలపై ఆధిపత్యం నెరపాలని భావించి అకాడమిని స్థాపించారు. ఆ సందర్భంగా రాసిన కవితలో..

పూజ పేరిట కట్టిరి మాటమ్మగుడి
పూజారుల మజా హడావుడి దడి
ప్రాతినిధ్యం ఇచ్చితి కులావారిగ
ఆర్థికమౌ సాహిత్యానికి దారి
సార్థకమౌ సాహిత్యం పరారి
దిన వెచ్చం ప్రయాణం పెచ్చు
ఘనంగా మంత్రుల వలె తిరగొచ్చు
జాతీయ సాహిత్యాల 'పిచ్చ' ముందు..

సాహిత్య అకాడమిని కాళోజి మాటమ్మ గుడి అన్నాడు భాషా దృష్టితో. భాష, సాహిత్యాల కోసం రూపొందిన అకాడమిలో ప్రభుత్వానికి బాకా ఊదే కవులని కమిటీ మెంబర్లుగా నియమించారు. ఈ అకాడమీ 'అంధపరదేశ్ అగాధమి' అని పిలిచాడు కాళోజి. అక్కడ జరిగే పని ఏమంటే – ఆర్థికమౌ సాహిత్యం ముందర సార్థక సాహిత్యం పరారి అవుతుందని జోస్యం చెప్పాడు. కాని అదే నిజమైంది. పుస్తకాలు అచ్చేసుకోవడానికి ఆర్థిక సహాయం, అవార్డుల కోసం పైరవీల నిలయం అయ్యింది. చోటా మోటా రాజకీయ నాయకులు కూడా రెకమెండేషన్లు చేయడం, రాజకీయాలకు కేంద్రం కావడంతో అది ప్రభుత్వాబాకా సంస్థ అయ్యింది. దీనిని గమనించి దిగంబర కవులు, విప్లవ

కవులు, ప్రజలతో ఉండాలనుకునే కవులు దానికి ఆమడ దూరంగా ఉన్నారు. వీరిలోంచే గొప్ప సాహిత్యం వచ్చింది. ఏ పురస్కారాలు రాకున్నా గొప్ప రచయితలు అనే పేరు దక్కింది. ఈ అకాడమి తెలంగాణా రచయితలకు చాలా అన్యాయం చేసిందనేది చరిత్ర తేల్చిన సత్యం.

'రాదుర్మతీ – రా॥' అనే ఉగాది కవితలో సైతం భాషా సాహిత్యాలను ఇతివృత్తం చేశాడు. ఇది అగాధమీ కవితకి కొనసాగింపుగా కనుపిస్తున్నది.

'మా కవులు మహా శిల్పులు
లత్త గువ్వల జాతిరత్నాలుగా చెక్కే ప్రవీణులు
నేడు దర్బారీ కవిరత్నాలు ఆరాజరికాన్ని సహింపకే
నాడు రాజునే ఎదిరించినారు
నేడు అధికారానికి హారతి పడుతున్నారు
అందుకే అంటున్నాను నేడు నీవు దుర్మతివి"

ఆనాడు నైజాంని ఎదిరించిన కవులు నేడు అధికారానికి హారతులిస్తున్నారు. ఇలాంటి సాహిత్య జోహుకుం గాళ్ళని కాళోజి ఏనాడూ క్షమించలేదు. అదీ ఆయన వ్యక్తిత్వం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడ్డాక, ప్రత్యేక రాష్ట్రం వంటివి సిద్ధించినప్పుడు స్వైరవిహారులకెప్పుడూ స్వేచ్ఛ అచ్చిరాదు. ఎప్పుడూ స్వేచ్ఛను దుర్వినియోగ పరుస్తున్నారని భావించాడు.(పే.55) స్వైర విహారం బాధ్యత ఎరుగని స్వేచ్ఛ. కలాలు కన్నూమిన్ను కానకుండా ప్రవర్తించడానికి కాళోజి వ్యతిరేకించాడు.

ఈ ధోరణిని బానిసత్వ లక్షణము అని కూడా స్పష్టం చేశాడు. ఆ కవితలో ఉమ్మడి పాలనలో తెలంగాణ కవులు బాధ్యత గుర్తెరుగక జీ హుజూర్ అనే తత్వం ప్రబలిపోయిందని బాధ చెందాడు. ఆ రకంగా ఉద్యమం డిరైల్ అయ్యిందని భావించాడు. పాలకుల పీక నొక్కు సిద్ధాంతం భాష నొక్కు సిద్ధాంతమైందని అన్నాడు. అందుకే 1966లో రాసిన శాంతి – శాంతట! శాంతి!! (పే.70) కవితలో

"కాళోజి ప్రేలుతుంటే
నా గొడవ లావా చిందుతుంటె
దద్దమ్మలు బెదురుతుంటె
దేబెలు కదలక వింటె
బతుకు (భాష) చితికి పోతుంటె
శాంతి – శాంతట! శాంతి!!

తాను ఎందుకు ఇంత అశాంతిగా ఉన్నాడో పై చరణాలద్వారా వ్యక్తంచేశాడు. నిబద్ధత, వ్యక్తిత్వంలేని వారికి తానే ముఖ్యం. తనకు తన బతుకే అవసరం. ప్రజలు ఎటుపోతేనేమి అనే ఆలోచనలో 'నా గొడవ' లాంటి లావా కవితను లెక్క బెట్టక ఉన్న దేబె కవులను ఆ కవితలో హెచ్చరించాడు.

అప్పుడే పుట్టిన శిశువు సైతం పిడికిలి బిగించి ఉన్నాడని 'పురిటిపాప' అనే బెంగాలి అనువాద కవితలో ఇలా రాశాడు.

"ఏదో తెలియని ప్రతిజ్ఞ
ఆ భాష ఎవరికీ బోధపడదు..
కాని నేనా భాష ఎరుగుదును
రానున్న కాలపు వివరాల పట్టిక
నాకు దొరికింది" అందులో అంటాడు.

అలా ఆ పాప పిడికిలి భాషను విశ్లేషిస్తాడు. అందుకే ఈ కవితను అనువాదం చేయడానికి ఎంచుకున్నాడేమో.

1952 మొదటి సార్వత్రిక ఎన్నికల కాలంలో రాసిన క్రొత్త నడక (పే.87) కవితలో

'ప్రత్యర్థి మాత్రం పావులతోనే ముందుకు వచ్చినాడు / అతడు ఆధునికుడే కాని / సామాగ్రి మాత్రం పాతదే, నవీనుని సిబ్బంది మాత్రం మహార్భాటంతో ఉన్నది' అని ఆధునికత, నవీనత ఏదీ కూడా స్వభావం కాదు. అవి కాల సూచికలు మాత్రమే. కొత్త పాలకులు ఎప్పుడూ పాత మంత్రాన్నే (భాషా సాహిత్యాలు) పాడతారు. వారికి కొత్తది ఏదీ గిట్టదు. ఎందుకంటే దీని వల్ల తమకు ప్రయోజనం ఉంటుందా అని మాత్రమే చూస్తారు.

పాలకులే అలా ఉంటే, మరి వారి పాలనలో ఖుషీలు పంచుకునే కలాలు ఎలా ఉంటాయి. అందుకే 'జాగ్రత్త' అనే కవిత (పే.96)లో

'మన కలానికి కన్నొక్కటి
కలవు నాలుకలు రెండు
పదుపు కూడు మజా మెండు
గుట గుట మేసేటప్పుడు
లొటకలు వేసేటప్పుడు
ఉన్న కన్ను కూడ సున్న' అని రాశాడు.

ఒంటికన్ను కలం రెండో కంటిని కూడా ఎలా కోల్పోతుందో స్పష్టం చేసిన కవిత.

రెండు నాలుకలు అంటే రెండు భాషలు అని అర్థం. ఒకటి పుట్టుకతో వచ్చేది. రెండోది పాఠ్యపుస్తకాలు, పత్రికలు చదివితే వచ్చేది. ఈ రెండో భాష పుట్టు భాషని ప్రతిసారి ఓడిస్తుంది. తల్లి ఒడిని మరిచిన వాడు దేన్నయినా విస్మరించ గలడు. కలానికి భాష కళ్ళ వంటిది. రెండు కళ్ళు కోల్పోయిన కలం ఏం రాస్తుంది. గత ప్రేలాలాపన గురించి తప్ప. కళ్ళముందు కనుపించే సమస్యను చూడ నిరాకరించడమే అసలైన దృష్టిదోషం.

1959లో ఈ భావాన్ని 'మహేంద్రాలో మహాకవులు' అనే కవిత (పే.124)లో మరింత స్పష్టం చేశాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన మూడేండ్లకు రాయబడిన ఈ కవితలో కవిత్వరంగంలో కవులు, రచయితలు ఎలా పాలకవర్గాల గొడుగు కిందకు దూరిపోయారో స్పష్టం చేస్తుంది.

'మహేంద్రంలో మహాకవులకు మేతకనువుగ కూతమారును. రోటి కనువుగ కూతమారును.
చోటు కనువుగ మాటమారును
నెలవుకు అనువుగ చెలిమి మారును'

అని కవుల మీద యుద్ధం ప్రకటించాడు. ఈ మహాకవులలో అభ్యుదయ కవులుగా పేరు పొందినవారు కూడా అధికార ఛత్రచ్ఛాయల కోసం దొంగతనంగా ఎగబడడం చూసిన కాళోజి ఈ కవిత రాయకుండా ఉండలేక పోయాడు. ఎంత మేత వేస్తే అంత. ఏ రోటికాడ ఆపాట. చోటు చూసి మాట. అంటే పాలకుల పాదాల చెంత, వారికి ప్రీతి కలిగించేలా వ్యవహరించాలంటే వారికి అర్థమయ్యే భాషలో మాట్లాడాలి. పొగడాలి. పాదాభివందనాలు చేయాలి. పాలకులు ఏమనుకుంటారో అని భావించిన తెలంగాణ కవులు ఎవరూ అప్పుడు తెలంగాణా భాషలో రాయలేదు. దానిని గమనించి అదే కవితలో మరో చోట ఇలా అంటాడు.

'మహేంద్రంలో మహాకవులకు
తోక ఊపుటె చాక చక్యము' అని
నుదుల సుందరి పదుపు చిందులు
తోక బ్రూటసు, బాకు నాలుక
బూజు మార్గమె రాజ్య మార్గము' అంటాడు

ఆనాటి ఆంధ్రప్రదేశ్‌లో సాహిత్యరంగం ఎలా ఉండేదో ఈ కవితలో విస్పష్టం చేశాడు. ఏ కొత్త దశలోనైనా ఇలాగే కవులు ప్రవర్తిస్తారని కాళోజి కవితల వల్ల అనిపిస్తోంది. కాళోజి భాషని ఇతివృత్తంగా చేసుకుని కవితలు అల్లాడు. వాటిలో వాణీ విలాసం, సరస్వతీ భక్తుల్లారా వ్యవహారికం, తెలుగు బాస ఎన్ని తీర్లు అనేవి ముఖ్యమైనవి.

మొదటి కవిత వ్యవహారికం (పే.151) కవితలో ''మన వ్యవహారానికి లేంది/ వ్యవహరించే భాషకు ఎందుకంటా విశిష్టత?" అని ప్రశ్నించాడు. మనం మనుషులుగా ఒక 'మాట' మాట్లాడుతాం. అది మన తల్లి భాష అయ్యుంటుంది. దానినే గౌరవించని చోట ఆ భాషకు గౌరవం ఎలా తెస్తాం. "భ్రష్టవ్యవ హారానికి కంకణం కట్టుకున్న గరిష్టులు/ దయతో అంగీకరించారట శిష్టవ్యవహారిక భాషకు" ఈ

భావన మన తెలంగాణా భాషకు కూడా వర్తిస్తుంది. శిష్టవ్యవహారిక భాషలో యాసలు, మాండలికాలు ప్రాధాన్యతలు లేవు. కేవలం కోస్తాలో ఆంధ్ర పైవర్గాల వ్యవహారిక భాషే ఉంటుంది. దానిని ఈ కవితలో బద్దలు కొట్టాడు కాళోజి.

తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 1969లో ఊపు అందుకుంటున్న సమయం అది. "కలం గారడీ కైతల వలలల్లకు' అనే కవిత (పే.171)లో కవులనీ, కవులు ఉపయోగించే భాస తీరుని ఎత్తిచూపాడు.

కలం గారడి కైతులల్లకు
గాలాన్ని దాచెడి. ఎరగా మారకు
పదుపుకూడు గౌరవమని భావింపకు
ప్రభుత్వాల మోసాలను ప్రతిభ అనకు
భాష పేర సాలెగూడు భద్రమనకు
'కీలక' కీలలు వసంతాలు అనకు' అని

భాషపై తన పరిశీలనను వ్యక్తం చేశాడు. భాష సాలెగూడు అల్లిక. పరభాషలో జనం కవితని అల్లలేవు. అల్లి అందులో భద్రంగా ఉన్నాననుకోకు కవీ! అని హెచ్చరించాడు. 'కవిగూడ నేతగాడె' (పే.190) కవితలో..

రక్త సిక్త హస్తాలలో ఎగరేసిన
తెల్ల తైని కపోతాలు వాలగ
కూర్చొని పాడగ
కైత; సింగణీల దీర్చు
కవిగూడ నేతగాడె
బహు చక్కని సాలెగూడు అల్లువాడె'

ప్రభుత్వ పక్షంగా కవి అల్లే కవిత సాలెగూడు వంటిది. రక్తసిక్త హస్తాలు పాలకులవి. ఆ హస్తాల దీవనలో అల్లిన కవితలు, వాడిన భాష ప్రజలను ఆకర్షించి బంధించే సాలెగూళ్ళ వంటివే అంటాడు.

'వాణీ విలాసం' (పే.250) మొత్తం కవిత భాషమీద రాసిందే. అందులో కొన్ని చరణాలను చూద్దాం.

ప్రతి నోటికి పట్టుబడియు
ఏ నోటను పడియుండక
రకరకాల యాసతో
బైట పడెడి వైనాలది
వాడుక వేడుక వాణికి
తాతలనాటి పలుకుల పస
నుడికారము వాడి (తోడ) నాడి
నానాటికి నుడుల వడితో
ముఖే ముఖే సరస్వతి
నిఘంటువు తప్ప మరే
కంఠము వాణికి లేదా
గ్రంథస్తము కాని దేది
కంఠస్థముగా కూడదా
వాణి శబ్ద జాలమంత
కోషము లందలిదేనా
రెండున్నర శాతము వారిదే
దండి వాడుక అదేనా భాష
తక్కినోళ్ళను, నోళ్ళ యాసలను
త్రొక్కుటయేనా? నొక్కుట యేనా
మాటమ్మని అమ్మమాట
కాదనుటేపాటి ఒప్పు?
పదముల పదును చెమర్చగ
నుడికారము ఘాటొప్పగ
వడి, వడి వాడుక బడి
మాటల వేడుక తీరగా
నోట నోట మాటమ్మ
ముఖే ముఖే సరస్వతి!

ఈ కవిత భాషా శాస్త్రీయతకు అతి దగ్గరగా ఉంది. నోటి భాష, యాసలను, తద్వారా తెలంగాణ భాషా యాసలను సమర్థించే కవిత ఇది.

కాళోజి కవిత్వంలో వందలాది మాండలిక పదాలను వాడాడు. ఇది పదజాలం కాదా? అది కూడా భాషే అని పలు తావుల్లో ప్రతిపాదించాడు. అందుకే చాలా పదాలు వాడి చూపాడు. ఉదా. చిల్లం (69), గోలెం (69), పీతిరిపాతర (74) నఖరాలు (84) టమారి (89), కోన్ కిస్కా (88) దాపలి, వెలుపలి (110) పెయ్యి (147) వజ్జె (147) వంటి ఎన్నో పదాలను కవిత్వీకరించి చూపాడు. సంస్కృత పద భూయిష్టమైన ఆంధ్రభాషని పూర్తిగా నిరాకరించాడు.

"ఎన్నాళ్ళకు ఎన్నాళ్ళకు
బడి పలుకుల పరిషత్తులో
పలుకు బళ్ళ ప్రతిధ్వనులు' అనే 'బ్రతకలేక బడిపంతుళ్ళైన' కవిత (పే.269) లో ఒక ఉపాధ్యాయ సంఘం సభలో పాల్గొని రాసిన కవిత. ఇందులో 'బడి పలుకులు' ఆంధ్రభాష వినిపించే చోట తెలంగాణ ప్రజల పలుకు బళ్ళ ప్రతిధ్వనులు వినిపించాయని సంతోషిస్తాడు.

'తెలంగాణ వేరైతే' కవిత (పే.345)లో 'తెలంగాణా వేరైతే/ తెలుగు భాష మరుస్తారా" అని రాశాడు. నిజానికి ఇప్పుడు ఆంధ్ర భాష ఆంధ్రులది. తెలుగు తెలంగాణాది. తెలుగంటే తెలంగాణా తెలుగు భాష అని అర్థం. కాళోజి భాష గురించి ఎలాంటి అభిప్రాయం చెప్పినా ఇదే భావనాసూత్రం మీద నిలబడి మాట్లాడాడు.

'అన్యథా శరణం నాస్తి' కవిత (పే.367)లో
"రెండున్నర జిల్లాలది
దండి బాస అయినప్పుడు
తక్కినోళ్ళ నోళ్ళ యాస
నొక్కి పెట్టబడ్డప్పుడు...

ఆంధ్రభాష తెలంగాణా భాషని పనికి రానిదిగా చూసినప్పుడు ప్రత్యేక రాష్ట్రం కోరికలాగే, ప్రత్యేక తెలంగాణ భాష ఉందని ప్రజలు ముక్త కంఠంతో నినదించారు. విచిత్రం ఏమంటే ఎవరైతే ప్రత్యేక తెలంగాణ భాష ఉందని అన్న నాటి రాజకీయ నాయకులు, విద్యావంతులు, నేటి సర్కారీ మేదావులు ఇవ్వాళ కిమ్మనకున్నారు. కాళోజి బతికి ఉంటే ఏం చేసేవాడో తెలియదు. కాని గుండె బాదుకునే వాడు అని మాత్రం చెప్పవచ్చు. కోయ, గోండి, బంజారా వంటి నోటి భాషలు మాండలికాలు కాదు. నోటి 'భాష'లైనా పూర్తి సర్వ స్వతంత్ర భాషలుగానే గుర్తించాలి. ఈ భాషకు లిపులు లేవు. ఐనా పరిపూర్ణమైన భాషలుగా వాటిని గుర్తిస్తాం. వాటిని మాండలికాలు అనం. ఐతే తెలంగాణా తెలుగు భాషకి అక్షరాలు ఉన్నాయి. ఎంతో సాహిత్యం ఉంది. మహా రచయితల వారసత్వం ఉంది. గొప్పగొప్ప మౌఖిక కథనాలున్నాయి. గాయకులు ఉన్నారు. ఈ భాష కేవలం రాజకీయ సంకల్పం లేక మూడేళ్ల నుండి మూలకు నక్కిపోయింది. అది వేరే విషయం.

కాళోజి భావనలో 'తెలుగుభాష ఎన్నితీర్లు' అని ఆ పేరుగ కవితలో ప్రశ్నించాడు. తెలుగు బాష ఎన్ని తీర్లు అడిగి, జవాబుగా "వాడుక లున్నన్ని తీర్లు / 'వాడుక' ఏ తీరుగున్న / తెలుగు బాస వాడుకయే/ అన్ని తీర్ల వాడుకకు" అని భాష విశ్వరూపం గుర్తించాడు.

"వాడుక బాస అంటే
రాయ వచ్చినోడు రాసే
దస్తూరి వలె కాదా?
దస్తూరిలో లిపి వలెనే
మాటల్లో యాస కాదా
దస్తూరీలో అక్షరాల
రూపువలెనే
మాటలు ఉచ్చారణ అవును కదా?" అని

రాస్తూ

తెలంగాణలోనే కాదు చాలా రాష్ట్రాలలో గల తెలంగాణీయుల నోటిభాష యాభై ఆరక్షరాలలో రాయబడుతుందని స్పష్టం చేశాడు.

ఉమ్మడి రాజకీయవాదులను ప్రశ్నిస్తూ 'భాష' అనే ఆయుధంతో వారి రాజకీయ తర్కాన్ని తుత్తునియలు చేశాడు.

"తెలుగు భాష మాట్లాడే
భావ సమైక్యతకై కృషి చేసే
నన్నయని కొలవాలా?" అని ప్రశ్నించాడు.

తెలంగాణా ఉద్యమాన్ని నీరుగార్చడానికి మొన్న చిట్టచివరి ఆయుధంగా ఉమ్మడి పాలకుల

అధినాయకుడు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి డిసెంబర్ 2012, 27-29 తేదీలలో ప్రపంచ తెలుగు మహాసభలను జరిపించాడు.

దీనికి ప్రేరణ మొదటి ప్రపంచ మహాసభలు. వాటిని జలగం వెంగళరావు విప్లవ వాదం, సమైక్యవాదం దిశగా తెలంగాణ కవుల, రచయితల ఆలోచనలను ఏమార్చడానికి జరిపించాడు. భాష, సంస్కృతి, సాహిత్య రంగాలలో తిరిగి ఉమ్మడి భావనలను ప్రవేశ పెట్టడానికి కోట్ల రూపాయలను వెచ్చించి సభలు పెట్టిన సందర్భంగా కాళోజి చూసీ చూడనట్లు లేదు. అందుకే ఇలా రాశాడు.

ప్రపంచ తెలుగు మహాసభలట
ప్రపంచ తెలంగాణ ప్రదేశం
రాజ్యమొకటి ఏర్పడితే
భారత రాజ్యాంగానికి ముప్పొస్తద
ప్రపంచ తెలుగు మహాసభల ముసుగేసుక
'తెలంగాణ' ఏర్పాటు
ఆంధ్రప్రదేశ్ రాజ్యవిభజన
కోరితే ద్రోహమ్మని" చెప్పారు. దీనిని కాళోజి గ్రహించాడు. ఆనాడే కవితా రూపంలో హెచ్చరించాడు.

'కాముడు వలలో' పాట (పే.386)లో
తెలంగాణ పలుకూ వలలో
దేబెల పలుకాయె వలలో
అక్కడి మా యాసంతా వలలో
హేళనా పాలాయె వలలో
రెండున్నర జిల్లాలదే వలలో
దండి బాస ఆయె వలలో

ఈ పాటలో తెలంగాణ భాషకి జరిగిన అవమానాలను ఎత్తిచూపాడు.

'ఏమనాలి' అనే మరో కవిత (పే.404)లో
'తెలంగాణ యాసకిప్పుడు
యీసడించు భాషీయుల
'సుహృద్భావన' ఎంత అని ప్రశ్నించాడు.

'కలం గారడి కాదా' కవిత (పే.414)లో

"తెలుగుతల్లి పేర నేడు ప్రేరణ కలిగింది నీకు, భారతమాతని మరచి పలవరించు తున్నావు'. అని తెలుగుతల్లి విగ్రహం మాటున జరిగే నాటకాలను బహిర్గతం చేశాడు. 'తెలుగుతల్లి పిల్లలం' అనే మాటలో ఉమ్మడి భావన, సమైక్యవాదం ప్రచారం ఉందని, ఆ మాటలోనే 'ముసలం ఉందని" తేట పరిచాడు. 'కొత్వాల్‌సాబ్' కవిత (పే.418)లో ఇది మా ప్రాంతం. బతుకుతెరువు ఇక్కడే కావాలి. మా ప్రాంతంలో మా భాషే ఉండాలి అని ఘీంకరించాడు.

"దోపిడి చేసే ప్రాంతేతరులను
దూరముదాక తన్ని తరుముతము
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాణం తోటే పాతర పెడ్తాం" అన్నాడు.

తెలంగాణపై ఎంత నిష్కల్మషమైన ప్రేమ ఉందో ఈ కవిత వల్ల తెలుస్తుంది. ప్రాంతేతరు లను తన్ని తరుముతం అనే మాటల్లో వారి భాషను కూడా దరిదాపుల్లో ఉంచం అని అంటాడు.

నిజానికి వారిని పంపివేశాం. ప్రస్తుతం మనదే రాజ్యం. మన రాజ్యంలో మనం. కాని మన భాష ఎక్కడ? అనే ఆలోచన కల్పిస్తుంది నా గొడవ. నా గొడవ భాషా క్రాంత దర్శత్వాన్ని ఒంటబట్టించుకోవాలి. భాషను ప్రేమించే తత్వాన్ని నేర్పిన కాళోజీకి జేజేలు పలుకుదాం!

కవిత

## సజీవ స్వరాల యాస!!

-సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

చినుకు భూమిని కరచాలనం చేస్తుంది
చిట పటల చిరు మాటల పలుకుల్తో!!

నీటి పాయ......
వట్టి పోతున్న మట్టి హృదయాన్ని తడిపి
మెత్తని పంటల పానుపు చేయడానికని
గల గల జల జలల పలుకుల్తో
ప్రయాణం సాగిస్తూనే ఉంటుంది!!

ఉప్పుతనం ఉసిగొలిపే దాహాన్ని సహించని
సాగరం అలుపెరుగని అలల అంగలార్పుల్నే
తన స్వభాషా భావంగా నినదిస్తూ ఉంటుంది!!

పచ్చని చిగుళ్లు ఎండుటాకులు పూలు పైర్లు
దేని భాషతో అది అనుక్షణం
గాలితో కబుర్లాడ్తూనే ఉంటుంది!!

శుద్ధ వ్యర్థాల్ని ఎండు మోళ్లని సహించని నిప్పు
ధగ ధగ మంటల మాటల్తో చీదరిస్తూనే ఉంటుంది!!

వేల పక్షుల గళ రవాలు వీనుల విందుల నాదాలయినా
దేని రస రమ్య స్పందనల నాదం దానిదే!

కాకిని కోకిలలా హంసని చిలకా పిచికా చీమా దోమా....
ఏ కీటకమూ అనుకరించాలని ఎగబడి చావదు!!

మమతల మట్టి గూడయిన తల్లి పేగు
బిడ్డల రక్తంలో అదృశ్య ప్రవాహమై
జీవుల స్వరపేటికల రాపిళ్లు
పెదాల పొందికలు శబ్దాలై అక్షరాలై
భావాల్ని గుబాళిస్తూ
ప్రాంతీయ తేజస్సుతో వికశిస్తూ ఉంటుంది!!

అదే వాటి అమ్మ భాష!!
సజీవ స్వరాల యాసల శ్వాస!!

అధికారాలు ధనాగారాలు రాజసాల రోగుల భాషంటే...
నాటక శాలల్లో నటనల కోసం వేషగాళ్లు
అవసరానికి అతికించు కొన్న కృతకపు మూస!!
మట్టి నుండి చెట్టు వేళ్లను లాగా
నీ నుండి నిన్ను తెంచుకొనే మోసం
అనుకరణల పరభాషా వ్యామోహం!!

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు**
**మానసిక వికాసానికి తల్లి భాష.**

# బాబాల ముసుగులో అరాచకాలకు పరాకాష్ఠ 'గుర్మీత్ రామ్ రహీమ్'

-చలసాని నరేంద్ర
98495 69050



భారత దేశంలో ప్రజలలో నెలకొన్న ఆధ్యాత్మికతను ఎందరో బాబాలు ఎంత దారుణంగా తన అరాచక ప్రవృత్తికి సాధనగా వాడుకొంటున్న సంగతి తెలిసిందే. అటువంటి వికృత చర్యలకు పరాకాష్ఠగా హర్యాణా లోని డేరా సచ్చా సౌదా అధిపతి బాబా గుర్మీత్ రామ్ రహీం సింగ్ అని చెప్పవచ్చు. ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో ఎన్ని ఘోరమైన నేరాలు చేసినా తమకు ఎదురు లేదని, తమను ప్రశ్నించే వారే లేరని ఈ దేశంలో ఎందరో బాబాలు విర్రవీగుతున్నారు. అటువంటి వారిలో ఇతను ఒకరని ఇప్పుడు వెల్లడైంది.

ఒక మహిళ తెగించి తనకు జరిగిన అన్యాయాన్ని ప్రధాని నుండి, హై కోర్టు వరకు అజ్ఞాత లేఖలో వివరిస్తే, హై కోర్టు న్యాయమూర్తి సిబిఐ దర్యాప్తుకు ఆదేశించడం, సిబిఐ ఎంతో శ్రమపడి, ఆమె ఆచూకీని కనుగొని కోర్టు ముందు బాబాను దోషిగా నిలబెట్టడం, దానితో 15 ఏళ్ళ అనంతరం సిబిఐ కోర్టు దోషిగా నిర్ణయించడం అంతా చక చక జరిగి పోయింది. రెండు అత్యాచార నేరాలకుగాను 20 సంవత్సరాల శిక్షను విధించడం కూడా వెంటవెంటనే జరిగి పోయింది. బలవంతుల దౌర్జన్యాల నుండి న్యాయం కోసం ఈ దేశంలో ఒక నిస్సహాయురాలైన మహిళ ఎంతగా కష్టపడాలో ఈ సంఘటన వెల్లడి చేస్తుంది.

సీబీఐ కోర్టు దోషిగా తేల్చడంతో ఆ బాబా అనుయాయులు రెచ్చిపోయారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో భారీ విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ అల్లర్లు పొరుగు రాష్ట్రాలకు కూడా విస్తరించాయి. ఈ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో శుక్రవారమే 36మంది వరకు చనిపోగా, 300 మంది వరకు గాయపడ్డారు. డేరా అనుచరుల అరాచకత్వంతో ప్రజాజీవనం నాలుగైదు రాష్ట్రాలలో అల్లకల్లోలమైపోయింది. కోట్ల విలువైన ఆస్తులు బుగ్గిపాలయ్యాయి. రైళ్లు, బస్సులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి.

తనతోపాటు మరో మహిళా సేవకురాలిపై బాబా గుర్మీత్ లైంగికదాడి జరిపారంటూ 2002లో డేరా ఆశ్రమంలో పనిచేసే గుర్తుతెలియని యువతి రాసిన లేఖ ఆధారంగా సీబీఐ దర్యాప్తు జరిపింది. ఈ కేసులో రాంరహీం నేరానికి పాల్పడ్డారని సీబీఐ జడ్జి జగదీప్‌సింగ్ నిర్ధారించారు. ప్రభుత్వం తగిన నిషేధాజ్ఞలు విధించక పోవడం, బాబా అనుచరులు విధ్వంసానికి పాల్పడే అవకాశాలు ఉన్నా, అడ్డుకోకపోవడంతో భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చింది.

**ముఖ్యమంత్రి అసమర్థత**

సీబీఐ కోర్టు దోషి అని తేల్చడానికి రెండు, మూడు గంటల ముందు హై కోర్టులో ఉదయం 11.30 గంటలకు హర్యానా అడ్వకేట్ జనరల్ బి ఆర్ మహాజన్ నిలబడి ఒక బహిరంగ పార్కు, ఒక కమ్యూనిటీ హాలులలో తప్ప, వచ్చిన గుంపులు అన్నింటిని పంచకుల నుండి ఖాళీ చేశామని, జనం ఎవ్వరు లేరని అంటూ ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు.

ఆ రోజు కోర్టు తీర్పు ఇస్తుందని వారం రోజుల ముందే తెలిసినా ప్రభుత్వం ఎటువంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. వారం రోజులుగా వేల సంఖ్యలో గుర్మీత్ భక్తులు, మద్దతు దారులు చేరుతూనే ఉన్నారు. వారు పెద్ద ఎత్తున దాడులకు పాల్పడడానికి సిద్ధ పడుతు న్నారని అంటూ స్థానిక న్యాయవాది రవీంద్ర ధూల్ హై కోర్టును ఆశ్రయించారు. హింస జరుగకుండా నిరోధించడం కోసం "ఎటు వంటి ఆయుధం ఉపయోగించడానికైనా వెనుకాడకండి" అంటూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. డేరా మద్దతు దారులతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కు అవుతున్నట్లు హైకోర్టు బెంచి ఆరోపించినా ప్రభుత్వంలో కదలిక కనిపించలేదు.

కేంద్ర బలగాలు సిద్ధంగా ఉన్నా సాయంత్రం వరకు వాటిని రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించనే లేదు. అప్పటి వరకు ప్రేక్షక పాత్ర వహిస్తూ వస్తున్న ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టార్ తీర్పుకు కొద్ది నిముషాల ముందే ప్రజలు 'శాంతియుతం'గా ఉండాలంటూ విజ్ఞప్తి చేశారు. పైగా ముందు రోజు కూడా రాష్ట్ర మంత్రి రామ్ బిలాస్ శర్మ "డేరా భక్తులు అందరూ శాంతికాముకులు" అంటూ సర్టిఫికెట్ ఇచ్చారు. వారంతా 'ప్రభుత్వ అతిధులు' అని, వారికి ఆహారం, నీరు సమకూర్చవలసిన బాధ్యత కూడా తమదే అంటూ చెప్పుకొచ్చారు.

పోలీసులకు ఆదేశాలిస్తే గుంపులు చేరకుండా ముందే నిరోధించే వారు. అయితే 2014 ఎన్నికల్లో బిజెపికి గుర్మీత్ మద్దతు ఇవ్వడంతో ఆయన మద్దతు దారులు విధ్వంసం సృష్టించడానికి సిద్దమవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించింది. ఎన్నికల ఫలితాలు రాగానే పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జ్ కైలాష్ విజయవర్గీయ నాయకత్వంలో 19 మంది శాసన సభ్యులు వెళ్లి బాబాకు కృతజ్ఞతలు తెలిపారు. వారిలో ఇప్పుడు ముగ్గురు మంత్రులు,

ఒకరు స్పీకర్.

ఇంతటి హింసాకాండకు పాల్పడుతున్నా, విధ్వంసానికి ఎవ్వరు దిగినా సహింపబోమని ప్రధాని గాని, కేంద్ర హోంమంత్రి గాని, ముఖ్యమంత్రి గాని గట్టి మాటలతో హెచ్చరించే ప్రయత్నం చేయక పోవడం గమనార్హం. పైగా బిజెపి యంపీ సాక్షి మహారాజ్ రెండు కోట్ల మంది భక్తులున్న సాధువుకు ఇద్దరు ఆడవాళ్లు సాక్ష్యం చెప్పారని దోషిగా కోర్టు నిర్ణయిస్తుందా అంటూ బహిరంగంగా పేర్కొనడం చట్టబద్ధ పాలనపట్ల ఈ ప్రభుత్వానికి నమ్మకం లేదా అనే అనుమానం కలిగిస్తుంది.

కేవలం బిజెపి మాత్రమే కాదు. హర్యానాలోని అన్ని రాజకీయ పార్టీలు గుర్మీత్ మద్దతు కోసం, ఆదరణ కోసం తిరుగుతున్న వారే. ముఖ్యంగా  మీడియా వారిని లక్ష్యంగా చేసుకొని విధ్వంసకారులు దాడులు జరిపారు. ఐదు రాష్ట్రాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. రాష్ట్ర డిజిపి బి ఎస్ సంధు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవ డానికి సిద్దంగా ఉన్నామని వారం రోజులుగా చెబుతున్నా, తీరా సమస్య వచ్చే సరికి దిక్కుతోచకుండా ఉండిపోయారు.

మొదటిసారిగా శాసన సభకు ఎన్నికైన ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టార్‌కు ఎటువంటి పాలనా అనుభవం లేకపోవడంతో ఇది మొదటి సారి కాదు, మూడవసారి ఆయన అసమర్ధత కారణంగా విధ్వంసాలకు అవకాశం ఏర్పడింది. మొదటిసారి, 2014లో ఒక పరువునష్టం కేసులో హైకోర్టు ముందు గుర్మీత్‌ను ప్రవేశ పెట్టడం కోసం 14 రోజుల పాటు సాయుధ దళాలు ఘర్షణకు దిగవలసి వచ్చింది. ఈ సందర్భంగా ఐదుగురు మహిళలతో సహా ఐదుగురు అతని భక్తులు చనిపోవడంతోపాటు, సాయుధ దళాల మోహరింపుకు ప్రభుత్వానికి రూ 26 కోట్ల ఖర్చు అయింది.

ఆగష్టు 18న ఒక హత్యాచారం కేసులో గుర్మీత్ కోర్టుకు హాజరు అవుతూ ఉంటే ఆ రోజే తీర్పు ఇవ్వనున్నారనుకొని వందలాది మంది మద్దతుదారులు సీబీఐ కోర్టులోకి చొచ్చుకు వచ్చి హల్‌చల్ చేశారు. ఆ అనుభవంతో అయినా ఇప్పుడు జాగ్రత్తపడే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. గత సంవత్సరం రైతులు ఆందోళన సందర్భంగా ప్రభుత్వ నిర్వాకం కారణంగా పోలీస్ కాల్పులు జరిపి, ఆరుగురు రైతులను పొట్టన పెట్టుకోవలసి వచ్చింది.

ఈ విధ్వంసకాండను బాబా మద్దతుదారులు ముందుగా వేసు కున్న పథకం ప్రకారమే జరిపినట్లు స్పష్టం అవుతున్నా, 'కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు' చేరి విధ్వంసం సృష్టించినట్లు ముఖ్యమంత్రి మాట్లాడటం దేరా బాబా అకృత్యాలకు ప్రభుత్వం మద్దతుగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది.

**ఆందోళనకారులకు ప్రభుత్వం  దాసోహం**

"మీ రాజకీయ ప్రయోజనాల కోసం పంచకుల పట్టణాన్ని తగలెట్టేశారు. ఆందోళనకారులకు ప్రభుత్వం దాసోహమైనట్లు కనిపిస్తోంది" అంటూ హర్యాణా ప్రభుత్వాన్ని పంజాబ్, హర్యాణా హైకోర్టు తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. ప్రధాని మోదీని సైతం వదలకుండా ఘాటు వ్యాఖ్యలు చేసింది.

దేరా బాబాపై తీర్పు నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని దాఖలైన పిల్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్. సింగ్‌సరోన్, జస్టిస్ అవినాశ్ ఝింగాన్, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ఫుల్ బెంచ్ శనివారం ప్రత్యేకంగా సమావేశమై విచారించింది.

ఈ సందర్భంగా హర్యాణా ప్రభుత్వ అసమర్థతను హైకోర్టు ఎండగట్టింది. "ఒక చిన్న డీసీపీని బలి తీసుకోవడానికి మీరు ప్రయత్నిస్తున్నారు. మరి, తప్పుడు ఆదేశాలు ఇచ్చిన రాజకీయ మాస్టర్ల సంగతి ఏమిటి?" అని నిలదీసింది. 'ఇది ఓటు బ్యాంకును ఆకర్షించ డానికి జరిగిన రాజకీయ లొంగుబాటు' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది.

కేంద్రం తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ సత్యపాల్ జైన్.. "హింసాత్మక ఘటనలను అదుపు చేయాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వా"దని వ్యాఖ్యానించారు. దీనిపై హైకోర్టు ఘాటుగా స్పందించింది. "హరియాణా ఇండియాలో భాగం కాదా!? హరియాణా, పంజాబ్‌ను సవతి పిల్లలుగా చూస్తారా? మోదీ కేవలం బీజేపీకి మాత్రమే కాదు. ఆయన దేశం మొత్తానికి ప్రధాన మంత్రి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది.

ఆస్తుల నష్టానికి సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి.. ఆ నష్టాన్ని దేరా బాబా ఆస్తులను జప్తు చేయడం ద్వారా రికవరీ చేయాలని ప్రకటించింది. రాజకీయ, మత, సామాజిక నేతలు ఎవరూ రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని, అలా చేస్తే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది.

**పారిపోవాలని ప్రయత్నించిన బాబా**

సీబీఐ కోర్టు గుర్మీత్ దోషి అని తేల్చిన తరువాత అతనిని తప్పించాలని అతని రక్షణ కోసం ఏర్పాటు చేసిన భద్రతా సిబ్బందే ప్రయత్నించడం అతని పలుకుబడి ఎంతటిదో తెలుపుతుంది. హర్యానా పోలీసులే ఈ విషయాన్ని వెల్లడించారు. గుర్మీత్‌కు రక్షణగా ఉన్నది హర్యానా పోలీసులే. వాళ్లతోపాటు మరి కొందరు ప్రైవేట్ సిబ్బంది కూడా ఉన్నారు. కోర్టు తీర్పు తర్వాత అతను తన ప్రైవేట్ వాహనంలో తప్పించుకుని వెళ్లేలా పథకం వేశారు.

గుర్మీత్‌ను జెడ్ ప్లస్ సెక్యూరిటీ సహా అక్కడి నుంచి తప్పించి అతనికి మద్దతుగా ఉన్న లక్షల మంది అనుచరుల మధ్యలోకి తీసుకెళ్లాలని చూశారు. అదే జరిగి ఉంటే అతన్ని అరెస్ట్ చేయడం తమకు చాలా కష్టమయ్యేది అని ఓ హర్యానా పోలీస్ అధికారి వెల్లడించారు. ఈ విషయాన్ని పసిగట్టి అక్కడే ఉన్న కొందరు పోలీస్ అధికారులు, పారామిలిటరీ సిబ్బంది గుర్మీత్‌ను కస్టడీలోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా అతని ప్రైవేట్ భద్రత సిబ్బందితో వాళ్లకు కాస్త గొడవ కూడా జరిగింది. వెంటనే వారిని పక్కనే ఉన్న మరో గదిలో బంధించారు. వాళ్లపై హత్యాయత్నం, దేశద్రోహం, పోలీస్ అధికారులు తమ విధులు నిర్వహించకుండా అడ్డుకున్న కేసులు వారిపై నమోదు చేశారు. వాళ్లందరినీ అరెస్ట్ చేసి వారం రోజుల పోలీస్ రిమాండ్‌కు తరలించారు.

గుర్మీత్‌ను పోలీస్ వాహనంలో తీసుకెళ్లకుండా కూడా వాళ్లు అడ్డుకున్నారని, వాహనానికి అడ్డంగా పడుకున్నారని ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఓ అధికారి చెప్పారు. గుర్మీత్ ప్రైవేట్ సెక్యూరిటీగా ఉన్న ఏడుగురిని అరెస్ట్ చేశారు.

**డేరా బాబా అంతులేని నేరాల జాబితా !**

అసలు గుర్మీత్ సింగ్ ఎవరు? ఆగస్టు 15, 1967న రాజస్థాన్ గంగానగర్ జిల్లాలోని శ్రీగురుసర్ మోదియా గ్రామంలో జన్మించారు. ఈయన తండ్రి భూస్వామి. అప్పుడప్పుడు వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. గుర్మీత్ ఎప్పుడు ఆధ్యాత్మిక చింతనలో మునిగితేలేవాడు. పంజాబ్‌లోని సిర్సాలో ఉన్న డేరా సచ్చా సౌధా ఆశ్రమ గురువు షా సత్నాం సింగ్ గుర్మీత్‌ను 7 సంవత్సరాల వయసులోనే చేరదీశాడు. ఆ సమయంలో గుర్మీత్ పేరును రామ్ రహీమ్‌గా మార్చి, 16 ఏళ్ళ తర్వాత 1990లో తన వారసుడిగా ప్రకటించాడు. అప్పుడు రామ్ రహీమ్ వయసు 23 ఏళ్లు.

అప్పటికే తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్న రహీమ్ హర్జీత్ కౌర్ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లాడు. డేరా సచ్చా సౌధ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాడు గుర్మీత్. పేద పిల్లలకు విద్యను అందించడం, రక్త దానం, అవయవ దానం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇందులో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసేవాడు. ఇతని ఉపన్యాసాలతో పలువురిని సేవా కార్యక్రమాలకు ప్రేరేపించేవాడు. గుర్మీత్ ఇప్పటి వరకు రెండు సినిమాలు చేశాడు. అవి.. ఎంఎస్‌జీ (మెసెంజర్ ఆఫ్ గాడ్), ఎంఎస్‌జీ 2.

గుర్మీత్ రామ్ రహీం సింగ్ తన గురించి ఆధ్యాత్మిక సాధువు, దాత, ప్రముఖ గాయకుడు, క్రీడాకారుడు, సినిమా డైరెక్టర్, నటుడు, ఆర్ట్ డైరెక్టర్, సంగీత దర్శకుడు, రచయిత, గీత రచయిత, ఆటోబయోగ్రాఫర్ అంటూ తన ట్విట్టర్ అకౌంట్‌లో వ్రాసుకున్నాడు. ట్విట్టర్‌లో 37.40 లక్షల మంది ఫాలోయర్స్ ఉన్నారు. దేశం మొత్తం మీద 46 ఆశ్రమాలు ఉన్నాయి. దేశ, విదేశాలలో ఐదు కోట్లమంది వరకు భక్తులు ఉన్నారని అంటారు.

ఇక సిర్సాలోని గుర్మీత్‌కు ఒక పెద్ద టౌన్‌షిప్ ఉంది. వేయి ఎకరాల స్థలంలో నిర్మించిన టౌన్‌షిప్‌లో పాఠశాలలు, స్పోర్ట్స్ విలేజ్, ఆస్పత్రి, సినిమా హాలుతోపాటు ఇతర భవనాలు ఉన్నాయి. డేరాలోకి రాజకీయ నేతలు రావడం సహజమే. కానీ వారు వస్తున్న విషయం మూడో కంటికి తెలియదు. ఆయనపై అనేక నేరారోపణలు, కేసులు ఉన్నా దోషిగా తేల్చడం మాత్రం ఇదే. మొదటగా 1998లో ఆయన ఆశ్రమానికి చెందిన జాబ్‌లో బేగు గ్రామంలో ఒక బాలుడు చనిపోవడంతో పెను వివాదం చెలరేగింది. అయితే నిరసన తెలిపిన గ్రామస్థులను బెదిరించారు. వార్తలు వ్రాసిన విలేఖరులను హెచ్చరించారు.

ప్రస్తుతం దోషిగా సిబిఐ కోర్టు నిర్ధారించిన మానభంగం కేసు గురించి గతంలో ఆయన ఆశ్రమంలో ఉన్న ఒక సాధ్వి వ్రాసినదిగా భావిస్తున్న ఒక అజ్ఞాత లేఖ రూపంలో హైకోర్టుకు 2002లో చేరింది. ఆ లేఖ వ్రాసినది కురుక్షేత్రకు చెందిన రంజిత్ సింగ్ కావచ్చునే అనుమానంతో రెండు నెలల తరువాత జులై, 2002లో చంపివేశారు. డేరా ఆశ్రమంలో జరుగుతున్న అక్రమ చర్యల గురించి కథనాలు వ్రాసిన స్థానిక జర్నలిస్టు రామ్ చందర్ ఛత్రపతి అక్టోబర్, 2002లో హత్యకు గురయ్యాడు. డేరా మద్దతు దారులుగా భావిస్తున్న వారు కాల్చి చంపారు. ఈ హత్యపై సిబిఐ కోర్టులో చివరి వాదనలు సెప్టెంబర్ 16న ప్రారంభం కానున్నాయి.

మే, 2007లో పంజాబ్ లోని బథిండా లో జరిగిన తన మద్దతు దారుల సమావేశంలో సిఖ్ గురువు గురు గోబింద్‌సింగ్ డ్రెస్ వేసుకొని పాల్గొనడం పెద్ద వివాదానికి దారితీసింది. అతని మద్దతుదారులకు, సిఖ్ ప్రదర్శకులకు మధ్య ఘర్షణలు జరగడంతో, అతనిపై ఒక క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఒక నిరసన ప్రదర్శన సందర్భంగా అతని మద్దతుదారులు జరిపిన కాల్పులలో కోమల్ సింగ్ అనే యువకుడు మృతి చెందాడు. అతనిని అరెస్టు చేయమని సిఖ్ సంస్థలు పెద్ద ఆందోళన జరిపాయి. కానీ పంజాబ్‌లో ప్రవేశించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది.

జులై, 2007లో అతనిపై నమోదైన మానభంగం, లైంగిక వేధింపుల కేసుల విచారణ కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొన వలసి వస్తుందని అంటూ జులై, 2007లో ప్రత్యేక సిబిఐ కోర్టు జడ్జి బెదిరింపు లేఖను అందుకున్నారు. మాజీ డేరా మేనేజరు ఫకీర్ చాంద్ అదృశ్యంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ మరో మాజీ మేనేజర్ రామ్ కుమార్ బిష్ణోయ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు ఆదేశంపై విచారణ జరిపిన సిబిఐ సాంక్ష్యాలు లేవంటూ కేసు మూసివేసింది. కానీ రామ్ కుమార్ హైకోర్టులో అప్పీలుకు వెళ్ళాడు.

400 పురుష భక్తుల పురుషాంగాలను కోసి వేశారని అంటూ జులై, 2012లో ఫాతేహాబాద్ జిల్లాకు చెందిన హన్సరాజ్ చౌహాన్ హై కోర్టులో పిటిషన్ వేశారు. మహిళా భక్తులతో లైంగిక సంబంధాలు ఏర్పరచుకోకుండా అట్లా చేశారని అన్నారు. ఇంకా ఆ కేసు విచారణలో ఉంది. ఆశ్రమంలో ఆయుధాలు కలిగి ఉన్నాడని, తన మద్దతు దారులకు ఆయుధాలు వాడకంపై శిక్షణ ఇస్తున్నాడని అంటూ 2014లో వచ్చిన పిటిషన్ పై స్థానిక పోలీసుల నుండి హైకోర్టు నివేదిక కోరింది.

అతని చిత్రం "మెస్సెంజర్ అఫ్ గాడ్" కు అనుమతి ఇవ్వడంతో 2015లో సెన్సార్ బోర్డు అధ్యక్షురాలు లీల శాంసన్, సభ్యుడు ఇరా భాస్కర్ తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ చిత్రం రెండో భాగంలో తానే 43 పాత్రలు పోషించడం ద్వారా రికార్డులకు ఎక్కాడు. ఒక టివి షో లో గుర్మీత్‌ను మిమిక్రీ చేసాడనే ఆరోపణపై ప్రముఖ హాస్య నటుడు కిక్కు శ్రద్ధను హర్యానా పోలీసులు ముంబై వెళ్లి అరెస్ట్ చేసి, 14 రోజులు జైలులో ఉంచారు.


**నడుస్తున్న చరిత్ర** (2013 నవంబరు వరకు)

**అమ్మనుడి** (2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని,**

**సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని**

**కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,

హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 98480 16136, 0866-2439466




# 5. భౌతికం- భావజాలం- శాస్త్రీయం

**బౌద్ధం**లోని "ప్రతీత్యసముత్పాదం" అనేది చాలా విలువైన సిద్ధాంతం. వైజ్ఞానిక ప్రపంచానికి తలుపులు తెరచిన తొలి ప్రస్థానం. ఆత్మ, దేవుడు అనే మాయపొరలు కమ్మి ఉండేవాళ్ళు ఇలాంటి విప్లవాత్మక సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేరు. అనాత్మవాది, క్షణికవాది అయిన మహావైజ్ఞానికుడు మాత్రమే ఇలాంటి సిద్ధాంతాన్ని ఆవిష్కరించగలడు. చరిత్రలో అది బుద్ధుడు చేశాడు. ఈ విషయం మీద గతంలో నేను ఒక పుస్తకమే రాశాను. "బౌద్ధం ఇప్పటికీ అవసరమా?" అనే ఆ పుస్తకంలో ఈ విషయం మీద చర్చించాను. దాన్ని మరలా ఇక్కడ చెప్పడం 'పాడిందే పాడటం-" అవుతుంది. అయితే- బుద్ధుడు ఖచ్చితమైన శాస్త్రీయవాది అనడానికి ఒక విషయాన్ని ఎంచుకొని, దాన్ని పరిశోధించే పద్ధతిలోనే ఆ విషయం తేటతెల్లమవుతోంది.

శాస్త్రీయ విధానాన్ని ఆవిష్కరించడానికి నాలుగు మెట్లు ఉంటాయి. ఆధునిక శాస్త్రాలన్నీ ఈ నాలుగు అంచెలమీదే ముందుకు సాగుతున్నాయి. అవి-

1. సమస్య గుర్తించడం
2. సమస్యకి మూల కారణాల్ని తెలుసుకోవడం
3. దానికి పరిష్కార మార్గాలు అన్వేషించడం
4. పరిష్కారాన్ని సాధించడం.

అలాగే... పరిశీలన, ప్రయోగం, ఫలితం, అనుమతి- అనే నాల్గు విధాలుగా సిద్ధాంతం రూపొందించబడుతుంది.

ఇప్పుడు అసలు విషయం చూద్దాం.

బుద్ధుడు దుఃఖాన్ని గురించి చెప్పినవాటిని చతురార్య సత్యాలు అంటారు. అవి ఇవి

1. దుఃఖం ఉంది. (సమస్య గుర్తించడం)
2. దుఃఖానికి కారణం ఉంది. (సమస్యకు కారణాల్ని గుర్తించడం)
3. దుఃఖాన్ని నివారించగలం (పరిష్కారం అన్వేషించడం),
4. దుఃఖ నివారణా మార్గం ఉంది. (పరిష్కారాన్ని సాధించడం. బౌద్ధంలో ఆ మార్గమే అష్టాంగమార్గం )

అంటే- ఈ దుఃఖ విషయాన్ని బుద్ధుడు భౌతిక దృష్టితోనే స్వీకరించాడు. ఇది అభౌతికం కాదు. ఎందుకంటే ...మనిషికి దుఃఖం ఉంది. అంటే మనిషి అనేవాడు ఉన్నాడు. ఉన్నాడు కాబట్టి దుఃఖం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే....మనిషి అనే భౌతిక వాస్తవానికి కలిగిన భావావేశమే దుఃఖం. ఈ దుఃఖానికి దేవుడు, పరమాత్మ, పునర్జన్మలు కారణం అని బుద్ధుడు అనుకొని ఉంటే, ఇక బుద్ధునితో ఈ శాస్త్రీయ ప్రపంచానికి అవసరం ఏముంది? ఆయన ఈ ప్రపంచ ప్రగతికి చేసేది ఏముంటుంది?

చూడండి. 'దుఃఖాలకి దేవుడే కారణం, లేదా తలరాతే కారణం' అనుకునేవారు దేవుణ్ణి వేడుకుంటారు. సాగిలపడతారు. లంచాలు (మొక్కుబళ్ళు) సమర్పిస్తారు. ఆయన్ని కీర్తిస్తూ సంకీర్తనలు పాడతారు. చెక్కభజనలు చేస్తారు. అందుకే వారిది అభౌతికం. ఆధ్యాత్మికం.

కానీ , బౌద్ధం ప్రకారం దుఃఖం భౌతికం. కాబట్టి , భౌతిక పదార్థాలనుండి పుట్టిన దుఃఖానికి ఆ భౌతిక పదార్థాల్లోనే కారణం వెతకాలి. అలా వెతకటమే శాస్త్రీయం.

ఎలాగంటే...

విజయవాడనుండి గుంటూరుకు పోయేదారిలో మనం ఒక వస్తువును పోగొట్టుకుంటే ఆ దారిలోనే వెదకాలి తప్ప విజయవాడ- మచిలీపట్నం, విజయవాడ - హైదరాబాద్ దారుల్లో వెతక్కూడదు. ముందుగా మనం చేయాల్సిన పని ఇదే.

ఈ పనిచేయడంలో మానవ సమాజాలు మొదట్లోనే దారి తప్పాయి. దానికి కారణాలు ఎన్నెన్నో. అవి చర్చించడం ఇక్కడ అంత అవసరం కాదు. ఇక్కడ తెలుసుకోవాల్సింది ఒక్కటే, "బుద్ధుడు దారి తప్పి వెదకకుండా దారిలోనే వెదికే పనిని ప్రారంభించాడు. ఆ పద్ధతి ఈ ప్రపంచానికి నేర్పాడు. దుఃఖాన్ని భౌతికం గానే చూశాడు. భౌతిక సమాజాల పరంగానే విశ్లేషించాడు. ఆ దృక్పథమే బుద్ధుణ్ణి అనుత్తరుణ్ణి చేసింది. బౌద్ధాన్ని అజరామరంగా నిలిపింది.

బుద్ధుడు దుఃఖం అనే భావానికి మనిషి మనస్సే (ఆలోచనల సమన్వయ కేంద్రం) మూల కారణం అని గ్రహించాడు. సమస్యను "దేవుడు" అనే అభౌతిక అంశాన్నుండి 'మానవుడు' అనే భౌతిక అంశంలోకి మార్చాడు. మనిషిలో కూడా ఆలోచనల సమన్వయ కేంద్రమైన మనస్సును అందుకు మూలం చేశాడు.

**మనో పుబ్బంగమా ధమ్మా, మనో సేట్ఠా మనోమయా...**

అంది ధమ్మపదం. అంటే..అన్నిటికీ అగ్రగామి మనసే..అని.

అందుకే బౌద్ధం మానవలోక సిద్ధాంతం అయింది. అదే సత్యం కాబట్టి దైవకేంద్ర సిద్ధాంతం తల్లక్రిందులైంది. బద్దలై బీటలు వారింది. కేవలం నమ్మకంగానో, లేదంటే మూఢనమ్మకంగానో మిగిలి పోయింది. హింసలతో, దౌర్జన్యాలతో కాలం నెట్టుకొస్తోంది.



కాబట్టి బౌద్ధలో ఒక అంశాన్ని గ్రహించడంలో, దాన్ని విశ్లేషించ డంలో, దాన్ని పరిశీలించడంలో, పరిశోధించడంలో– ఏ విధానంతో చూసినా అడుగడుగునా శాస్త్రీయతే తొణికిసలాడుతూ ఉంటుంది.

**భౌతికం– భావజాలం**

బుద్ధునిది శాస్త్రీయ ఆలోచన మాత్రమేకాదు. ఆచరణ కూడా. 'చెప్పిందొకటి, చేసిందొకటి" అనేది ఏ మూలనా ఆయనలో కన్పించదు. ఏ విషయాన్నీ పైపైన అంచనాలువేసి మాట్లాడే సందర్భాల్నీ బుద్ధునిలో చూడలేం. అది భౌతికమా, వైజ్ఞానికమా, నైతికమా.... ఏదైనాసరే.. లోతుల్లోకి పోయి కార్యకారణ సంబంధంగా పరిశోధించి వ్యాఖ్యానిస్తాడు. ఆచరణ సాధ్యంకానిదీ, పారలౌకిక విషయాలుగా చెప్పిందీ... ఒక్కటంటే ఒక్క విషయం కూడా ఆయన బోధనల్లో చూడలేం.

అయితే, బుద్ధుడు కేవలం వైజ్ఞానిక శాస్త్రవేత్త కాదు. సైన్సు ప్రచారకుడు అంతకంటే కాదు. అన్ని కోణాల్నీ శోధించిన తత్త్వవేత్త. నైతిక ప్రయోక్త. ఆయన తాత్త్విక దృక్పథంలో సైన్స్ కూడా ఒక కోణం. అంతే!

ఆ కోణం అవసరం అయినప్పుడు దానికంతట అదే బైటకు వస్తుంది.బుద్ధుడు శాస్త్రీయ దృక్పథానికి అవసరం అయిన **ప్రత్యక్ష ప్రమాణాన్నే** ప్రధానంగా తీసుకున్నాడు. ప్రత్యక్ష ప్రమాణంతో విడదీయరాని సంబంధం ఉంది కాబట్టి **అనుమాన ప్రమాణాన్ని** కూడా స్వీకరించాడు. ఆ రెండూ తప్ప **శబ్ద ప్రమాణాన్ని** అంగీకరించలేదు. శబ్ద ప్రమాణం అంటే మరొకరు చెప్పే విషయాలు, మత గ్రంథాలలో ఉన్న అంశాలు.

'దేవుడు ఉన్నాడని వేదం చెప్పింది. వేదం పరమ ప్రమాణం. అది అపౌరుషేయం. దేవుని వాక్కు. కాబట్టి అందులో ఉంది కాబట్టి నమ్మాలి– వేదాన్ని ప్రశ్నించకూడదు' అనే వాదాన్ని బుద్ధుడు అంగీకరించలేదు. అలాగే,పండిత ప్రయోగాలు కూడా. 'ఆయన ఒక మహాజ్ఞాని, సర్వజ్ఞుడు, మహా పండితుడు కాబట్టి ఆయన ఏది చెప్పినా నమ్మాల్సిందే!" అనే దాన్నీ ఒప్పుకోలేదు.

ఇలా ఈ శబ్ద ప్రమాణాన్ని, **గ్రంథ ప్రమాణాన్ని** తీసి ప్రక్కన పెట్టాడు. ఈ రెండే అభౌతికమైన దైవాన్ని, ఆత్మను బ్రతికించే ప్రమాణాలు.

నిజానికి మనం లేనిది చెప్పేవాళ్ళని గోబెల్స్ అంటాం. గోబెల్స్ ప్రచారాల్ని నమ్మకూడదంటాం. ఈ శబ్ద ప్రమాణం కూడా అలాంటిదే. దీనికి ఒక ప్రామాణికత లేదు. కేవలం అసత్యం మీదే బ్రతుకుతుంది.

"దున్నపోతు ఈనింది" అంటే నమ్మాల్సిందే! "ఎలా సాధ్యం?" అని అడిగితే...

"సత్యయుగం.... దైవ మహిమ....కలికాలం... ఈ కాలంలో సత్యం ఒంటికాలు పై కుంటడం..." ఇలా చెప్పేస్తారు. ఇలాంటి వారు చెప్పిన కథల్లో... ఎంతమంది పురాణ పురుషులు, అమ్మానాన్నలకు కాకుండా, అమ్మ కడుపునుండి పుట్టకుండా... ముక్కుల్లోంచి, చెవుల్లోంచి, జుట్టులోంచి, బొడ్డులోంచి, నోట్లోంచి, చంకల్లోంచి, వంటిమీది మట్టినుంచి పుట్టలేదు?

ఇవన్నీ! నిరూపణకి సాధ్యం కావు. ప్రత్యక్ష ప్రమాణాలూ కావు. కేవలం శబ్ద ప్రమాణాలే. వీటిమీద నమ్మకం ఉండాల్సిందే కానీ– ఇవి ఎప్పటికీ నిజాలు కావు.నిరూపణలకి సాధ్యమూకావు.

అదేమంటే... "అది సత్యకాలం- ఇది కలికాలం" అని బుకాయింపులు–

ఇలాంటి బుకాయింపుల్ని, ప్రచారాల్నీ బుద్ధుడు ఆనాడే ధైర్యంగా, తీవ్రంగా తిప్పికొట్టాడు. అయితే, ఆయన ప్రత్యర్థులతో బాహాబాహీ గొడవలు పడేవాడు కాదు. వారు 'ఉత్త అజ్ఞానులని' నిందించేవాడూ కాదు. వారిని దూషించి, హేళన చేసి, ఎద్దేవాగా మాట్లాడి దూరం చేసుకునేవాడూ కాదు.

"వారిలో ఉన్న అజ్ఞానాన్ని తొలగిస్తే వారే ఆలోచిస్తారు. జ్ఞానం పొందుతారు. అప్పుడు ఇలా మూర్ఖంగా ఉండరు.నమ్మరు.వితండంగా వాదించరు. " అనేవాడు. తప్పనిసరిగా వాదానికి దిగవలసివస్తే వారితో అనునయంగానే వాదం చేసేవాడు. వారితోనే 'తాము అనుసరించే విధానం తప్పు' అని చెప్పించి, ఒప్పించేవాడు. ఓడించే వాడు కాదు. జ్ఞానోదయం కలిగించేవాడు.

మొత్తం బౌద్ధం చరిత్రలో, బుద్ధుడు తన 45 ఏళ్ళ భిక్షు జీవితంలో ఎందరెందరితోనో వాదనలు చేశాడు–

వారందరూ తమ తప్పును, తమ అశాస్త్రీయ ఆలోచనల్ని తామే గ్రహించి చివరికి బుద్ధుని మార్గంలోకి వచ్చినవారే! ఒక్కరంటే ఒక్కరు... ఒక్కరు కూడా ఆయనతో వాదించి, మనస్తాపం చెంది, హేళనకు గురికాబడి నిష్క్రమించినవారు లేనేలేరు.

ఎదుటివారిమీద పడి, ప్రశ్నల వర్షం కురిపించి, ఉక్కిరిబిక్కిరి చేసి, అవహేళన చేసి, ఓడించడం కూడా "హింసే" అని ప్రకటించిన గొప్ప శాస్త్రీయ మానవతావాది. మార్మికత లేని ధార్మిక ప్రబోధి.

ఒక మనిషి తెలియక అజ్ఞానంగా మాట్లాడుతున్నాడంటే అది అతని తప్పుకాదు. శాస్త్రీయ పరిజ్ఞానం ఉంటే అలా మాట్లాడడు. అతని ఆలోచన మారిపోతుంది– అంటే...

మనిషిని కాదు మనిషిలోని అశాస్త్రీయ భావజాలాన్ని మార్చాలి. దాని స్థానంలో శాస్త్రీయ భావజాలాన్ని నింపాలి– అనేది బుద్ధుని మార్గం. కేవలం మనుషుల్ని చంపి లేదా నియంత్రించి లేదా అణచి, వారిని పట్టి బంధించే భావజాలాన్ని పట్టించుకోకపోతే... ఈ హింసాకాండకు అంతూపొంతూ ఉండదు. అది అనంతం అవుతుంది. అలాకాకుండా భావజాలాన్ని మార్చితే... వ్యక్తిగత హింసలు వాటంతట అవే ఆగిపోతాయి–

ఫలితం ఖాయమే అయినా ఈ రెండో విధానం– అంటే భావజాలాన్ని మార్చాలి అనే విధానం– చాలా చాలా నెమ్మదిగా సాగే ప్రక్రియ. కానీ, ఓటమిలేని ప్రక్రియ.

భావజాలాన్ని కాకుండా వ్యక్తులకే పరిమితమైపోతే, విజయాలు కష్టం. ఒకవేళ వచ్చినా అవి ఎంతో కాలం నివడమూ కష్టమే!–

కాబట్టి సామాజిక మార్పు అంటే, ప్రాపంచిక దృక్పథంలోనే మార్పురావాలి.

బుద్ధునిది దృక్పథాల్ని మార్చే సిద్ధాంతం. బౌద్ధం ప్రకారం ఓడించడం అంటే గెలవడం కాదు. చంపడం కాదు. అడ్డు తొలగించుకోవడం అంతకంటే కాదు. పరిమార్చడం కాదు. పరివర్తన కలిగించడం. మార్చడం.

మార్పు సహజం. అనివార్యం. మార్పు ప్రకృతి ధర్మం. విశ్వ ధర్మం. కాబట్టి మనసూ మారుతుంది. మనిషీ మారతాడు. అయితే మారేవిధంగా ప్రభావం చూపేవిధంగా ప్రబోధించాలి. ఈ ప్రబోధించే విధానాన్ని బట్టే "ఎప్పటికి మారతాడు?" అనేది ఆధారపడి ఉంటుంది.

ఇది భావవాదంలా కన్పించే భౌతిక వాదం. అందునే ఇప్పటికీ చాలామంది బౌద్ధాన్ని భావవాదంగానే భ్రమపడుతూ ఉంటారు.

వారం రోజులు బ్రతికే జీవి ఆ వారం రోజుల్లో జరిగే మార్పుల్నే చూడగలుగుతుంది. కానీ, నెలరోజుల్లో జరిగే మార్పుని భ్రమ అనే అనుకొంటుంది.

పూతపూచిన మామిడి చెట్టును చూసిన భ్రమరం, 'మామిడి చెట్లకు ఎప్పుడూ పూతే ఉంటుంది' అనుకొంటుంది. ఆ చెట్టు పిందెలేస్తుందనీ, కాయలు కాస్తుందనీ, ఆ కాయలు పండ్లుగా మారతాయనీ ఊహించలేదు. ఒప్పుకోదు.

అలాగే... భౌతిక మార్పే కావాలనుకొనేవారు భావజాల మార్పులోని 'కాలం అవధిని' గమనించలేరు. ఒప్పుకోరు.

దీనికి బౌద్ధంలో ఒక కథ ఉంది. ఒక అడవిలో ఒక ఏనుగు, ఒక కోతి, ఒక తిత్తిరి పిట్టా ఉన్నాయి. అవి స్నేహంలో జీవిస్తున్నాయి. అవి ఒక రోజున ఒక చోట చేరి, "మనలో ఎవరు గొప్పవారో, ఎవరు కాలజ్ఞానులో వారికి మిగిలినవారు 'నమస్కరించాలి' అనుకున్నాయి.

అప్పుడు ఏనుగు– నేను మీ ఇద్దరి కంటే గొప్పదాన్ని, బలమైనదాన్ని, కాలజ్ఞానిని. ఇదిగో మనం ఇప్పుడు నిలబడి ఉన్న చెట్టును చూడండి. ఇది ఇంతప్పటినుండి నాకు తెలుసు. ఇది చిన్నమొక్కగా ఉన్నప్పుడు దాని మీదుగా నడచిపోయేదాన్ని. దాని చివరి రెమ్మలు నా పొట్టకు తాకీ తాకకుండా ఉండేవి." అని చెప్పి– కాబట్టి నాకే మొక్కండి అంది.

అప్పుడు కోతి నవ్వి–

"మిత్రమా ఆగు! ఇది నీ పొట్టకు తాకినప్పటినుండి తెలుసు అంటున్నావు. కానీ అంతకంటే చిన్నప్పటినుండే నాకు తెలుసు. నేను కూర్చొని, దాని చివరి లేత ఇగుర్లు తినేదాన్ని తెలుసా– కాబట్టి నేనే బహు కాలజ్ఞానిని. కాబట్టి నాకే మొక్కండి." అంది.

పిట్ట మౌనంగా ఉండిపోయింది. "మరి నీవు? నీకేం తెలుసు?" అని అడిగాయి రెండూ.

"నాకా? వినండి. అదిగో ఆ నదికి అవతలిగట్టున ఒక మర్రిచెట్టు ఉంది. దాని కాయలు తిని, ఇటుగా వస్తూ ఇక్కడ రెట్ట వేశాను. ఆ రెట్టలోని విత్తనం నుండి మొలిచిన మొక్కే ఈ చెట్టు " అంది.

"ఆఁ... ఇలాంటి చెట్టు ఇంకొకటి ఉందా! అది అచ్చం ఇలాంటిదేనా?" అని ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టాయి కోతి, ఏనుగులు–

చూడండి! పిట్టకి ఈ మొక్కేకాదు. దాని పుట్టుకకి కారణమైన మరోమొక్క కూడా తెలుసు. రెండు తరాల అంతరాలు తెలుసు.

అందుకే ఆ రెండూ (కోతీ, ఏనుగూ) తిత్తిరిపిట్టకు వినయంగా నమస్కరించాయి.

ఈ కథలో కాలాల వ్యవధులు, ప్రత్యక్ష జీవితం రెండూ ఉన్నాయి. కాల వ్యవధుల్ని మన ప్రత్యక్షజ్ఞానం ఒక్కోసారి అందుకోలేకపోవచ్చు. కానీ... దాని పరిణామశీలతను గమనిస్తే అనుమాన ప్రమాణంతో సరిగ్గానే ఊహించవచ్చు. మనం భావజాల మార్పును కూడా అలాగే అంచనావేయాలి.

( తరువాయిత 44వ పేజీలో)

## అమ్మభాషను అంతరింపజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యావిధానం సర్వత్రా గర్హనీయం !!

అమ్మగర్భం నుండే గ్రహించి, భూమిపై పడినప్పటినుండి శిశువులు నేర్పకనే నేర్చేభాష, అమ్మభాష! తొలిబడి అయిన అమ్మఒడి 'పసితనం' మొదలైన కొద్దీ .... ఇంటా, బయటా .. అమాంతం దొర్లుకుని వచ్చి, ఝరిలా ప్రవహించి, వ్యవహారంలో వినియోగించుకుని, అన్ని నైపుణ్యాలను స్వతః సిద్ధంగా నేర్చుకోగల 'అమృతం' లాంటి అమ్మభాషలో విద్యాభ్యాసం విద్యార్థులకు సమున్నత విలువలను, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని , మూర్తిమత్వాన్ని అందించి ఇస్తుంది.

ఈ సత్యాన్ని తెలిసి కూడా , 'నవ్యఆంధ్రప్రదేశ్' ప్రభుత్వం కొత్తగా "ఆంగ్ల మాధ్యమాన్ని" పురపాలక సంఘ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం మొదలైనాక, అత్యవసరంగా ప్రవేశపెట్టడం గర్హనీయం! ఆంగ్లమాధ్యమంలో వివిధ యాజమాన్యాలక్రింద ఇప్పటిదాకా ఉన్న పాఠశాలల్లో, 'మాతృభాషను కనీసం ఆంగ్లం- హిందీ ల తోపాటుగా తప్పనిసరిగా బోధించే విధంగా చట్టం తీసుకురావాలని కోరుతూ ఉంటే, దాన్ని పక్కనబెట్టి, ముందస్తు ప్రణాళిక ఏమీ లేకుండా, అరకొరగా ఉపాధ్యాయులకు 'ఆంగ్లబోధనలో' శిక్షణ నిచ్చామనిపించి, .. పాఠశాలలు తెరచిన మూడు నెలలు పూర్తవుతున్నా పాఠ్య పుస్తకాలను సమగ్రంగా అందించలేని లోపభూయిష్ట పద్ధతుల్లో .., 'పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం' వేసినట్లు అర్ధంతరంగా, గతేడాది తరగతిని 'తెలుగుమాధ్యమంలో చదివి, అకస్మాత్తుగా .., ఈ ఏడాది చదవాల్సిన తరగతిని 'ఆంగ్లమాధ్యమం' లో చదవాలనే మార్పుకు 'విద్యార్థులు తట్టుకోగల పరిస్థితి ఎలా వున్నా .., ఆంగ్లమాధ్యమంలో బోధించాల్సిన ఉపాధ్యాయుల దీనావస్థ, వర్ణనాతీతం.

మునిసిపల్ శాఖా మంత్రి, విద్యాశాఖ విధివిధానాలు రూపొందించే నిర్ణయాత్మక అధికారాలను తమ హస్తగతం చేసుకోవడం కూడా ఇపుడే కనిపిస్తున్న విచిత్ర పరిస్థితి ఇది !! ఎందుకీ హడావుడి? ఎవరి ప్రయోజనాలకు ఈ అకస్మాత్తు నిర్ణయం? విద్యావేత్తలు- సామాజిక శాస్త్రవేత్తలు అనుభవజ్ఞులతో చర్చలు జరిపి, పూర్వాపరాలు పరిశీలించి, ప్రణాళికాబద్ధంగా చేపట్టాల్సిన సంస్కరణలను, ఏకవ్యక్తి నిర్ణయంతో 'అత్యవసరంగా' ఎలా ప్రవేశ పెడుతారు? పైగా, "తెలుగులో చదువుకుంటే, ఎందుకూ పనికిరారు" అనే వ్యాఖ్య చేయడం ఎంతవరకు సబబు? ఇప్పటి తరమంతా, ఒకప్పుడు, అమ్మభాషలో చదివి ఉన్నతాధికారులయిన వారేనే ?!

ఏదేమైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అమ్మభాష' ను అంతరింపజేసే కుట్రతో "ఆంగ్లమాధ్యమాన్ని" తప్పనిసరి చేస్తున్నది. ఇది విద్యను వాణిజ్యంగా లాభాలను గడించే బడాబాబుల ప్రయోజనాలకే అని తేటతెల్లం అవుతూనే ఉంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగుభాషా సమితి మాతృభాషా పరిరక్షణ సంఘాలు ఏకమై, ప్రభుత్వం తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పోరాడాల్సిన తరుణం ఇదే ! లేదంటే అమ్మనుడిని అంతరింపజేసే ప్రభుత్వ కుట్రలు మరింతగా పెరగగలవు!!

-చాకలకొండ శారద

9440757799

## పిఠాపురంలో దాసరి లక్ష్మణస్వామి విగ్రహం నెలకొల్పాలి



ఈ మధ్య పిఠాపురంలో అభ్యుదయ కవి ఆవంత్స విగ్రహాన్ని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పూనుకొని నెలకొల్పజేయడం అభినందనీయం.

స్ఫూర్తిమూర్తుల విగ్రహాలు నెలకొల్పడం తెలుగుజాతి భవిష్యత్తరాల స్ఫూర్తికి వెలుగుదారులు అవుతాయి.

ఎన్నో గ్రంథాలు పరిశోధించి, వేలకొలది పద్యాలను సేకరించి, వింగడించి 'వర్ణన రత్నాకర'మనే సంపుటాలను ఏకవ్యక్తి శ్రమగా తెలుగుజాతికి అందించిన అనుపమాన సాహిత్య సేవకుడు దాసరి లక్ష్మణస్వామిగారు. వర్ణనలకు సముద్రమైన ఆయన గ్రంథం సమకాలికులైన వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి ఉద్దండ పండితులు బహుధా ప్రశంసించారంటేనే సరిలేని దాసరి సాహిత్యసేవ తెలుస్తోంది.

ఆయన చరిత్రాంశాలను సంక్షిప్తంగా చెక్కించి, ఆయన విగ్రహాన్ని ఆయన కుదురైన పిఠాపురంలో సరైన తావులో లేదా సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో నెలకొల్పడం మన కర్తవ్యం.

స్థానికులు, అన్ని ప్రాంతాల తెలుగువారు ఈ విగ్రహ వాక్యాలను ఆలోచించి ఆచరించ ప్రార్థన.

-సన్నిధానం నరసింహ శర్మ

(42వ పేజీ తరువాయి)

కుందేలులా పరుగులు తీసే వారికి బౌద్ధం తాబేలు నడకలాగానే అనిపించవచ్చు. కనిపించవచ్చు. కానీ, కడ విజయం తాబేలుదే అనేది ఖచ్చితం...

అందుకే బుద్ధుడు వ్యక్తుల భౌతిక మార్పులకంటే భావజాల మార్పులకే ప్రాధాన్యత ఇచ్చాడు. భావజాల కేంద్రమైన మనస్సునే అగ్రగామిగా చూశాడు. శాస్త్రీయ మధ్యమ మార్గంలో ముందుకు సాగాడు.

ఏ 'అతి'లేని శాస్త్రీయ దృక్పథం బౌద్ధానిది!

ఆ శాస్త్రీయతే ఇంకా బౌద్ధాన్ని బ్రతికిస్తోంది!

గుండెలోతుల్లోంచి వచ్చేదీ,
మనసువిప్పి చెప్పగలిగేదీ
అమ్మనుడిలోనే.



## ఒడిషారాష్ట్రం బరంపురంలో మహాత్మా హెల్పింగ్ క్లబ్ సేవా కార్యక్రమం: తెలుగు పాఠ్యపుస్తకాల పంపిణీ.

బరంపురం సిటీ బాలుర ప్రాథమిక పాఠశాలలో మహాత్మా హెల్పింగ్‌క్లబ్ ది.28-7-2017న 1వ తరగతి నుంచి 5వ తరగతి తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రచయిత్రి, అనువాదకురాలు డా॥తుర్లపాటి రాజేశ్వరి, కార్పొరేటర్ ఎం.జగన్నాథరావు ఆచారి, ఆర్.సూర్యనారాయణ(సూరబ్బాయి), విశ్రాంత ఉపాధ్యాయులు ఏ.భాస్కరరావు, జె.లక్ష్మణమూర్తి, ఎస్.పి.ఆదినారాయణ, మాజీ కార్పొరేటర్ భీష్మాచార్య చౌదరి, వి.రవికుమార్ గుప్త, ఎన్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు. క్లబ్ సమన్వయకర్తలు ఎం.వెంకటరమణ, ఏ.సురేష్, ఎన్.లక్ష్మణరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులను ఉద్దేశించి డా॥రాజేశ్వరి, శ్రీ ఏ.భాస్కరరావు ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ హృషీకేష్‌పతి, ఉపాధ్యాయినులు శ్రీమతి సాహు, జయశ్రీ సహకరించారు. **-శ్రీనివాస్**

## హైదరాబాదులో మేధావుల సమావేశం



ఆంజనేయ రెడ్డి గారి చొరవతో 26-8-2017 న హైదరాబాద్‌లో తెలుగు ఉద్యమకారుల సమావేశం హైదరాబాద్ స్టడీసర్కిల్‌లో జరిగింది.

డా.మిత్రా, ప్రొ. గారపాటి, డా॥ఆవుల మంజులత, డా॥జయధీర్ తిరుమలరావు, వేదకుమారి, ప్రొ. ఉషాదేవి, చలసాని బలరామయ్య, బులుసు మూర్తి, వీరభద్రం, రహ్మనుద్దీన్ షేక్, పొరుపల్లి కోదండ రామయ్య, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వగైరా పాల్గొన్నారు.

10వ తరగతి వరకు మాతృభాష మాధ్యమంలోనే చదువు ఉండాలి అన్న విషయంపై చర్చ చాలసేపు సాగింది. ఇంగ్లీష్ మాధ్యమం, ఇంగ్లీష్ సబ్జెక్టు వేరు అన్న విషయాన్ని గమనించాలి అని మిత్రా గారు వివరించారు. ఈ విషయమై ప్రభుత్వ వర్గాల్లో, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ఉద్యమానికి దీర్ఘకాల వ్యూహంతో పాటు, ఎత్తుగడలతో తక్షణమే సాధించ గలిగిన విషయాలను కూడ మరువరాదు. అందుకని అన్ని మాధ్యమ బడులలో తప్పకుండ తెలుగును ఒక విషయంగ పెట్టాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళాలి. 2003లో వచ్చిన జి.ఓ. 86, అమలు, కేంద్రీయ పాఠశాలల్లో కూడ ఆయా రాష్ట్ర భాష ఒక విషయంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య ఇచ్చిన ఆదేశం- అన్న సంగతులను వివరించాలి. ప్రభుత్వంలోని ముఖ్యులను కలిసి ఈ న్యాయమైన కోర్కెలను తీర్చటానికి ఒప్పించాలి. ఈ ఉద్యమంలోనికి యువకులను, ఉపాధ్యాయులను తీసుకురావాలి. **-పొరుపల్లి**

కవిత

## నేలను ఏలపాటలు వేస్తున్న ఏలికలు

**- డాక్టర్ కత్తి పద్మారావు**
9849741695

ఏళ్ళు పూండ్లు గడుస్తున్నా
కంటనీరు ఆగటం లేదు
ఏకతానికి[1] ఏకాంతం లేదు
నేలను ఏలపాటలు[2] వేస్తున్న ఏలికలు
ఏలుబడంట[3] ఏవకలిగించటమా?!
ఒజ్జలు[4] అచ్చరములు పండించువారు కాదా?!
వారి ఒడలుకు[5] మైపూతలెందుకు?
బతుకంటే ఒడిదుడుకులుండవా
ఉడుకు పడితే పతనమేగా!
నేతలు ఓద్రు[6] పెడుతున్నారు
ఓగిరము[7] పెట్టలేక ఓజస్సును కోల్పోతున్నారు.
గాదిలి[8] ఊపిరిలూదుతుందా! ఊపిరి తీస్తుందా!
ఏలిక ఊసులకు, గారడీవాని చేతలకు
తేడా లేదు కదా!
తలపోత లేని జీవి బండరాయితో సమానం కాదా!
తలలో నాలుకలా వుండవలసినవాడు
మండ్రగబ్బలా కరవడం సబబా!
ప్రతితూరీ తూగాడుతూ వుంటే నిలకడెప్పుడు?
'థూ' అని జనం అంటే
సరే అని నీవంటే ఇంకా ఏలిక ఏముంది?
వాడు తురుపార పడుతున్నాడు
సగం పొట్టు వాడి కళ్ళలోనే పడుతోంది?
ఏమైనా బతుకంటే నిజం చెప్పేవోడిదేరా!
లేకుంటే చావే మేలు మరి.

-------------------------

1. ఆలోచనలకు తగిన చోటు, 2 వేలం పాటలు,
3. రోత, 4. ఉపాధ్యాయులు, 5. దేహం,
6. గాడిద కూత,7 అన్నం, 8. ప్రేమ.




## ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్ళు కనుమరుగవుతాయి

విశాఖ నగరపాలకసంస్థ ఎదురుగా గల బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయియాస్ యూనియన్ కార్యాలయంలో "స్వయంపోషక స్వతంత్రపాఠశాలల చట్టం" (A.P.Self Financial Independent Schools Establidhment Act 2017)) అంశంపై సదస్సు జరిగింది.

ఈ సదస్సును ఆర్టీఈ ఫోరం మరియు విద్యావికాసవేదిక సంయుక్తంగా నిర్వహించాయి. ఆర్టీఈ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా శాసన మండలి సభ్యులు, ప్రోగ్రెసివ్ డెమొక్రాటిక్‌ఫ్రంట్ (శాసనమండలి పిడిఎఫ్ పక్ష నేత) విఠపు బాలసుబ్రహ్మణ్యం సదస్సుకు హాజరై ప్రసంగించారు.

ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యను కార్పొరేటీకరించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమై ఈ స్వయంపోషక స్వతంత్రపాఠశాలలచట్టం 2017తీసుకురావటానికి ప్రయత్నాలు చేస్తున్నదని, ఇది జరిగితే ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్ళు పూర్తిగా కనుమరుగవుతాయని అన్నారు. ఈ రూపొందించిన చట్టంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి హక్కులు లేవని, కేవలం యాజమాన్యాలకు మాత్రం ఎన్నో స్వతంత్ర అధికారాలను ఇస్తూ ఈ చట్టాన్ని రూపొందించారని, ఈ చట్టం బాలల హక్కులకు భంగం మాత్రమేకాక, విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకమని అన్నారు. ఇటువంటి సదస్సు అన్ని జిల్లాల్లో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు.

ఈ సదస్సులో ఉపాధ్యాయ, విద్యార్థిసంఘాల ప్రతినిధులు, ఎపిటిఎఫ్ ఉపాధ్యాయసంఘం నాయకులు, సింహాద్రప్పడు, రెడ్డి, ఎస్.ఎఫ్.ఎస్.నాయకురాలు(ఎయు) ప్రియాంక, నాయుడు, శ్రీమతి పి.మణి, పడాల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ ప్రసాద్. జోజులు, మధు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**-నరవ ప్రకాశరావు**



## తెలుగు పంచకావ్య వైభవం తెలుగు సాహిత్య ప్రాభవం

**ఉక్కునగరం:** జులై ఒకటి నుండి 12 వ తారీఖు వరకు స్టీల్‌ప్లాంట్ సెక్టర్ 5 లో సి.డబ్ల్యు సి.-1 ఆడిటోరియంలో వి.ఎస్.సి.ఎ (విశాఖ స్టీల్ కల్చరల్ అసోషియేషన్) ఆధ్వర్యంలో 'సొబగు సిరుల తెలుగు వెలుగులు' పేరిట చేపట్టిన తెలుగు సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమం గాజువాక ప్రాంత ప్రజల, సాహిత్య ప్రేమికుల ఆధ్యాత్మిక భావజాలమున ప్రేక్షకులను ఎంతో ఆనందపరుస్తూ వైభవోపేతంగా జరిగింది. ఇలాంటి అద్భుతమైన సాహిత్య కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో తెలుగు భాషాభిమానం ఏమాత్రమూ చెక్కుచెదరలేదని నిరూపించడం విస్కాకే చెల్లింది. ఉభయ తెలుగురాష్ట్రాల్లోనే కాక యావత్ భారతదేశాన్నిచుట్టి, అంతర్జాతీయంగా కూడా తెలుగు ప్రాభవాన్ని చాటిన అతిరథ మహారథుల్ని పిలిపించి వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహించిన ఈ కార్యక్రమం తెలుగువారిలో సాహిత్య స్ఫూర్తిని నింపింది.

శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదగురించి పేరి రవికుమార్, అల్లసాని పెద్దన మనుచరిత్ర గురించి గరికపాటి నరసింహారావు, తెనాలి రామకృష్ణుని పాండురంగమహాత్మ్యం గురించి దామెర వెంకట సుబ్బారావు, రామరాజభూషణుని వసుచరిత్ర గురించి రాంభట్ల నృసింహశర్మ, చేమకూర వెంకటకవి విజయవిలాసం గురించి కోలవెన్ను మలయవాసిని, బమ్మెర పోతన శ్రీమదాంధ్రమహాభాగవతం గురించి ప్రభల సుబ్రహ్మణ్యశర్మ విశ్లేషణాపూరిత ప్రసంగాలు చేశారు. **దేవులపల్లి దుర్గాప్రసాద్, కేశవరావు, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.** ప్రతీరోజూ ఉపన్యాస ప్రధానాంశాలలోని క్లిష్టమైన ప్రశ్నలను నిర్వాహకులు తయారుచేసి అడిగినపుడు, సమాధానాలు చెప్పి తమ అప్రమత్తతను చాటుకున్న ప్రేక్షకులకు ప్రధానవక్త చేత జ్ఞాపికలందజేసిన వైనం ప్రేక్షకాదరణ పొందింది.

> మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి.
> అభివృద్ధి నిరోధకమైనవి కూడా.
> అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు

# 'విశ్వదాభిరామ' కవి చేబోలు చిన్మయబ్రహ్మ కవి

– సన్నిధానం నరసింహశర్మ
92920 55531



విద్యార్థులకు తెలుగు భాషపై, సాహిత్యంపై అభిమానాన్ని రేకెత్తించడంలో తెలుగు పండితులు, తెలుగు ఉపన్యాసకులు వహించ వలసిన పాత్ర అంతా ఇంతా కాదు. అలా వహించిన వారిలో రాజమండ్రి పురపాలక సంఘోన్నత పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసిన చేబోలు చిన్మయ బ్రహ్మకవి పరిగణించ దగ్గవారు. పాఠ్యభాగాల పాఠాలు ఆసక్తికరంగా చెబుతూనే మధ్యలో తెలుగు భాషా ప్రాధాన్యం, మాధుర్యం, చరిత్ర, సాహిత్య అంశాలు ప్రత్యేకంగా చెబుతూ విద్యార్థులమైన మాకు ఆసక్తి కలిగించేవారు. గంభీరంగా, మధురంగా పద్యాలు భావాలు బోధపడే విధంగా పాడేవారు. ఏదో జీతం తీసుకోవడానికి మాత్రమే ఉద్యోగం చేస్తున్నామనే భావం వుండేదే కాదు. స్వంత డబ్బు ఖర్చుపెట్టి బహుమతులుఇచ్చి తెలుగు భాషాభిమానాన్ని కలిగించేవారు. అంతేకాదు. ఏ విద్యార్థులైనా మధ్యాహ్నం భోజనం చేయకుండా వుండి పోతున్నారేమో అని ఆయన చేతితో మా పొట్టలు కొట్టి మరీ తెలుసుకొనేవారు.

1928 ఆగష్టు 5న అనకాపల్లిలో జన్మించి 1990 డిశంబరు 30వ తేదీన రాజమహేంద్రిలో మరణించిన ఈ కవిగారు కేవలం అరవై రెండు సంవత్సరాలే జీవించారు. కానీ సమాజానికి కావ్య రచనల ద్వారా, దశాబ్దాల భాషా సాహిత్య బోధనలతో విద్యార్థి సమాజానికి సేవ చేశారు. ఆయన జీవించిన కాలంలో సాంప్రదాయ కవుల్లో బిరుదుల అభిమానం వుండేది. మధురకవి, కవితావిభూషణ, అభినవ పోతన వంటి బిరుదులిచ్చి అభిమానులు ఆయనను గౌరవించుకున్నారు. గండపెండేరం సంస్కారం కూడా జరిగింది. హృదయ పరివర్తము, రాజ్మహేంద్ర వర మార్కండేయ మృత్యుంజయం, మందానిలసందేశం, త్రివేణి, మీరాబాయి, రామానందం వంటి కావ్యాలను లాక్షణిక భావవిలసితాలుగా రాశారు. జీవం కలిగిన గ్రాంథిక వచనంలో అనేక వ్యాసాలు రాశారు. ఉపన్యాసంలో ఝుంకారం, భాషా నైపుణ్యం వంటి గుణాలుండేవి. ఆంధ్ర ప్రభుత్వ ఆస్థానకవి, ద్విశతాధిక గ్రంథకర్త శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి వీరంటే ఎంతో అభిమానము. జాషువా ప్రభావం వీరి పద్య రచనలపై ఉందని వీరి కావ్యాల పద్యాలు సాక్ష్యాలిస్తాయి.

నేను ఆర్థికంగా బాగా కష్టదశలో చదువుకుంటున్న సందర్భంలో ఆయన నాకు ప్రయివేటు ఉచితంగా చెప్పేవారు. వారి పిల్లలకు నాచే ప్రయివేటు చెప్పించి నాకు డబ్బిచ్చేవారు. నాడు గాలిపటాల వంటి పద్యాలు నేను రాస్తూంటే తప్పులు దిద్దేవారు. ఎప్పుడైనా నామీద కోపం వస్తే ఆ తాటాకుమంట కోపంలో 'గురువుల నెత్తిమీద శరకోపము పెట్టని వాడు శిష్యుడే' అనేవారు. ప్రేమ ఉన్ననాడు ఏమన్నా సెవనగానే వుంటుంది మరి!

శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు తమ శ్రమ పరిశోధనాగ్రంథం విశ్వబ్రాహ్మణ సర్వస్వంలో చిన్మయ బ్రహ్మకవి గారిపై మంచి రచన చేశారు. నేదునూరి గంగాధరంగారు ఈయన్ని కవిరాజుగారూ అని అభిమానంగా పిలిచేవారు. కొన్ని రోజులకి ఈయన మరణిస్తా రనుకొనే సందర్భాన శ్రీ జక్కంపూడి రామమోహనరావు తదితరులు వీరి వీధిలో వీరి ఇంటివద్దే ఘనసన్మానం చేయడం ఒక సంస్కార కార్యక్రమం.

తెలుగుజాతి ఎప్పటికీ గుర్తుంచుకోదగిన ఓ కావ్యం రాసి నందుకు చిన్మయబ్రహ్మకవికి మనం అప్పుపడి వున్నాం. జాతీయకవి వేమనపై ఉన్న కథలు, విన్న కథలు, చారిత్రకాంశాలు ఎన్నిటినో గుదిగ్రుచ్చి 'విశ్వదాభిరామం' అని రాసిన కావ్యం ఆయన కావ్య రాశిలో వాసి తెచ్చే గ్రంథం. అయితే సరైన రీతిలో దానిని పట్టి చూసిన నాథుడు లేకపోయాడు. గ్రంథస్థ పీఠికలు మాత్రం ఆ కబ్బం వెలుగుల్ని ప్రసరింపజేశాయి. 'పాండిత్యం, ప్రతిభ, చక్కని పద్యధార, యోగ్యమైన కల్పనాశక్తి' ఉందని విశ్వనాథ ప్రశంసించారు. 'కవిత్వరచనలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా కల వ్యక్తి రాసిన కావ్యం' అని యస్వీ జోగారావు కితాబిచ్చారు. 'ఈ వేమన కావ్యం నిశ్చల చిత్రంగా సాగిందన్నారు' సినారె. ఈ అభిప్రాయ ప్రశంసల్లో చెప్పదగిన గొప్ప తలపులు తూమాటి దొణప్పగారివి: "నన్నయ చిన్నయల గురించి తెలియక పోయినా వాడవాడలా వాడుకబడిన జాతీయ కవి వేమన్న. ఆయనను అకవి అని కుకవి అని ఎవరు ఈసడించినను, అరవదేశమున నారయుడు. కన్నడ దేశమున కనుగొనుడు. మన వేమన ఆబాల గోపాలమునకు తెలియును. ఆ వేమన గూర్చి జగమెరిగిన విద్వత్కవి చేబోలు చిన్మయ బ్రహ్మకవి విశ్వదాభిరామముగా కావ్యము వ్రాయుట ప్రశంసనీయమన్నారు. కవిగారి విశ్వదాభిరామాన్ని సకలకావ్య కళానిధానమనికూడా మెచ్చుకున్నారు. 'ఎన్నో లాలిత్యాల రాశి'గా కరుణశ్రీ మెచ్చుకున్నారు. ఎప్పుడో ఈ కావ్యంలోని ఎనిమిది పద్యాలను పదవతరగతి పాఠ్యాంశాల్లో ఒకటిగా పెట్టారు, దొరతనంవారు.

చక్కని శైలి, చక్కని భావ ప్రకటన, పద్య వేగధార, ఇన్ని మేలి గుణములున్న ఈ వేమన చరిత్రకావ్యాన్ని పునర్ముద్రించడానికి ఉదారులు పూనుకొన వలసిన అగత్యం వుంది. పాఠ్యగ్రంథాల్లో దీనిని గౌరవమను కోవాలి. నా తెలుగు భాష గొప్పది. నా సాహిత్యం మహోన్నతమైనది. తెలుగు వానిగా నా పుట్టుక గొప్పది అనే ఆత్మ గౌరవాన్ని తాను కలిగి వుండి, విద్యార్థి సమూహాలకు కలిగించాలనే ఈ కవిగారి తపన తప్పనిసరిగా ఆదర్శంగా భావించుకోవాలి. చేబోలు వారు మరణించినప్పుడు మధునాపంతులవారు ఆయన ఇంటికి వెళ్ళి 'లాక్షణికమైన పద్య కవిత్వం చెప్పేవారు రాజమహేంద్రవరంలో తగ్గిపోతున్నారు కదా' అని కన్నీరు పెట్టుకున్నారు.

కొన్ని దశాబ్దాల క్రితం ఆయన చెప్పిన పాఠాలు, చదివిన పద్యాలూ ఇప్పటికీ హృదయంలో తీపిపంపకపు గురుతులుగా కుదురుగా ఉన్నాయి.

# తెలుగు కోసం ఉద్యమ బాట పట్టాలి



గిడుగు రామూర్తికి నివాళులర్పిస్తున్న తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు

తెలుగు భాషా దినోత్సవం, గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా ఆగస్టు 29న తెనాలి ఇస్కఫ్ కార్యాలయంలో తెలుగు భాషోద్యమసమాఖ్య నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన డెల్టా పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వేమూరి శేషగిరిరావు మాట్లాడుతూ నేటి సమాజంలో తెలుగు భాష పట్ల నిర్లక్ష్యం ఎక్కువైందని, ప్రాధికార సంఘాన్ని ఏర్పాటుచేస్తామన్న హామీ నీటి మూటగానే మిగిలిపోయిందని, కనుక ఉద్యమించాల్సిన అవసరం వుందన్నారు. అధ్యక్షత వహించిన సామల లక్ష్మణబాబు మాట్లాడుతూ తెలుగును పాలనా భాషగా అమలు చేయాలని ప్రభుత్వం తెలుగును ప్రాథమిక విద్యనుండే నిర్బంధంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ బ్యాంకు చైర్మన్ డి.ఎల్. కాంతారావు, యల్లంశెట్టి హనుమంతరావు, చందు నాగేశ్వరరావు, గీతాంజలి మూర్తి, అడపా వెంకటక్ష్మిసంపత్ రాయుడు, బొల్లిముంత కృష్ణ, యక్కల శివన్నారాయణ, చెరుకుపల్లి సింగారావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, పేరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జులై 15న కళా లలితకళావేదికలో "రెక్కల పందిరిలో భజగోవిందం" గ్రంధావిష్కరణలో రఘుశ్రీ, యం.కె.సుగంబాబు, బైన దేవదాసు, రచయిత యం.రాధాకృష్ణ, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, డా.మనస చెన్నప్ప, కె.జె.మూర్తి, డా.తిరునగరి, ఆర్.వెలమకన్ని, పి.వి.దాసు.



ఆగస్టు 19న త్యాగరాయ గానసభలో డా॥ కపిలవాయి లింగ మూర్తికి శ్రీమతి అన్నంగి వెంకట శేషులక్ష్మలకు "బ్రహ్మశ్రీ నారాయణ దాసు శ్రీరామాచార్యులు" స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కె.జె.మూర్తి, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, పెద్దూరి, డా॥ఎన్.గోపి, ఎస్వీ.రఘువీర్ ప్రతాప్.



జులై 16న నెల్లూరులోని ఐఎమ్ఎ హాలులో గుర్రాల రమణయ్య రచన "మాటముల్లు" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి కె శివారెడ్డి. వేదికపై రచయిత గుర్రాల రమణయ్య, డా॥టి.పి.సుధాకర్, నేటినిజం సంపాదకులు బైసదేవదాసు, డా॥జి మురళీధర్.




అమ్మనుడి ప్రతినిధి, రచయిత శ్రీ సంకేపల్లి నాగేంద్రశర్మ ఉపాధ్యాయుడుగా ఉద్యోగవిరమణ చేసిన సందర్భంగా కరీంనగర్‌లో ఆగస్టు 12న జరిగిన సత్కారం. శరత్ సాహితీ కళాస్రవంతి అధ్యక్షుడు సబ్బని లక్ష్మినారాయణ, కవులు వాసం శివనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భారతీయ సంస్కృతిలో వనితామణులు:** రచన: ఆచార్య గోగినేని యోగ ప్రభావతీదేవి; పుటలు: 96, వెల: రు.60, ప్రచురణ: చెన్నపురి తెలుగువాణి. ప్రతులకు: టి.భాస్కర్, చెన్నపురి తెలుగువాణి, నం.15/37, రాజ మంగళం, 1వ మెయిన్‌రోడ్, విల్లివక్కమ్, చెన్నై-49.



**భావజలధి:** (కవిత); రచన: డా॥కడియాల వాసుదేవరావు; పుటలు: 95, వెల: రు.100, ప్రచురణ: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు.ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.



**ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ:** భారతీయ సాహిత్య నిర్మాతలు; రచన: సి.భవానీదేవి; పుటలు:132, వెల: రు.50, ప్రచురణ, ప్రతులకు: సాహిత్య అకాడమి, రవీంద్ర భవన్, 35, ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ-110 001, మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.



**బ్రహ్మనాయుడు:** చారిత్రక నవల; రచన: కొల్లా శ్రీకృష్ణారావు; పుటలు: 99, వెల: రు.50, ప్రచురణ: సాహితీ ప్రచురణలు, గుంటూరు. .ప్రతులకు: కొల్లా శ్రీకృష్ణారావు, రోహిణీ టవర్స్, 2/11, బ్రాడీపేట, గుంటూరు-522 002. ఫోన్:94400 33715



**జీవరహస్య లిపి :** కవితా సంకలనం. రచన: ఖాదర్ షరీఫ్; పుటలు:874, వెల: రు.100. ప్రచురణ: సన్నిధి ప్రచురణలు, నెల్లూరు. ప్రతులకు: పెరుగు రామకృష్ణ, ఇంటి.నెం.25-1-949, 5వ వీధి, నేతాజీనగర్, నెల్లూరు-4.ఫోన్: 9849230443, ఎస్.కె. షారూన్ బేగం, ఎస్.కె.ఫిర్దోసి బేగం, క్వా.నెం.ఎ/13, సోమశిల, ఎస్.పి. ఎస్.ఆర్. నెల్లూరు-524 301.



**కందుకూరివారి సరస్వతీ నారద విలాపము:** సమాలోచన(వ్యాఖ్యానం); రచన: ఎస్.ఆర్.పృథ్వి; పుటలు: 24, వెల:రు.30,ప్రచురణ: పృథ్వి పబ్లికేషన్స్, ప్రతులకు: శ్రీమతి పి.ఉషారాణి, 3-866, ఎమ్.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరము-533 101. ఫోన్: 0883-2421123 మరియు మణికంఠ బుక్ సెంటర్, మెయిన్ రోడ్, రాజమహేంద్రవరము.



**మాటముల్లు :** కవితా సంకలనం. రచన: గుర్రాల రమణయ్య; పుటలు:144, వెల: రు.100, ప్రతులకు: గుర్రాల రమణయ్య, ఇంటి.నెం.628, లెక్చరర్స్ కాలనీ, మాగుంట లే అవుట్, నెల్లూరు-524 003.



**కొళ్ళో జగ :** నామిని కైగట్టిన కతలు. రచన: నామిని. పుటలు: 88, వెల: రు.80/, ప్రచురణ: టామ్ సాయర్ బుక్స్, తిరుపతి. ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలూ, నవోదయ, కాచిగూడ, హైదరాబాద్.



**గుంటూరు నరసభూపతి:** నడింపల్లి నరసింహా రావుగారి జీవిత సంగ్రహం: రచన: రావినూతల శ్రీరాములు. పుటలు: 46, వెల: రు.50/,ప్రచురణ, ప్రతులకు:గుంటూరు కేసరి సేవాసమితి, 12-15-46, శ్రీసదనము, కొత్తపేట, గుంటూరు-522 001. ఫోన్:94402 64860



**మాకు మేమే:** మహారాష్ట్ర తెలుగు రచయితల కవితలు, కథల సంగ్రహం. సంపాదకులు: సంగివేని రవీంద్ర. పుటలు: 136, వెల: రు.150/, ప్రచురణ, ప్రతులకు: ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా, 10-సి, లఖంసి నపూ రోడ్, దాదర్(ఈస్ట్), ముంబాయి-14.






**నా నాస్తికత్వం**
శ్రీశ్రీ
పుటలు:95,వెల:రు.80/




**మహాస్వాప్నికుడు:**
రచన: డా॥ పాపినేని
పుటలు:31,వెల:రు.30/



**శ్రీశ్రీ రేఖాచిత్రాలు:**
సింగంపల్లి
పుటలు:47,వెల:రు.60/




**మహాకవీ........**
కె.వి.యస్.వర్మ
పుటలు:31,వెల:రు.30/




**శ్రీశ్రీ మన సంగీతం:**
సింగంపల్లి
పుటలు:31,వెల:రు.30/




**శ్రీశ్రీయే........**
దివికుమార్
పుటలు:40,వెల:రు.30/

ప్రతులకు: సింగంపల్లి అశోక్‌కుమార్, శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతీనగర్, విజయవాడ-520 004. ఫోన్: 98485 04649

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

# తాపీ ధర్మారావు పురస్కారం - 2017



పాత్రికేయుడు,
రచయిత,
సాహితీ విమర్శకుడు



## సతీష్ చందర్ గారికి

సతీష్‌చందర్ ప్రసిద్ధ జర్నలిస్టు. పత్రికా సంపాదకులు, కవి, వ్యంగ్య రచయిత, కథకులు, విమర్శకులు, మీడియా బోధకులు. ఎ.పి.కాలేజ్ ఆఫ్ జర్నలిజంను స్థాపించి రెండు దశాబ్దాలుగా 2500 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తన 33 ఏళ్ళ అనుభవంలో పాతికేళ్ళుగా ఏదోఒక పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకునిగా రావటానికి ముందు రిపోర్టర్ నుంచి ఛీఫ్ రిపోర్టర్ వరకూ రిపోర్టింగ్‌లో అన్ని స్థాయిలలోనూ (ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, సుప్రభాతం వంటి) పలు పత్రికలలో పనిచేశారు. వివిధ పాత్రికేయ, సాహితీ ప్రక్రియలకు చెందిన 19 పుస్తకాలను వెలువరించారు. ఆయన రాసిన 'పంచమవేదం' పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగా ఉంది. ఇంగ్లీషులోకి అనువాదం అయింది. ఈ రచనకై ఆయనకు అనేక పురస్కారాలు అందాయి. నడుస్తున్న రాజకీయాలపై జానపద కథలుగా రాసిన 'ఇతిహాసం', రాజకీయ వ్యంగ్యాస్త్రంగా రచించిన వ్యాసాల సంకలనం 'దరువు', అనుబంధాలు కాకుండా అవసరాలకు మనుషులను కట్టిపారేస్తున్న పరిస్థితులపై రాసిన వ్యంగ్యకథల సంపుటి 'చంద్రహాసం', రైతుల ఆత్మహత్యలు, దళిత ఆత్మగౌరవ పోరాటాలు, బహుళజాతి సంస్థల ఆగడాలపై వచ్చిన కవిత్వం 'ఆదిపర్వం' వంటివి ఆయనకు పేరుతెచ్చిన రచనలు.

2017 తాపీధర్మారావు పురస్కారాన్ని సతీష్‌చందర్ అందుకోనున్నారు.

**పురస్కారసభ హైదరాబాదులో 2017 అక్టోబరు నెలలో జరుగుతుంది.**

తేదీ, సమయం, స్థలం వివరాలను 'అమ్మనుడి' అక్టోబరు సంచికలో ప్రచురిస్తాము.



తాపీ ధర్మారావు వేదిక, విజయవాడ
డా. సామల రమేష్‌బాబు, ఫోన్: 9848016136



డా॥ఎన్. వేణుగోపాల్-2009



డా॥కె. శ్రీనివాస్-2009



శ్రీ టంకశాల అశోక్-2013



శ్రీ జి. శ్రీరామమూర్తి-2014



శ్రీ ఎ. కృష్ణారావు-2015



శ్రీ ఆర్‌ఎం. ఉమామహేశ్వరరావు-2016

AMMANUDI (Telugu Monthly)
September 2017, Vol.3, Issue 7
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

